
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 142
శనివారం 12-8-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



టైటిల్ పోరుకు భారత్
ఆసియా చాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో 5–0తో జపాన్‌పై గెలుపు. -15లో



ఆర్‌బీఐ వదిలినా...
0.10 శాతం వడ్డీరేట్లు పెంచిన బీఓబీ, కెనరా, బీఓఎం - 15లో



మణిపూర్ మండుతుంటే జోకులా?
మణిపూర్ హింసాకాండపై పార్లమెంటులో బదులివ్వమంటే ప్రధాని మోదీ జోకులేస్తూ ప్రసంగించారని రాహుల్ మండిపడ్డారు.
- వివరాలు 6లో



ఎంపీ రాఘవ్ చద్దా సస్పెన్షన్
నిబంధనల ఉల్లంఘన, అనుచిత ప్రవర్తన, ధిక్కార వైఖరి ఆరోపణలపై ఆప్ ఎంపీ రాజ్య సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు.
- వివరాలు 6లో



నటి జయప్రదకు జైలుశిక్ష
కార్మికుల బీమా సొమ్మును చెల్లించకుండా మోసగించిన కేసులో మాజీ ఎంపీ జయప్రదకు చెన్నై కోర్టు 6 నెలల జైలుశిక్ష విధించింది.
- వివరాలు 6లో



ఒత్తిడి 'కోటా' ఎక్కువై..
రాజస్తాన్‌లోని కోటాలో ఉన్న పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లలో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై కథనం.
- వివరాలు 6లో

మూక దాడికి మరణమే

మైనర్లపై అత్యాచారానికి సైతం మరణశిక్షే

మూడు నేర న్యాయ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

బ్రిటిష్ చట్టాలకు రాం రాం... ఇక స్వదేశీ 'న్యాయం'

- ఐపీసీ, సీఆర్ పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ లకు చెల్లుచీటీ
- వాటి స్థానంలో భారతీయ చట్టాలు
- తొలిసారిగా ఉగ్రవాదానికి నిర్వచనం
- రాజద్రోహం సెక్షన్ పూర్తిగా ఎత్తివేత


శుక్రవారం లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ప్రస్తుత చట్టం..
- ఇండియన్ పీనల్ కోడ్ -1860
- క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్-1898
- ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-1872

ప్రతిపాదిత చట్టం..
- భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) బిల్లు-2023
- భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) బిల్లు-2023
- భారతీయ సాక్ష్య (బీఎస్) బిల్లు-2023

న్యూఢిల్లీ: స్వతంత్ర భారత చరిత్రలోనే చరిత్రాత్మకమని చెప్పదగ్గ ఘట్టం శుక్రవారం లోక్‌సభలో ఆవిష్కృతమైంది. బ్రిటిష్ వలస పాలన తాలూకు అవశేషాలుగా కొనసాగుతూ వస్తున్న మూడు కీలక నేర న్యాయ చట్టాలకు చెల్లుచీటీ పాడే దిశగా పెద్ద ముందడుగు పడింది. వాటి స్థానంలో స్వదేశీ చట్టాలను తెచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్‌లు చరిత్రగా మిగలనున్నాయి. వాటి స్థానంలో పూర్తి భారతీయ చట్టాలు రానున్నాయి. ఈ మేరకు న్యాయ సంహిత బిల్లు- 2023, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిల్లు-2023, భారతీయ శిక్షా బిల్లు-2023లను కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 'ప్రతిపాదిత చట్టాలు దేశ నేర న్యాయ వ్యవస్థను సమూలంగా మెరుగుపరుస్తాయి. ప్రతి భారతీయుని హక్కులను పరిపూర్ణంగా పరిరక్షించాలన్న స్ఫూర్తికే పెద్ద పీట వేస్తాయి' అని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు సమకాలీన అవసరాలు, వారి ఆకాంక్షలను తీర్చేందుకు అవసరమైన అన్ని మార్పుచేర్పులను కొత్త బిల్లుల్లో పొందుపరిచినట్టు వివరించారు. వాటిని పార్లమెంటరీ

మిగతా 6వ పేజీలో ▶

కొత్త నేర-న్యాయ ప్రక్రియ ఇదీ...
- 90 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలు చేయాలి.
- పరిస్థితిని సమీక్షించాక కోర్టు మరో 90 రోజుల సమయం ఇవ్వొచ్చు.
- దర్యాప్తును 180 రోజుల్లోపు పూర్తి చేసి విచారణకు పంపాలి.
- విచారణ ముగిశాక 30 రోజుల్లోపు తీర్పు వెలువడాలి.

సం'క్షేమం'గా ఎన్నికలకు

ఎన్నికల వ్యూహాలతోపాటు పార్టీ మేనిఫెస్టోపైనా కేసీఆర్ కసరత్తు
- ప్రజల్లో వ్యతిరేకత తగ్గించడం, లబ్ధిదారుల ఓట్లు గంపగుత్తగా పొందడమే లక్ష్యం
- సంక్షేమ పథకాలు అందని వర్గాలను వెతికి తాయిలాలు ప్రకటించే యోచన
- విపక్షాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదనే యోచనలో సీఎం
- కాంగ్రెస్, బీజేపీ నేతలకు గాలం.. టికెట్లు కేటాయించే చాన్స్



సాక్షి, హైదరాబాద్: తమ అమ్ముల పొదిలో అనేక అస్త్రాలున్నాయని, వాటిని ఒక్కొక్కటిగా ప్రజల్లోకి తీసుకెళ్తామని ఇటీవల శాసన సభ సమావేశాల సందర్భంగా చెప్పిన బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ అస్త్రాలకు పదును పెడుతున్నారు. హ్యాట్రిక్ విజయం సాధించి వరుసగా మూడోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దక్షిణాది నేతగా రికార్డును నెలకొల్పేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. వివిధ వర్గాల ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించడం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఓట్లను గంపగుత్తగా బీఆర్ఎస్‌కు అనుకూలంగా మలచడం లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే లోపే పలు నిర్ణయాలు తీసుకోవడంపై కేసీఆర్ దృష్టి సారించారు. గెలుపునకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవడం ద్వారా విపక్షాలకు ఏవిధమైన ఎన్నికల అస్త్రాలు దొరక్కుండా చూడాలని కేసీఆర్ భావిస్తున్నారు. మరోవైపు అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహానికి రూపకల్పనతోపాటు పార్టీ మేనిఫెస్టోపైనా కసరత్తు చేస్తున్నారు. అక్టోబర్‌లో ఎన్నికల షెడ్యూల్ వెలువడే సూచనలు కనిపిస్తుండటంతో వచ్చే నెల చివరి నాటికి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వంటి కార్యక్రమాలను వేగవంతం చేయడంపై సీఎం దృష్టి సారించారు. ఇప్పటికే వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గాడిన పెట్టేలా వరుస సమీక్షలు నిర్వహించాలని మంత్రులను ఆదేశించారు.

మేనిఫెస్టోకు తుది మెరుగులు

పేదలు మరింత పేదరికంలోకి కూరుకుపోకుండా సంక్షేమ పథకాలు తోడ్పడతాయని గట్టిగా నమ్ముతున్న కేసీఆర్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నారు. సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ పలు అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా బడ్జెట్ పరిమితులను దృష్టిలో పెట్టుకుని

మిగతా 8వ పేజీలో ▶

కాంగ్రెస్ ప్రచార నగారా!

- బీఆర్ఎస్ సర్కారు వైఫల్యాలపై ప్రజల్లోకి ప్రధాన ప్రతిపక్షం
- ఇంటింటికీ కరపత్రాలు.. రాష్ట్రవ్యాప్తంగా కార్నర్ మీటింగ్‌లకు ప్లాన్
- బోయిన్‌పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్ వేదికగా నేడు షెడ్యూల్..
- ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నామన్న మల్లు రవి - 8లో



విస్తృత భేటీలు.. ముమ్మర ప్రచారం

- రిజర్వ్‌డ్ నియోజకవర్గాలపై బీజేపీ ఫోకస్
- 28 నుంచి సెప్టెంబర్ 15 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ఇన్‌చార్జీల నియామకంతోపాటు కార్యకర్తలతో భేటీలు
- రాష్ట్ర ప్రభుత్వ దళిత, గిరిజన వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని నిర్ణయం - 8లో



న్యూస్‌రీల్

భావితరాల కోసం నీటి వనరులను కాపాడండి



భావితరాల కోసం నీటివనరులను కాపాడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. కానీ ఈ అంశంపై ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం సహించరానిదని వ్యాఖ్యానించింది.
- వివరాలు 12లో

తడబడుతూ.. ముందుకు?!



రాష్ట్రంలోని వైన్‌షాపుల నిర్వహణ కోసం రానున్న రెండేళ్లకు లైసెన్సులు పొందేందుకు చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియ గతంతో పోలిస్తే తడబడుతూ ముందుకెళుతోంది.ఇప్పటివరకు 15 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ గణాంకాలు చెబుతున్నాయి.
- వివరాలు 3లో

ఆర్టీసీ ఉద్యోగులకు ఇక ట్రెజరీ జీతాలు



ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ట్రెజరీ నుంచి జీతాల పంపిణీకి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కుదిరితే ఈ నెల నుంచే జీతాలు అందేలా ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.
- వివరాలు 12లో

'ఏఐ' పంట!



ఆధునిక యంత్ర పరికరాల రాకతో వ్యవసాయం కొంత పుంజుకోగా తాజాగా కొన్ని ఏఐ ఆధారిత పరికరాలు అందుబాటులోకి వచ్చాయి కూడా. మరి మొత్తంగా దీనివల్ల రైతులకు ఏం మేలు జరుగుతుంది? వ్యవసాయానికి ఏం ఒనగూరుతుంది?
- వివరాలు 16లో






కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

దేశానికి అన్నం పెడుతున్నాం

- వ్యవసాయ ఉత్పత్తుల్లో రాష్ట్రానిదే మొదటిస్థానం: మంత్రి కేటీఆర్
- తొమ్మిదేళ్లలో ఐదు రకాల విప్లవాలు సాకారమయ్యాయి
- దేశంలో తొలి అగ్రికల్చర్ డేటా ఎక్స్ఛేంజ్ ప్రారంభించుకోవడం గర్వంగా ఉందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉందని, దేశానికి తెలంగాణ అన్నం పెడుతోందని ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారకరామారావు చెప్పారు. రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. దేశంలో రైతులకు బీమా కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం కూడా తమదేనని, రైతులకు ఉచిత విద్యుత్ కోసం నెలకు రూ.వెయ్యి కోట్లు

మిగతా 5వ పేజీలో ▶

రాజకీయ నేతలకు అనుకూలంగానే పోలీసు బదిలీలు

ట్రాన్స్'ఫర్'పై ఈసీ దృష్టి!

- ఎన్నికల వేళ జరిగిన పోలీసు బదిలీలపై నజర్
- మాజీ ఐపీఎస్‌లు, నిఘావర్గాల సహకారానికి యోచన
- కోడ్ అమలైన తర్వాత పూర్తిస్థాయిలో ప్రక్షాళన!



సాక్షి, హైదరాబాద్: ఇటీవల పోలీస్‌శాఖలో భారీఎత్తున జరిగిన బదిలీలపై ఎన్నికల సంఘం (ఈసీ) దృష్టి పెట్టింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ లాంగ్ స్టాండింగ్‌గా వివిధ శాఖల్లో ఉన్న అధికారుల బదిలీకి ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే పోలీస్‌శాఖ విషయానికి వచ్చేసరికి కొందరు రాజకీయనేతలు తమకు అనుకూలంగా మార్చుకున్నారనే విషయం ఈసీ దృష్టికొచ్చింది. ఇలా కొత్త స్థానాల్లోకి వచ్చిన వారితో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించడం సాధ్యం కాదనే భావనలో ఉంది. ఈ వ్యవహారంపై మాజీ ఐపీఎస్‌లతో పాటు నిఘావర్గాల ద్వారా సమాచారం సేకరిస్తోంది. ఎలక్షన్ షెడ్యూల్ తర్వాత కోడ్ అమలులోకి వస్తుంది. ఆపై ప్రస్తుతం జరిగిన బదిలీల్లో అనేక స్థానాలు ప్రక్షాళన చేయాలని ఈసీ భావిస్తున్నట్టు సమాచారం.

ఈసారి గతానికి భిన్నంగా ఎందుకంటే...
పోలీసు విభాగంలో బదిలీలు సర్వసాధారణం. నిర్ణీత కాలపరిమితితో బదిలీలు జరుగుతూనే ఉంటాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ

మిగతా 3వ పేజీలో ▶

సూపర్ లగ్జరీ ప్రయాణికులపై 'వాటర్ చార్జ్'

- ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర రూ. 10 చొప్పున పెరిగింది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక తొలి సర్వీసు నుంచి ఇది అమల్లోకి వస్తోంది. ఇంత కాలం ఏసీ బస్సుల్లోని ప్రయాణికులకు మాత్రమే మంచినీటి సీసాలు అందించే పద్ధతిని ఇప్పుడు సూపర్ లగ్జరీ బస్సుల్లోనూ ఆర్టీసీ ప్రవేశపెడుతోంది. ప్రతి ప్రయాణికుడికి అరలీటరు మంచినీటి సీసాను అందించనుంది. ఈ నేపథ్యంలోనే ప్రతి టికెట్ ధరపై రూ.10 చొప్పున అదనంగా వసూలు చేయనుంది.


- వివరాలు 3లో


గ్రూప్-2పై 14లోగా నిర్ణయం చెప్పండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. లక్షల మంది ఎదురుచూసే అంశంలో జాప్యం కూడదన్న న్యాయమూర్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలన్న అభ్యర్థనపై 14వ తేదీలోగా నిర్ణయం తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. గ్రూప్-2 పరీక్ష వాయిదా వినతులపై నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) తెలపడంతో ఈ మేరకు అనుమతినిచ్చింది. 150 మందే పిటిషన్ వేశారు.. మిగతా అభ్యర్థులంతా గ్రూప్-2 నిర్వహణకు సిద్ధంగా ఉన్నారని కమిషన్ చెప్పడాన్ని తప్పుబట్టింది. లక్షల మంది కోర్టులో పిటిషన్ వేయలేరు కదా అని వ్యాఖ్యానించింది. నిర్ణయం వెల్లడించడానికి మరింత సమయం కావాలని తొలుత టీఎస్‌పీఎస్సీ కోరగా న్యాయస్థానం నిరాకరించింది. లక్షల మంది ఎదురుచూసే అంశంలో జాప్యం కూడదని చెప్పింది. విచారణను సోమవారానికి వాయిదా వేసింది. గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ సీహెచ్ చంద్రశేఖర్‌తోపాటు 149 మంది హైకోర్టును ఆశ్రయించారు. గురుకుల ఉపాధ్యాయ పరీక్ష, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్.. తదితర 21 నియామక పరీక్షలు ఒకే నెలలో ఉన్న నేపథ్యంలో గ్రూప్-2 వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల తరఫున న్యాయవాది బి.నర్సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి శుక్రవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాది ఆలూరి గిరిధర్‌రావు పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. 'గ్రూప్-2.. ముఖ్యమైన పరీక్ష. సమర్థులనే తీసుకోవాల్సి ఉంది. దీని కోసం వారు పూర్తిగా సన్నద్ధం అయ్యేందుకు టీఎస్‌పీఎస్సీ అవకాశమివ్వాలి. హడావుడిగా పరీక్ష నిర్వహణ నియామక ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. అది అభ్యర్థులకు, ప్రభుత్వానికి మంచిది కాదు..' అని చెప్పారు.

ఇప్పటికే ఏర్పాట్లన్నీ చేశాం..: టీఎస్‌పీఎస్సీ తరఫు న్యాయవాది రాంగోపాల్ వాదనలు

మిగతా 5వ పేజీలో ▶



వాయిదా వేస్తే ఇప్పట్లో కష్టమే!
- గ్రూప్-2 పరీక్షలపై టీఎస్‌పీఎస్సీ అంచనా
- 2 నెలల పాటు అందుబాటులో లేని ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలు
- ఎన్నికల ప్రక్రియతో అధికారులు బిజీగా ఉండే అవకాశం - 5లో

క్లుప్తంగా...

జనరిక్ మందులే రాయండి

డాక్టర్లకు జాతీయ మెడికల్ కమిషన్ పిలుపు



సాక్షి, హైదరాబాద్: బ్రాండెడ్ మందుల ధరల కంటే జనరిక్ మందుల ధరలు 30 శాతం నుంచి 80 శాతం వరకు చౌకగా ఉంటాయని, ఈ మందులనే రాయాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) డాక్టర్లకు పిలుపునిచ్చింది. ఈ మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఎన్ఎంసీఆర్ఎంపీ) పేరుతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రోగులు మందులకు అధికంగా ఖర్చు చేస్తున్నందున దీనిని అరికట్టేందుకు జనరిక్ మందులు రాయాలని విజ్ఞప్తి చేసింది. జనరిక్/ప్రొప్రైటరీ/ఫార్మాకోలాజికల్ పేర్లతో మాత్రమే మందులను రాయాలని కోరింది. మార్కెట్‌లో రోగికి అందుబాటులో ఉండే సాధారణ మందులను మాత్రమే సూచించాలని తెలిపింది. జన్ ఔషధి కేంద్రాలు, ఇతర జనరిక్ ఫార్మసీ ఔట్‌లెట్ల నుంచి మందులు కొనుగోలు చేసేలా రోగులను ప్రోత్సహించాలని, బ్రాండెడ్ మందులకు జనరిక్ మందులకు ఏమాత్రం తేడా లేదని ప్రజల్లో అవగాహన పెంచాలని స్పష్టం చేసింది. జనరిక్ మందులపై ఎంబీబీఎస్, పీజీ మెడికల్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి. మందుల చీటీని (ప్రిస్క్రిప్షన్) స్పష్టంగా అర్థమయ్యేలా పెద్దక్షరాలతో రాయాలి. అంతే కాదు వీలైనంత వరకు ప్రిస్క్రిప్షన్లను టైప్ చేసి ప్రింట్ ఇస్తే మంచిదని పేర్కొంది.

14 నుంచి 24 వరకు గాంధీ చిత్ర ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 14 నుండి 24 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని 582 సినిమా స్క్రీన్‌లలో గాంధీ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 14న ఉదయం 8 గంటల నుంచి చిత్ర ప్రదర్శన ప్రారంభమవుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15, 20 తేదీలలో గాంధీ చిత్ర ప్రదర్శన ఉండదని వెల్లడించారు.

పర్యాటకం, ఆతిథ్య నిర్వహణ కోర్సులకు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, తెలంగాణ టూరిజం మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో పర్యాటకం, ఆతిథ్య నిర్వహణ కోర్సులకు గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎంబీఏ (మాస్టర్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) రెండేళ్ల పాటు, బీబీఏ(బ్యాచిలర్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నాలుగేళ్లు, బీఎస్సీ (బ్యాచిలర్ ఇన్ సైన్స్) మూడేళ్ల కోర్సులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. మరింత సమాచారం కోసం www.nithm.ac.inలో చూడాలని, మరిన్ని వివరాలకు 95537 00035, 78424 55581, 95152 41607 నంబర్లలో సంప్రదించాలని సూచించింది.

స్మార్ట్ బజార్‌లో మళ్లీ 'పైసా వసూల్ సేల్ ఆఫర్'

సాక్షి, హైదరాబాద్: స్మార్ట్ బజార్‌కు చెందిన సూపర్ స్టోర్‌లలో మళ్లీ 'ఫుల్ పైసా వసూల్ సేల్ ఆఫర్'ను ఆ సంస్థ ప్రకటించింది. ఈ నెల 12 నుంచి 16వరకు దేశవ్యాప్తంగా సుమారు 850కి పైగా ఉన్న తమ సూపర్ స్టోర్‌లలో వినియోగదారులకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి దామోదర్ మాల్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్యాకింగ్ చేసిన ఆహారవస్తువులు, గృహోపకరణాలు, సౌందర్యసాధనాల ఉత్పత్తులు, లగేజ్ బ్యాగ్‌లు, సూట్‌కేసులు, చెప్పులు వంటివాటిపై ఆకర్షణీయమైన ఆఫర్లలో తక్కువధరకే లభిస్తాయని వెల్లడించారు. బిస్కెట్స్, చాక్లెట్స్, శీతలపానీయాలు, షాంపూలు, సబ్బులు, డిటర్జెంట్ సబ్బులు, డియోడ్రెంట్స్‌పై 50%వరకు తగ్గింపు ధరలపై లభిస్తాయని తెలిపారు. ఐదు కేజీల బియ్యం ప్యాకెట్‌తో కలిపి మూడు లీటర్ల మంచినూనె కేవలం రూ.729లకే లభిస్తుందని వెల్లడించారు. ఈ ఆఫర్ ప్రకటించిన తేదీల్లో వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు.

లిఫ్ట్‌లో ఇరుక్కుంటున్నారు!



లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వేలో ఆసక్తికర అంశాలు

- గత మూడేళ్లలో తాము లేదా తమ కుటుంబ సభ్యులు లిఫ్ట్‌లో చిక్కుకున్నట్టు 58 శాతం మంది వెల్లడి
- లిఫ్ట్ మెయింటెనెన్స్‌కు థర్డ్ పార్టీ సేవలు వినియోగిస్తున్న 42 శాతం మంది
- తమ అపార్ట్‌మెంట్లలో లిఫ్ట్‌లకు మెయింటెనెన్స్ లేదని 5 శాతం మంది వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఇటీవల కాలంలో బహుళ అంతస్తుల భవనాలు పెరిగాయి. గేటెడ్ కమ్యూనిటీల్లో 20 ఫ్లోర్లకు పైనే నిర్మిస్తున్నారు. అపార్ట్‌మెంట్లలోనే కాకుండా ఇల్లు, కార్యాలయం, షాపింగ్ మాల్స్, ఫ్యాక్టరీలు ఇలా ఎక్కడయినా.. మెట్లపైనుంచి నడిచివెళ్లే వారికంటే.. లిఫ్ట్ ఎక్కడుందా అని వెతికేవారే ఎక్కువ. బహుళ అంతస్తుల భవనాల్లో ఇళ్లలో ఉండే వారు, కార్యాలయాల్లో పనిచేసేవారు వయసుతో సంబంధం లేకుండా దాదాపు ప్రతినిత్యం లిఫ్ట్‌లు వాడుతూనే ఉన్నారు. అయితే ఇటీవల లిఫ్ట్‌లు పని చేయక అందులో ఇరుక్కుని ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఆగస్టు 3న ఢిల్లీలోని నోయిడా సెక్టార్ 137లో జరిగిన ఓ ఘటనలో 70 ఏళ్ల వృద్ధురాలు 45 నిమిషాలపాటు లిఫ్ట్‌లో ఇరుక్కుని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చివరకు ప్రాణాలు కోల్పోయారు. లిఫ్ట్ వాడకం అన్నది నిత్య జీవితంలో భాగమైంది. అయితే లిఫ్ట్ వాడకం, దాని నిర్వహణ తదితర అంశాలపై లోకల్ సర్కిల్స్ సంస్థ దేశవ్యాప్తంగా 329 జిల్లాల్లో 42 వేల మందిని సర్వే చేసింది. ఇందులో 61 శాతం మంది పురుషులు, 39 శాతం మంది మహిళలు పాల్గొని వారి అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. గత మూడేళ్లలో తమ గృహ సముదాయంలో లేదా కార్యాలయంలో తాము కానీ, తమ కుటుంబ సభ్యులు కానీ లిఫ్ట్‌లో ఇరుక్కుని ఇబ్బందిపడ్డారని 58 శాతం మంది అభిప్రాయం వెల్లడించారు.

గణాంకాలు(శాతాల్లో)...

లిఫ్ట్‌లో ఎప్పుడైనా ఇరుక్కున్నారా..?

అదృష్టవశాత్తు చిక్కుకోలేదు	32	చిక్కుకున్నాం, కానీ ఎన్నిసార్లో చెప్పలేం	5
ఒకటి లేదా రెండుసార్లు...	31		
మూడు నుంచి ఐదుసార్లు	11	గత మూడేళ్లలో చిక్కుకోలేదు...	7
ఆరు నుంచి తొమ్మిదిసార్లు..	11		
చెప్పలేం	3		

లిఫ్ట్ మెయింటెనెన్స్?

లిఫ్ట్ తయారీ సంస్థే చూస్తుంది	46
థర్డ్ పార్టీ కాంట్రాక్ట్‌కు ఇచ్చాం	42
సొసైటీ ఉద్యోగులే మెయింటైన్ చేస్తారు	7
మెయింటెనెన్స్ లేదు.. సమస్య వస్తే రిపేర్ తప్ప	5

లిఫ్ట్‌ల నిర్వహణపై ప్రభుత్వం కచ్చితమైన నిబంధనలు నిర్ణయించాలా?

కచ్చితమైన నిబంధనలు రూపొందించాలి	అలా చేయడం వల్ల సమస్యలు పెరుగుతాయి... అమలు కూడా సాధ్యం కాదు
76 శాతం మంది	24 శాతం మంది

సూపర్ లగ్జరీ ప్రయాణికులపై 'వాటర్ చార్జ్'

అరలీటరు 'జీవా'మంచినీటి సీసా ఇవ్వనున్న ఆర్టీసీ | **దూరంతో నిమిత్తం లేకుండా ప్రతి టికెట్ ధర రూ.10 పెంపు**

సాక్షి, హైదరాబాద్

ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర రూ.10 చొప్పున పెరిగింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత శనివారం (ఆగస్టు 12) తొలి సర్వీసు నుంచి ఇది అమల్లోకి వస్తోంది. ఇంతకాలం ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు మంచినీటి సీసాలు అందించే పద్ధతిని ఇప్పుడు సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా ప్రవేశపెడుతున్నారు. ప్రతి ప్రయాణికుడికి అరలీటరు మంచినీటి సీసాను అందించనున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి టికెట్ ధరపై రూ.10 చొప్పున అదనంగా వసూలు చేయనున్నారు. దూరంతో ప్రమేయం లేకుండా ఈ అదనపు మొత్తం చార్జి చేస్తారు. టికెట్ ధరలోనే దాన్ని కలిపేస్తారు. దీంతో ప్రయాణికుడికి మంచినీటి సీసా అవసరం ఉన్నా లేకున్నా ఈ అదనపు చార్జీతో కూడిన టికెట్ తీసుకోవాల్సిందే. నిత్యం లక్ష మంది ప్రయాణికులపై ఈ తాజా నిర్ణయం ప్రభావం చూపనుంది.

శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అమల్లోకి..



టికెట్‌తో పాటే జీవా బాటిల్..

దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు సాధారణంగా వాటర్ బాటిళ్లు దగ్గర పెట్టుకుంటారు. చాలామంది బస్టాండ్లలో కొంటారు. బయటి నీటిని తాగేందుకు ఇష్టపడని వారు ఇంటి నుంచి తెచ్చుకుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గరుడ ప్లస్, గరుడ, లహరి, రాజధాని ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు అరలీటరు పరిమాణంలో ఉన్న నీటి సీసాలను అందించడం ప్రారంభించారు. గతంలో బిస్లరీ సంస్థతో చేసుకున్న ఒప్పందం మేరకు ఆ బ్రాండు మంచినీళ్లు అందించేవారు. ఇటీవల జీవా పేరుతో ఆర్టీసీ సొంతంగా ప్యాకేజ్డ్ మంచినీటిని మార్కెట్‌లోకి తెచ్చింది. ఆర్టీసీ బస్టాండ్లలో ఈ నీటిని విక్రయిస్తున్నారు. ఏసీ బస్సుల్లో కూడా గతంలో ఇచ్చిన బిస్లరీ బాటిళ్లకు బదులు జీవా నీటినే ఇస్తున్నారు. ఇప్పుడు అదే నీటిని సూపర్ లగ్జరీ బస్సుల్లోనూ పంపిణీ చేయాలని నిర్ణయించారు.

ఆర్టీసీకి ఏం లాభం?

జీవా నీటికి ఇంకా ఆదరణ పెరగలేదు. దీన్ని మార్కెట్‌లోకి తెచ్చిన సమయంలో సీసా, అందులోని నీటి నాణ్యత విషయంలో ఫిర్యాదులొచ్చాయి. స్వయంగా సొంత సిబ్బందే నాణ్యతపై ప్రశ్నించటంతో, ఒప్పందం చేసుకున్న సంస్థను నాణ్యత విషయంలో సంస్థ హెచ్చరించింది. ఈ క్రమంలో కొంతకాలం నిలిపేసి దిద్దుబాటు తర్వాత ఇటీవలే మళ్లీ విడుదల చేశారు. అయితే ఇప్పటికీ అది ప్రయాణికులకు పూర్తిస్థాయిలో పరిచయం కాలేదు. ఈ నేపథ్యంలోనే జీవా బ్రాండ్‌కు ప్రాచుర్యం కల్పించడమే లక్ష్యంగా ఆర్టీసీ తాజా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు దీని ద్వారా కొంత అదనపు ఆదాయం కూడా లభిస్తుందనేది ఆర్టీసీ ఆలోచనగా చెబుతున్నారు. ప్రతి అరలీటరు సీసాపై రూ.5.50 చొప్పున, దాన్ని తయారు చేస్తున్న ప్రైవేటు సంస్థకు చెల్లిస్తారు. డ్రైవర్‌కు ఇన్సెంటివ్‌గా 50 పైసలు చెల్లిస్తుంది. మిగతా రూ.4ను తన ఆదాయంగా ఆర్టీసీ లెక్కలు వేస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీలో దాదాపు 700 సూపర్ లగ్జరీ బస్సులున్నాయి. వీటిల్లో నిత్యం దాదాపు లక్ష మంది ప్రయాణిస్తున్నారు. ఈ లెక్కన వారిపై రోజుకు రూ.10 లక్షల అదనపు భారం పడుతుందని అంచనా వేస్తున్నారు.

తడబడుతూ.. ముందుకు?!

- ఇంకా జోరందుకోని వైన్‌షాప్‌ల లైసెన్సు దరఖాస్తుల ప్రక్రియ
- గతంలో మొదటి ఏడు రోజుల్లో 9 వేలకు పైగా దరఖాస్తులు
- ఈసారి 8 వేల లోపే.. శుక్రవారంతో కలిపి 15 వేలు దాటిన దరఖాస్తులు... మళ్లీ వరుస సెలవులు...
- 16,17,18 తేదీల్లోనే భారీగా దాఖలయ్యే అవకాశం
- కోర్టులో ఇప్పటికే నాలుగు కేసులు... తాజాగా రెండు దాఖలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వైన్‌షాపుల నిర్వహణ కోసం రానున్న రెండేళ్ల కాలానికి లైసెన్సులు పొందేందుకు గాను చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియ గతంతో పోలిస్తే తడబడుతూ ముందుకెళుతోంది. 2023–25 సంవత్సరాలకు గాను వైన్‌షాపులకు లైసెన్సులను లాటరీ పద్ధతిలో కేటాయించేందుకు గాను ఈనెల 4వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా, ఎనిమిదో రోజు శుక్రవారం ముగిసేనాటికి 15వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ గణాంకాలు చెపుతున్నాయి. అదే గత ఏడాది తొలి ఎనిమిది రోజుల్లో 14,500 వరకు దరఖాస్తులు రావడం గమనార్హం. తొలి ఏడు రోజుల్లో ఈసారి 8వేల వరకు దరఖాస్తులు రాగా, గతంలో 9వేల వరకు వచ్చాయి. గతంతో పోలిస్తే తొలి వారంలో దరఖాస్తుల సంఖ్య తగ్గినా, శుక్రవారం చివరి నిమిషంలో పెద్ద ఎత్తున వచ్చిన దరఖాస్తులతో ఎక్సైజ్ యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. అయితే, గతంలో షెడ్యూల్ ఇచ్చిన తర్వాత దరఖాస్తుల ప్రక్రియ కోసం 10 రోజులు సమయం ఇవ్వగా, ఈసారి 12 రోజులు సమయం ఇచ్చారు. రెండో శనివారం అయినప్పటికీ 12వ తేదీన కూడా దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఆదివారం, ఆగస్టు 15 సెలవు దినాలు కావడంతో మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉంది. దీంతో 16,17,18 తేదీల్లో భారీగా దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి.

- గత రెండేళ్ల కాలానికి గాను మొత్తం 68 వేలకు పైగా దరఖాస్తులు రాగా, దరఖాస్తు రుసుంతో పాటు తొలి వాయిదా ఎక్సైజ్ ఫీజు కలిపి మొత్తం రూ.1,691 కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. అయితే, ఈసారి ఆ స్థాయిలో దరఖాస్తులు వస్తాయా రావా అన్న మీమాంసలో ఎక్సైజ్ వర్గాలుండడం గమనార్హం.

రెండు పిల్‌లు, రెండు రిట్‌లు

ఇక, మద్యం దుకాణాల కేటాయింపుపై గతం నుంచీ నాలుగు కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వైన్‌షాపుల కేటాయింపులో రిజర్వేషన్లు అమలు చేయడంపై రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, మరో రెండు రిట్ పిటిషన్‌లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. దీనికి తోడు ఈసారి మరో రెండు కేసులు కోర్టుల్లో నమోదయ్యాయి. కొత్తగూడెం ఏరియాలోని కొన్ని దుకాణాలు షెడ్యూల్ ప్రాంతంలో ఉన్నప్పటికీ గిరిజనులకు వాటికి కేటాయించకుండా జనరల్ కేటగిరీలో చూపెట్టారని ఒక పిటిషన్ దాఖలు కాగా, గిరిజనులకు రిజర్వేషన్లు కేటాయించడంలో రాష్ట్రమంతటా ఒకే విధానాన్ని పాటించడం లేదంటూ మరొక పిటిషన్ ఈసారి దాఖలు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో కోర్టులు ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తాయోననే ఆసక్తి కూడా అటు ఎక్సైజ్ వర్గాల్లోనూ, ఇటు మద్యం వ్యాపారుల్లోనూ వ్యక్తమవుతుండడం గమనార్హం.

మహిళా బిల్లు ఆమోదానికి ఒక్క నిమిషం చాలు

కానీ బీజేపీ పట్టించుకోవడం లేదు

- కాంగ్రెస్ ఎందుకు మహిళా బిల్లుపై ప్రశ్నించదు: ఎమ్మెల్సీ కవిత
- షి ద లీడర్ ఉమెన్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో వ్యాఖ్యలు



స్మృతి ఇరానీతో కవిత కరచాలనం

సాక్షి, న్యూఢిల్లీ: మహిళా బిల్లుపై బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. మహిళా బిల్లు గురించి కాంగ్రెస్ పార్టీ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. కేంద్రంలో మెజారిటీ ఉన్న బీజేపీకి మహిళా బిల్లును ఆమోదించాలనుకుంటే ఒక్క నిమిషం చాలు అని.. అయితే ఆ దిశగా ఆలోచించడం లేదని కవిత వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ చట్టాల పేర్లను మార్చి కొత్త చట్టాలు తీసుకురావడానికి మూడు బిల్లులను తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును మాత్రం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం జాతీయ స్థాయి జర్నలిస్టు నిధి శర్మ రాసిన 'షి ద లీడర్ విమెన్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్'అనే పుస్తక ఆవిష్కరణ సభలో కవిత పాల్గొని మాట్లాడారు. దేశ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం పెరగాలని కవిత ఆకాంక్షించారు.

ఆ సీట్లలో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి

పెంచబోయే పార్లమెంటు సీట్లలో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని, ఇదే తమ నాయకుడు సీఎం కేసీఆర్ విధానమని స్పష్టం చేశారు. కార్పొరేట్ రంగంలో కూడా మహిళా వివక్ష కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ప్రారంభిస్తున్న 80% స్టార్టప్ సంస్థలకు బ్యాంకుల మద్దతివ్వడం లేదన్నారు. ఏటేటా ఉద్యోగ రంగంలో మహిళల శాతం తగ్గుతోందని, చదువుకున్న మహిళలకు ఎక్కడికి వెళ్తున్నారని ఆమె ప్రశ్నించారు. దేశంలో 29% మహిళలే ఉద్యోగాల్లో ఉన్నారని ఇలాగైతే దేశం వృద్ధి చెందలేదన్నారు. న్యాయస్థానాల్లో ఎంత మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారని ప్రశ్నించారు. కాగా భారత్‌లో కంపల్సరీ ఓటింగ్ రావాలని ఎమ్మెల్సీ కవిత అభిప్రాయపడ్డారు. నగరాల్లో చదువుకున్న వారు చాలా మంది ఓటేయడానికి రాకపోవడం బాధాకరమన్నారు.

▶ మొదటి పేజీ తరువాయి

ట్రాన్స్‌'ఫర్'పై ఈసీ దృష్టి

బదిలీల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ సారి గతానికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఒకే పోస్టులో లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న అధికారులతోపాటు, భారీ సంఖ్యలో పదోన్నతుల నేపథ్యంలో నాన్‌కేడర్ ఎస్పీ నుంచి ఇన్‌స్పెక్టర్ వరకు భారీ సంఖ్యలో అధికారులకు స్థానచలనం తప్పలేదు. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈసారి స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా ఉండే ఎస్ఐ పోస్టుల నుంచి నాన్‌కేడర్ ఎస్పీల వరకు అన్నింటిలోనూ రాజకీయ నాయకుల ప్రమేయం ఎక్కువైంది. ఓ అధికారి సమర్థత ఆధారంగా కాకుండా ఆయనకు ఎక్కడ పోస్టింగ్ కావాలో అక్కడి రాజకీయ నాయకులు ఇచ్చే సిఫార్సుల ఆధారంగా పోస్టింగ్ లభించింది. ఫోకల్ పోస్టులుగా పిలిచే శాంతిభద్రతల విభాగంతోపాటు మరికొన్ని కీలక వింగ్స్‌లో ఇదే పరిస్థితి నెలకొంది.

కొన్ని పోస్టుల్లో బదిలీల బంతాట

తమ సామాజికవర్గం కాదనో, విధేయులుగా ఉండరనో, ముక్కుసూటి అధికారులని భావించిన వారి బదిలీల విషయంలో బంతాట తప్పలేదు. పోస్టింగ్ వచ్చినవారు, ఆ పోస్టులో చేరకుండా, చేరినా ఆ సీట్లలో కూర్చోకుండా, కూర్చున్నా ఒక్కరోజు కూడా విధులు నిర్వర్తించకుండా అన్ని ప్రయత్నాలు చేశారు. పెద్దస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చి తమకు అనుకూలమైన వారికి పోస్టింగ్ ఇప్పిస్తూ కొత్తగా వచ్చిన అధికారులూ బదిలీ అయ్యేలా చేసి తమ పంతం నెగ్గించుకున్నారు.

ప్రత్యేక బృందాలతో వివరాల సేకరణ

రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగానే గత నెలలో హైదరాబాద్‌కు వచ్చిన ఎన్నికల సంఘం అధికారులు పోలీసు సహా వివిధ విభాగాలతో భేటీ అయ్యారు. పోలీస్ శాఖలో రాజకీయ నేతల సమ్మతి, సిఫార్సు ఆధారంగా పోస్టుల్లోకి వచ్చిన వారి ప్రభావం ఎన్నికల ప్రక్రియపై ఉంటుందని ఈసీ గుర్తించింది. దీనిపై వివరాలు సేకరించడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపనున్నట్టు తెలిసింది. వీటిలో మాజీ ఐపీఎస్ అధికారులతో పాటు నిఘా వర్గాలకు చెందిన వారు ఉంటారని సమాచారం.

రాష్ట్రంలో వివాదాస్పదమైన బదిలీల్లో కొన్ని...

- మహబూబాబాద్ జిల్లాలోని ఓ డివిజన్‌లో ముగ్గురు డీఎస్పీలు నాలుగుసార్లు బదిలీ అయ్యారు. ఇవి కేవలం పక్షం రోజుల వ్యవధిలో చోటు చేసుకున్నాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ డీఎస్పీ పోస్టింగ్ వివాదాస్పదమైంది. అక్కడకు వచ్చిన అధికారిని కొన్ని రోజుల్లో మార్చేశారు. ఆయన స్థానంలో అక్కడే ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి, ఇటీవలే పదోన్నతి పొంది, రేంజ్‌కు వెళ్లిన అధికారిని తీసుకొచ్చారు.
- నిజామాబాద్ జిల్లాలో ఓ అధికారి ఏడాది క్రితమే డీఎస్పీగా ఓ డివిజన్‌లో చేరారు. స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్ మధ్య విభేదాలతో ఈయన బదిలీ అయ్యారు. దీంతో ఎమ్మెల్యే పట్టుపట్టి మరీ తనకు అనుకూలమైన పాత అధికారినే తెచ్చుకున్నారు.
- హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలో ఎస్ఐ నుంచి ఏసీపీ వరకు అనేక పోస్టింగులు వివాదాస్పదమయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ రాజకీయ ఒత్తిళ్లతో విధులు నిర్వర్తించలేకపోయారు. చివరకు ఈయన బదిలీ కాగా, నేతలకు అనుకూలమైన వ్యక్తికే పోస్టింగ్ వచ్చింది.
- వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఓ ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అధికారి తన పలుకుబడితే అదే సబ్‌డివిజన్‌లోని మరో పోలీస్‌స్టేషన్‌కు మారారు. స్థానిక నేతల అండదండలతోనే ఇది సాధ్యమైందని తెలుస్తోంది.

> అన్ని కోరికలను వదిలి, అహంకార మమకారాలు వీడి సంచరించే పురుషుడు శాంతిని పొందుతాడు.
> – హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 12 ఆగస్టు 2023

మణిపూర్‌కు దక్కిందేమిటి?

గత మూడు నెలలుగా అత్యంత ఘోరమైన, దారుణమైన పరిణామాలను చవిచూస్తున్న మణిపూర్ రాష్ట్రంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉండిపోయారని ఆరోపిస్తూ లోక్‌సభలో విపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానం గురువారం వీగిపోయింది. మోదీ వాక్పటిమ గురించి ఎవరికీ సందేహాలు లేవు. ఆయన రెండు గంటల పది నిమిషాల సుదీర్ఘ ప్రసంగం మరోసారి ఆ విషయాన్ని రుజువు చేసింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు తొలగి, ఆయన సభకు రావటం అటు విపక్షాలతోపాటు ఇటు అధికార పక్షానికి కూడా కలిసొచ్చింది. విపక్ష స్వరం దీటుగా వినబడటానికి రాహుల్ దోహదపడితే... ఆయనపైనా, కాంగ్రెస్‌పైనా నిప్పులు చెరిగేందుకు అధికారపక్షానికి అవకాశం చిక్కింది. అయితే క్షతగాత్రగా మారిన మణిపూర్‌కు ఏమాత్రం సాంత్వన చేకూర్చామన్నది ఇరుపక్షాలూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సివుంది. ఇది గతంలో అనేకమార్లు సభలో చర్చకొచ్చిన అవిశ్వాస తీర్మానాలవంటిది కాదు. రాఫెల్ ఒప్పందంలో అవినీతి దాగుందంటూ 2018లో విపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాసంతో కూడా దీన్ని పోల్చలేం. ఇది యావత్తు సమాజమూ సిగ్గుతో తలదించుకోవాల్సిన దురదృష్టకర ఉదంతాల పర్యవసానంగా చర్చకొచ్చిన అవిశ్వాస తీర్మానం. మణిపూర్‌లో దాదాపు అంతర్యుద్ధ పరిస్థితులేర్పడటం, పరస్పరం భౌతిక దాడులు చేసుకోవటం, నివాసాలు తగలబెట్టుకోవటంతో మొదలై... చివరకు మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టే హీన స్థితికి చేరుకోవటం చరిత్రలో కనీవినీ ఎరుగనిది. ఊళ్లకు ఊళ్లే ఖాళీ చేసి ప్రజలు చెట్టుకొకరూ, పుట్టకొకరూ కావటం, అలా వెళ్లలేనివారిని సాయుధ మూకలు చిత్రవధ చేయటం, పోలీసులే తమ కస్టడీలో ఉన్న మహిళలను సాయుధ గుంపులకు అప్పగించాన్న ఆరోపణలు రావటం మామూలు విషయం కాదు. ఈ హింసాపర్వం మొదలై మూడు నెలలు దాటుతున్నా ఇప్పటికీ అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనకపోవటం, పోలీసులూ, కేంద్ర బలగమైన అస్సాం రైఫిల్స్ పరస్పరం నిందారోపణలు చేసుకోవటం దిగ్భ్రాంతికరం. ఆఖరికి లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై ప్రధాని జవాబిస్తున్న సమయంలో కూడా మే 3 నాటి మరో దారుణ ఉదంతం వెలుగులోకొచ్చింది. ఒక మహిళపై సామూహిక అత్యాచారం జరిపి, ఆమె ఇంటిని తగులబెట్టారన్నది ఆ ఉదంతం సారాంశం. ఇప్పటికీ స్వస్థలాలకు వెళ్లే సాహసం చేయలేనివారు వేలాదిమందివుంటే, వెళ్లినవారు భయాందోళనల్లో మునిగి తేలుతున్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను సంజాయిషీ ఇచ్చుకునేలా చేయటంలో అవిశ్వాస తీర్మానం బ్రహ్మాస్త్రం వంటిది. అందునా రాక్షసమూకల కొమ్ముకాసిందన్న ఆరోపణలెదుర్కొంటున్న మణిపూర్ సర్కార్‌పై కఠిన చర్యలు తీసుకోవటంలో తాత్సారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని తూర్పారబట్టడానికి దీనికి మించిన ఆయుధం లేదు. మూడురోజులపాటు ఇరుపక్షాల నేతలూ ప్రసంగించారు. అయితే ఆ వాగ్దాటి హోరులో మణిపూర్ విషాదం మరుగున పడిందన్న అభిప్రాయం ఏర్పడింది. ప్రధాన అంశాన్ని మరిచి సవాళ్లూ, ప్రతిసవాళ్లూ, అర్థరహితమైన ఆరోపణలూ విసురుకుంటూ రెండు పక్షాలూ కాలక్షేపం చేశాయి. వర్తమాన దుఃస్థితికి గతంలో పాలించిన కాంగ్రెసే కారణమని అధికారపక్షం అంటే... కేంద్ర బలగాలను ఉద్దేశపూర్వకంగానే వినియోగించుకోలేదనీ, అందువల్లే ఇంతటి హింస చెలరేగిందనీ విపక్షాలు ఆరోపించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మణిపూర్ గురించి సవివరమైన ప్రకటనే చేశారు. అమిత్ షాయే మాట్లాడతారని మొదటినుంచీ అధికారపక్షం చెబుతోంది. కాదు, ప్రధానే మాట్లాడాలన్నది విపక్షం డిమాండ్. ప్రధాని సుదీర్ఘ ప్రసంగంలో మణిపూర్ ప్రస్తావన వచ్చింది. దుండగులపై చర్య తీసుకుంటామని, శాంతి నెలకొల్పుతామన్న హామీ కూడా ఇచ్చారు. ఈశాన్యానికి తమ హృదయంలో కీలక స్థానమున్నదని చెప్పారు. మణిపూర్ మహిళలతో భుజం భుజం కలిపి నడుస్తామన్నారు. కానీ ఇది మాత్రమే సరిపోతుందా? అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్న మణిపూర్ ప్రజానీకానికి ఈ సభావేదిక నుంచి సహానుభూతి ప్రకటిస్తూ, ఈ ఉదంతాలు పునరావృతం కానీయబోమనీ, దోషులను కఠినంగా దండిస్తామనీ వాగ్దానం చేస్తూ ఏకగ్రీవ తీర్మానం ఆమోదించివుంటే దాని ప్రభావం వేరుగా ఉండేది. వారి పునరావాసానికి అవసరమైన పథకాలు ప్రకటిస్తే బాగుండేది. అధికార పక్షం వీటిని విస్మరించిందనుకున్నా ప్రతిపక్షం మాత్రం చేసిందేమిటి? ప్రధాని ప్రసంగం పూర్తిగా వినకుండానే వాకౌట్ చేసింది.

అధికార పక్షానికి తిరుగులేని మెజారిటీ ఉన్న సభలో అవిశ్వాసం చివరికేమవుతుందో అందరికీ తెలుసు. అయినా ఆ సందర్భంగా జరిగే చర్చలను ప్రజానీకం ఆసక్తిగా గమనిస్తుంది. విపక్షం ఏయే అంశాలపై అధికారపక్షాన్ని నిలదీస్తున్నదో, వాటికి అధికారపక్షం ఏం చెబుతున్నదో తెలుసుకోవటమే ఆ ఆసక్తిలోని ఆంతర్యం. ఆ సందర్భంగా ఎవరి మంచిచెడ్డలేమిటో బేరీజు వేసుకుంటారు. ముఖ్యంగా మణిపూర్ ప్రజలూ, ఈశాన్య రాష్ట్రాల ప్రజానీకం తమకు జరగబోయే న్యాయం గురించి ఆలోచిస్తారు. కానీ రాబోయే సార్వత్రిక ఎన్నికలు, అందులో గెలుపోటములే చర్చల్లో ప్రధానంగా వినబడ్డాయి. ఇది సరైందేనా? మణిపూర్ విషాదంపై సుప్రీంకోర్టు ఇప్పటికే చొరవ తీసుకుని లైంగిక హింసపై సాగే సీబీఐ దర్యాప్తు పర్యవేక్షణకు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమించింది. పునరావాసం, పరిహారం, ఆవాసాల, ప్రార్థనామందిరాల పునర్నిర్మాణం తదితర అంశాలను పర్యవేక్షించేందుకు ముగ్గురు రిటైర్డ్ మహిళా న్యాయమూర్తులతో కమిటీ ఏర్పరిచింది. తనవంతుగా చేయబోయేదేమిటో కేంద్రం ప్రకటిస్తే ఈ అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు అర్థవంతమైన ముగింపు ఉండేది.

ప్రకృతి హిత జీవనమే పరిష్కారం

విశ్లేషణ



దొంతి నరసింహారెడ్డి

ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల భారీ వరదలు వచ్చి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించడం సాధారణ దృశ్యం అయ్యింది. ఇందుకు నానాటికీ పెరిగిపోతున్న కాలుష్యమే అసలు కారణం. ఈ కాలుష్యానికి అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న ప్రకృతి విధ్వంసమే హేతువని సైన్స్ చెబుతోంది. భూ స్వరూపాలను ఇష్టమొచ్చినట్లు మార్చడం, పేరాశతో సహజవనరులను విచక్షణారహితంగా వినియోగించడం, ప్రకృతి నియమాలకు ఎదురీదాలని ప్రయత్నించడం నేటి కరువులకూ, వరదలకూ అసలైన కారణాలని అధ్యయనాలు చెబుతున్నాయి. సహజ ప్రకృతి నియమాలకు అనుగుణంగా మనిషి జీవించడం ఒక్కటే ప్రకృతి విపత్తుల నుంచి బయటపడడానికి ఉన్న ఏకైక పరిష్కారం.

వాతావరణ మార్పులు, పెరుగుతున్న విపరీతమైన వాతావరణ సంఘటన వల్ల గత 50 ఏళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు పెరుగు తున్నాయి. ఇవి పేద దేశాలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ), యూఎన్ ఆఫీస్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ సంస్థలు చెబుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వరదలు వస్తున్న వార్తలు ఇటీవల ఎక్కువగా చూస్తున్నాం. ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒకే రోజు పడే వర్షం ఎక్కువగా ఉండడం వాతావరణంలో వచ్చిన మార్పుల పరిణామం. అందులో అనుమానం లేదు. వాతావరణంలో విపరీత మార్పులకు మానవ కార్యకలాపాల నుంచి ఉద్భవించిన కాలుష్య ఉద్గారాలు కారణం. కర్బన ఉద్గారాల వల్ల భూమి ఉష్ణోగ్రత పెరిగి, సముద్ర జలాలు, గాలి, మంచు వంటి వాటిమీద దుష్ప్రభావం పడుతోంది. వరదలు నివారించాలంటే కాలుష్యం తగ్గించడమే ఉత్తమమైన మార్గం. అంటే, మానవులు ఏర్పరచుకున్న 'శక్తి' వనరులలో తీవ్రమైన, సత్వర మార్పులు చేస్తేనే కాలుష్యం తొందరగా తగ్గుతుంది. ఈ విధంగా చూస్తే వరదలకు 'స్థానిక' కారణాలు ఉన్నట్టు అనిపించదు. ఎందుకంటే, కాలుష్యం ఒక భౌగోళిక పరి ణామం కాబట్టి.

చైనాలో వరదల బీభత్సం ఈ మధ్య ఎక్కువ అయ్యింది. ఈ ఏడాదే దాదాపు 3 కోట్ల మంది ప్రజలు వరదల బారిన పడ్డారు. బీజింగ్‌లో 2012లో సంభవించిన వరదల్లో 79 మంది ప్రాణాలు కోల్పోయిన తరువాత తీవ్రమైన వర్షాల నుంచి రక్షించడానికి చైనా ఇటీవలి సంవత్సరాల్లో బిలియన్ల డాలర్లను పెట్టుబడి పెట్టింది. అధ్యక్షుడు జిన్‌పింగ్ 'స్పాంజ్‌ల వంటి నగరాలను' నిర్మించాలని పిలుపునిచ్చారు. మిద్దె తోటలు, నీరు ఇంకే ఫుట్‌పాత్‌లు, భూగర్భ నిల్వ ట్యాంకులు, ఇతర స్పాంజ్ లాంటి వ్యవస్థలను ఉపయోగించి భారీ వర్షపాతాన్ని ఇంకే విధంగా చేసి, తరువాత నెమ్మదిగా నదులు లేదా జలాశయాల్లోకి విడుదల చేయడం. చైనాలో వరదల నివారణకు 'స్పాంజి' నగరాల కార్యక్రమం చేపట్టినా ఫలితం కానరాలేదు. ప్రకృతి సహజంగా చేసే 'స్పాంజి' పని... మానవ నిర్మిత వ్యవస్థల ద్వారా సాధ్యం కాదు అని రుజువు అయ్యింది.

భారత దేశంలో అనేక రాష్ట్రాలలో ఈ మధ్య కాలంలో ప్రతి ఏటా వరదలు వస్తున్నాయి. కోస్తా నగరాలైన ముంబాయి, చెన్నైల్లో వస్తున్న వరదలు అక్కడి భౌగోళిక పరిస్థితుల్లో తీవ్ర మార్పుల వల్ల సంభవిస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. బెంగళూరు, హైదరాబాద్ నగరాలలో చెరువులు, వరద నీటి కాలువలు, నదులు కబ్జా కావడం వల్ల వరదలు వస్తున్నాయి.

2023 జులైలో లోక్‌సభలో కేంద్ర మంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా ఇచ్చిన సమాచారం గమనించదగింది. 'కేంద్ర జల కమిషన్' ప్రకారం గత మూడేళ్లుగా (2020, 2021, 2022) దేశంలో 465 తీవ్రమైన, అతి తీవ్రమైన వరదలు సంభవించాయి. ఈ సంవత్సరం కూడా



వరదలు పెరిగాయి. 23 రాష్ట్రాలలో అత్యధికంగా బిహార్ (99), ఉత్తర ప్రదేశ్ (75), అసోం (60)లలో తీవ్రమైన, అతి తీవ్రమైన వరదలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో 18, తెలంగాణలో 14 వచ్చాయి. ఈ ఏడు హిమాచలప్రదేశ్, హరియాణాల్లో తీవ్రమైన వరదలు వచ్చాయి.

అయితే, సాధారణ వర్షాలకే వరదలు రావడానికి స్థానిక పరిస్థితులే కారణం. అధిక వర్షాల సంగతి చెప్పనవసరం లేదు. వరదల తీవ్రత, నష్టం పెరగడానికి స్థానిక వనరుల విధ్వంసం ప్రధాన కారణం. నీటి వనరులైన నదులు, వాగులు, తటాకాల 'సరిహద్దులను' మనం చెరిపేస్తే, వాటి సామర్థ్యం మనం రకరకాలుగా తగ్గిస్తే, నీరు ఒలుకుతుంది. చెరువులు, కుంటలు, వాగుల ఆక్రమణల వల్ల వాటి సామర్థ్యం తగ్గిస్తున్నాం. మన నెత్తి మీద పడి, మన కాళ్ళ కింద ప్రవహించే నీటిని ఒడిసిపట్టుకునే సహజ వ్యవస్థను 'అభివృద్ధి' పేరిట నాశనం చేసి, నీళ్ళ కొరకు పెద్ద ఆనకట్టలు కట్టి నీటి సరఫరా 'సుస్థిరం' చేసుకుంటున్నాం అనే భ్రమలో మనం ఇప్పటికీ ఉన్నాము. ఇక్కడ పడ్డ నీటిని వదిలిపెట్టి, ఎక్కడో వాటిని ఆపి, ఆ నీటిని పైపుల ద్వార సరఫరా చేస్తూ, విద్యుత్ వినియోగిస్తూ, అది ఆధునికతగా భావిస్తూ తరిస్తున్నాము. కాగా, ఈ అసహజ నీటి వ్యవస్థ కారణంగా ప్రకృతి దెబ్బతిని కుదేలు అయితే ఆ నష్టం భరి స్తున్నది ఎవరు? చిన్న ప్రవాహాలను నిర్లక్ష్యం చేసి, నదులుగా మారిన తరువాత అడ్డు కట్టలు కట్టి మనం ఉపయోగించే నీటికి 'విలువ' పెరుగుతుంది. ఎందుకంటే పెట్టుబడికి, నిర్వహణకు ఖర్చు అయ్యింది కనుక. ఈ 'విలువ' పెంచిన నీరు రకరకాల కారణాల వల్ల కొందరికే అందుతుంది. సామాజిక అసమానతలకు కారణం అవుతుంది.

కొండల వెంబడి నీరు జాలువారడానికి అనువుగా ప్రకృతి ఏర్పరుచుకున్న దారులను మనం రోడ్ల కొరకు నాశనం చేస్తే, కొండ చరియలు పడడం చూస్తున్నాము. కొండలు, గుట్టల మీద సహజ కవచంగా ఉండే చెట్లు, అడవి, గడ్డి తదితర పచ్చదనాన్ని మనం హరిస్తే మట్టి కొట్టుకుని పోయి, నీటి వేగానికి, ప్రవాహానికి 'సహజ' అడ్డంకులు ఉండవు.

వరద నీరు తగ్గినప్పుడు ప్రభావిత ప్రాంత భూములలో సాధారణంగా పూడిక బురదతో నిండి ఉంటాయి. ఈ రకమైన అవశేషాలు పోషకాలతో నిండి ఉండి ఆ ప్రాంతంలోని రైతులకు వ్యవసాయానికి ప్రయోజనం చేకూర్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి అంతటా లేదు. కొన్ని చోట్ల వరద... ఉన్న సారవంతమైన భూమిని కోసేస్తే, ఇంకొక చోట ఇసుకను నింపుతున్నది. పట్టణాల నుంచి వచ్చిన వరద అనేక రకాల కలుషితాలను వదిలిపెడుతున్నది. కొండ ప్రాంతం నుంచి మైదానాలకు వచ్చే వరద బండ రాళ్ళు, చెట్టు కొమ్మలు, ఈ మధ్య కార్లు, మోటార్ సైకిళ్ళు, ఇండ్లు, ఇండ్ల గోడలు, సిమెంటు కట్టడాల అవశేషాలను కూడా తీసుకువస్తున్నది. వరద నీటిలో తమ 'పాపాలను' (వ్యర్థాలు, కాలుష్య జలాలు) వదిలేసే పరిశ్రమలు కూడా ఉన్నాయి.

పశువులు సాధారణంగా నీళ్ళలో ఈదగలవు. కాని, వేగంగా ప్రవహించే వరదలో చాల మటుకు అవి చనిపోతుంటాయి. అసలు పాడి పశువుల సంఖ్య తగ్గిపోతున్న క్రమంలో పశువుల మరణాల గురించి ఆలోచించేందుకు ఆధునిక సమాజం సిద్ధంగా లేదు. వరదలు చేసే ఆస్తి నష్టం వల్ల పేదలు ఇంకా పేదరికంలోకి నెట్టబడుతున్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, పైపులైన్లు, విద్యుత్ స్తంభాలు తదితర ప్రజా ఆస్తులకు హాని కలిగి ప్రభుత్వ నిధుల మీద భారం పెరుగుతున్నది.

వరదల నివారణకు భూమి వినియోగం మీద అధ్యయనం చాలా అవసరం. ప్రకృతిలో, భూమితో ముడిపడి ఉన్న నీటి సహజ చక్రాలను అర్థం చేసుకోవాలి. నదులు పుట్టే ప్రదేశంలో అర్థరహిత కాంక్రీటికరణ చేటు చేస్తున్నది. గోదావరి నది పుట్టే నాసిక్ నగరంలో ఇట్లా చేసి నాలుక కరుచుకున్నారు. హైదరాబాద్‌కు నీటిని అందించే మూసీ నది పరివాహక ప్రాంతం, ముఖ్యంగా అనంతగిరి కొండలలో ఉన్న అడవి నాశనం వల్ల, కింది ప్రాంతాలలో వరద ముప్పు పెరుగుతున్నది. చెరువులు వరద నివారణకు ఉపయోగపడతాయి. కాని, వాటిని దుర్వినియోగపరుస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కొల్లేరు సరస్సు విధ్వంసం వల్ల చుట్టూ పరిసర ప్రాంతాలలో వరద ముప్పు పెరుగుతున్నది. తూర్పు కనుమల ద్వార ప్రవహించే అనేక నదులు బంగాళాఖాతంలో కలుస్తాయి. కానీ, వాటి పరివాహక ప్రాంతంలో మైనింగ్ వల్ల, అడవుల నరికివేత వల్ల వరద ముప్పు పెరిగింది. శారద నది, రుషికుల్య తదితర నదులు మైదాన ప్రాంతాలలో, కోస్తాలో ప్రమాదకరంగా మారడానికి మానవ ప్రకృతి విధ్వంసకర కార్యకలాపాలే.

ఇప్పటికైనా ప్రభుత్వాలు చేసిన, చేస్తున్న, చేయబోతున్న కార్యక్రమాలు, నిర్మాణాలను సమీక్ష చేసి, వరద నివారణకు, వరద ముప్పు తగ్గించటానికి సుస్థిర ప్రణాళికలు చేపట్టాలి. ఆలస్యం మరింత వినాశనానికి కారణమవుతుందనే సంగతి మరువరాదు.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు ı 90102 05742

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త ఎత్తు



ఐపీసీ (ఇండియన్ పీనల్ కోడ్) స్థానంలో వస్తున్న కొత్త బిల్లుల పేర్లు హిందీలో ఉండటం గమనించాను. ఇలాగే రాజ్యాంగాన్ని మార్చుతారు (=నాశనం చేస్తారు). యధార్థంలో హిందీని జాతీయ భాషను చేస్తారు.

– సుహాస్ పల్షీకర్, ప్రొఫెసర్

పాత్ర చరిత్ర



ఇండియా, అమెరికాల్లోని కొన్ని మీడియా సంస్థలను చైనా ధనం ఎలా ప్రభావితం చేస్తున్నదో వెల్లడికావడం ఆశ్చర్యం కలిగించలేదు. ఇక్కడి కొన్ని పక్షాలను విషపూరితం చేయడంలో చైనాకు సుదీర్ఘ చరిత్ర ఉంది.

– హిందోల్ సేన్‌గుప్తా, కాలమిస్ట్

విశ్రాంతి కావాలి



మావీ (హవాయి)కి రావొద్దు. మీ సెలవు ప్లాన్లను రద్దు చేసుకోండి. ప్రాణాలతో బయటపడ్డవాళ్లకు హోటల్ గదులు కావాలి. మాకు దుఃఖం నుంచి కోలుకునే సమయం ఇవ్వండి. (అమెరికా కార్చిచ్చు నేపథ్యంలో.)

– కనియేలా ఇంగ్, యూఎస్ మాజీ శాసనసభ్యుడు

కొత్త తిరుగుబాటు



చాలా దేశాలు సైనిక తిరుగుబాట్లను ఎదుర్కొన్నాయి. ఇండియాలో మాత్రం 'న్యాయవ్యవస్థ తిరుగుబాటు' జరిగింది. చట్ట సంబంధ అంశాల్లో పార్లమెంటుకు ఉన్న ఆధిపత్యాన్ని లేకుండా చేసి, రాష్ట్రపతి చేతిలోని న్యాయమూర్తుల ఎంపిక అధికారాన్ని 1993లో న్యాయ వ్యవస్థ తీసుకుంది.

– దిలీప్ మండల్, సంపాదకుడు

పేర్లెందుకు?



నిజంగా మీరు ఆరోగ్యకరమైనవి తినడానికి సులభమైన చిట్కా ఏమిటంటే, బ్రాండ్ల పేర్లతో ఉన్నవి ఏవీ తినొద్దు.

– పాల్ గ్రాహమ్, శాస్త్రవేత్త

రెండో రాజధాని అర్హతలున్న నగరం

అభిప్రాయం



డా॥ టి. హనుమాన్ చౌదరి

హైదరాబాద్‌కు దేశ రెండవ రాజధానిగా ఉండడానికి ఉన్న అర్హతల గురించి ఏఐఎమ్ఐఎమ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రజల దృష్టికి తెచ్చినందుకు అభినందనీయులు. అయితే ఆయన ప్రతిపాదాత్మకంగా ఈ విషయాన్ని ప్రస్తావించలేదనుకోండి. భారతదేశ రాజ్యాంగ నిర్మాత, హైదరాబాద్ సచివాలయం సమీపంలో అత్యంత ఎత్తైన విగ్రహ రూపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అప్పట్లోనే భారతదేశ రెండవ రాజధానిగా హైదరాబాద్‌ను అభివర్ణించారు. 'భారతదేశంలో ఎప్పుడూ రెండు రాజధానులు ఉంటూవచ్చాయి. మొఘలాయిల కాలంలో అవి ఢిల్లీ, శ్రీనగర్– శీతాకాలంలో ఢిల్లీ, వేసవిలో శ్రీనగర్. బ్రిటిష్‌వాళ్ల కాలంలో– కలకత్తా, సిమ్లా; ఆ తర్వాత ఢిల్లీ, సిమ్లా... నేను హైదరాబాద్‌ను ఆదర్శవంతమైన ప్రదేశంగా గుర్తించాను. హైదరాబాద్, సికింద్రాబాద్, బొల్లారంలను ఒక చీఫ్ కమిషనర్ల ప్రావిన్స్ (ఇప్పటి కేంద్ర పాలిత ప్రాంతం)గా ఏర్పాటు చేసి, భారతదేశానికి రెండవ రాజధానిగా చేయాలి. భారతదేశానికి ఒక రాజధానిగా అన్ని అవసరాలను హైదరాబాద్ తీరుస్తుంది. ఇది అన్ని రాష్ట్రాలకు సమాన దూరంలో ఉంది... ఢిల్లీలో ఉన్న అన్ని సౌకర్యాలూ హైదరాబాద్‌లో ఉన్నాయి. ఢిల్లీ కంటే కూడా ఎంతో మెరుగైన నగరం ఇది.' (శేష్‌రావ్ చవాన్ రాసిన 'ది మేకర్స్ ఆఫ్ ఇండియన్ కానిస్టిట్యూషన్ – మిత్ అండ్ రియాలిటీ' నుంచి.)


సైబరాబాద్, దాని అద్భుతమైన భవనాల కారణంగానే కాకుండా హైదరాబాద్‌ను తమ నివాసంగానూ, కార్యక్షేత్రంగానూ మలచుకున్న రకరకాల వ్యక్తుల కారణంగానూ అది అంతర్జాతీయ నగరంగా మారింది. హైదరాబాద్ నడిబొడ్డులో మయన్మార్ రోహింగ్యాలు, నైజీరియా దేశస్థులు, పాకిస్తానీయులు, బంగ్లాదేశీయుల వంటి అంతర్జాతీయ సమాజాలవారిని ఇక్కడి జనం ఉదారంగా సమాదరిస్తున్నారు. ఇప్పుడు 'హబ్సిగూడ' అని పిలుస్తున్న ప్రాంతంలో నిజాంకాలంలోనే ఇథియోపియా నుంచి వచ్చినవారు స్థిరపడ్డారు. అదే కాలంలో అరబ్బులు బార్కాస్ (బ్యారక్స్) అని ఇవ్వాళ పిలుస్తున్న ప్రాంతంలో స్థిరపడ్డారు. అంబేడ్కర్ కాలం నుంచే హైదరాబాద్‌ను భారతదేశానికి రెండవ రాజధానిని చేయడానికి కావలసిన అర్హతలు ఉన్నాయని గుర్తిస్తుండగా... ఇప్పుడు కేటీ రామారావు వంటి వ్యక్తుల కృషి కారణంగా హైదరాబాద్ నిజమైన 'విశ్వనగరం'గా మారింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం హైదరాబాద్‌ను భారతదేశానికి రెండవ రాజధానిగా చేయడానికి చర్యలు ప్రారంభించడానికి ఇది సరైన సమయం. భారతదేశానికి హైదరాబాద్ రెండవ రాజధానిగా ఉండాలనే అంబేడ్కర్ ప్రతిపాదనను నిజం చేసేందుకు ఏఐఎమ్ఐఎమ్ ఎంపీ పాటుపడాలి.

దేశ రక్షణను, సమగ్రతను కాపాడటానికి బ్రిటిష్ వారు దేశంలోని వివిధ ప్రాంతాల్లో సాయుధ దళాలను మోహరించి 50కి పైగా కంటోన్మెంట్లను స్థాపించారు. దురదృష్టవశాత్తు, కొన్ని విచ్ఛిన్నకర శక్తులు ప్రాంతీయ పార్టీల రూపంలో క్రియాశీలం అవుతున్నాయి. ఈ పరిణామం కూడా హైదరాబాద్‌లో రెండవ రాజధాని ఉండాలనే వాదనను బలపరుస్తోంది. అలాగే భారత సమగ్రతను నిరంతరం కంటికి రెప్పలా కాపాడే సెంటినెల్స్‌గా కంటోన్మెంట్లను కూడా ఉన్నతీకరించాలి.

వ్యాసకర్త 'ప్రజ్ఞా భారతి' ఛైర్మన్

హరిత భవిష్యత్తుకు యువతే సారథి

సందర్భం



బండారు దత్తాత్రేయ

మన భూమిని పది కాలాలపాటు పచ్చగా ఉంచడంలో యువత పాత్ర అంతా ఇంతా కాదు. మత్తుమందులు, సామాజిక సమస్యలు, పేదరికం, నిరుద్యోగిత వంటి అనేక సవాళ్లను ఎదుర్కోవడంలోనూ వీరు ప్రధాన భూమిక పోషించగల సత్తా ఉన్నవారు. ఇందుకు వారికి తగిన మానవీయ విలువలు, నైపుణ్యం, జ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే అందరి ప్రయోజనం కోసం యువత సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడం వీలవుతుంది. యువశక్తిని గరిష్ఠంగా వాడుకోవడంలోనే దేశ అభివృద్ధి దాగి ఉంది. యువత తప్పుదారి పడితే దాని ఫలితాలను సమాజం అనుభవించాల్సి ఉంటుంది.

ఈ ఏడాది అంతర్జాతీయ యువజన దినోత్సవం (ఆగస్టు 12) 'గ్రీన్ స్కిల్స్ ఫర్ యూత్: టువార్డ్స్ సస్టెయినబుల్ వరల్డ్' అన్న థీమ్‌తో జరుగుతోంది. ఏమిటీ గ్రీన్ స్కిల్స్? 'సుస్థిరమైన, వనరులను సమర్థంగా వినియోగించుకోగలిగిన సమాజాన్ని తయారు చేసేందుకు ఉపయోగపడే జ్ఞానం, సామర్థ్యం, విలువలు, వైఖరులు.' యువతకు ఈ గ్రీన్ స్కిల్స్ అందించడం వల్ల భవిష్యత్తులో రాగల పర్యావరణ అనుకూల పరిశ్రమల్లో ఉద్యోగాలు చేసేందుకు సిద్ధంగా ఉంటారు. ప్రకృతి పరిరక్షణ విషయంలో బాధ్యతగా వ్యవహరించేందుకూ అవకాశాలేర్పడతాయి. ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు కూడా యువతకు గ్రీన్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడం, బోధన, వనరులతో వారిని సన్నద్ధులు చేయడంలో కీలకపాత్ర పోషించవచ్చు. వాతావరణ మార్పులు, వనరుల కొరత, పర్యావరణ అసమతౌల్యం వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకూ ఈ గ్రీన్ స్కిల్స్ అత్యవసరం.

గ్రీన్ స్కిల్స్ రంగంలో ఉద్యోగావకాశాలకు ఆకాశమే హద్దు. ఉదాహరణకు పునరుత్పాదక ఇంధన టెక్నాలజీలు. సౌర, పవన, జల విద్యుదుత్పత్తితోపాటు ఇతర వనరులకు సంబంధించిన జ్ఞానం, నైపుణ్యాలు కలిగి ఉండటం సుస్థిర మౌలిక సదుపాయాల నిర్మాణానికి కీలకం. ఈ టెక్నాలజీల్లో శిక్షణ పొందిన యువత వాటి డిజైనింగ్, ఏర్పాటు, నిర్వహణ వంటి అనేక రంగాల్లో కొత్త ఉద్యోగాలు చేయవచ్చు. విద్యుత్తును అత్యంత సమర్థంగా వాడుకునే విధానాలు, టెక్నాలజీలపై అవగాహన కూడా వేర్వేరు రంగాల్లో (రవాణా, భవంతులు) కర్బన ఉద్గారాలు, విద్యుత్తు పొదుపు సాధించే అవకాశాలను కల్పిస్తుంది.

ప్రకృతి వనరుల వినియోగంలో యువతకు



తగిన నైపుణ్యాలు లభిస్తే వ్యవసాయం, అటవీకరణ, సాగునీటి నిర్వహణ మెరుగ్గా జరిగే సుస్థిరాభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది. వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ విషయాల్లోనూ యువతకు సాధికారత కల్పించడం అవసరం. వీటి ద్వారా మాత్రమే వారు తమ తమ సమాజాల్లో వ్యర్థాల నిర్వహణకు సమర్థమైన, వినూత్నమైన పరిష్కారాలు కనుగొనగలరు.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత దేశం కర్బన ఉద్గారాలను 2030 నాటికల్లా స్థూల జాతీయోత్పత్తిలో 45 శాతానికి తగ్గించాలనీ, 2070 నాటికి సున్నాస్థాయికి చేర్చాలనీ పనిచేస్తూండటం ఆనందాన్ని ఇచ్చే విషయం. 2023–24 బడ్జెట్‌లోనూ ఇందుకు సంబంధించి ఎన్నో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. పర్యావరణ అనుకూల ఇంధన వనరులవైపు దేశం వేగంగా మళ్లుతూండటం ఈ నిర్ణయాలకు నిదర్శనం. ఉదాహరణకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, గ్రీన్ హైడ్రోజన్ విభాగాల మంత్రిత్వ శాఖ కర్బన ఉద్గారాలను సున్నాస్థాయికి చేర్చేందుకు, పర్యావరణ అనుకూల ఇంధనాలవైపు మళ్లేందుకు ఉపయోగించేందుకు రూ.35,000 కోట్లు ప్రయారిటీ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద కేటాయించింది. ఇందులో రూ.19,700 కోట్లు శిలాజ ఇంధనాల దిగుమతులను తగ్గించేందుకు వీలుగా కొత్త ఇంధన వనరుల వాడకం కోసం ఖర్చు చేస్తారు. అలాగే 400 మెగావాట్/గంటల విద్యుత్తును నిల్వ చేసే భారీ బ్యాటరీలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా ప్రభుత్వం మద్దతిస్తోంది. గోబర్ధన్ పథకం కింద 500 వేస్ట్ టు వెల్త్ (వ్యర్థాల నుంచి విలువను రాబట్టడం) ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయనున్నారు.

యువత అన్ని అడ్డంకులను తొలగించుకుని భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో పని చేయాలి. స్వామి వివేకానంద చెప్పినట్లు, యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ రెండింటి కోసమే ప్రధాని నరేంద్ర మోదీ ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రకటించారు. 'సంపద పోతే ఏమీ నష్టం లేదు. ఆరోగ్యం నశిస్తే ఎంతో కొంత నష్టం జరిగినట్లే. వ్యక్తిత్వాన్ని కోల్పోతే మాత్రం సర్వం నష్టపోయినట్లే' అన్న నానుడిని ఇక్కడ గుర్తు చేయదలచుకున్నాను. పూర్తి ఆత్మ విశ్వాసంతో, జాతీయభావాలతో కూడిన యువత మనకు అసలైన సంపద. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వ్యక్తిత్వ నిర్మాణానికి ప్రయత్నాలు జరగాలి. మన యువతను పచ్చని, సానుకూల మార్పు తీసుకువచ్చే వారిగా తీర్చిదిద్దాలి.

వ్యాసకర్త హరియాణా గవర్నర్
(నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం)

అనుసరణ

లౌకిక జీవితం అంటేనే కర్మఫలాల అనుభవాల పరంపర అంటుంది సనాతన వేదాంత సంప్రదాయం. పుట్టిన వాళ్ళందరూ ఏవేవో కర్మలు – మంచివీ, చెడ్డవీ చేస్తూ ఉంటారు. అనంతరం ఆ కర్మల ఫలితాలు– సుఖమో, దుఃఖమో అనుభవిస్తూ ఉంటారు.

మనిషి తన బుద్ధి ప్రేరేపించినట్టుగా నడుస్తాడు. అతగాడు తన పూర్వ కర్మల దుష్ట ఫలాన్ని అనుభవించాల్సిన సమయం వచ్చినప్పుడు, అతడి బుద్ధి కూడా దానికి అనుగుణంగా ప్రసరిస్తుంది. అన్నీ తెలిసి కూడా, ఏ దుష్ట గ్రహమో నెత్తిన కూర్చొని నడుపుతున్నట్టుగా, వెర్రిమొర్రి నిర్ణయాలు తీసుకొని, దుఃఖకరమైన పరిణామాలుండే చర్యలను చేజేతులా చేపడ తాడు. సత్కర్మ ఫలాలు అనుభవించవలసిన సమయం వచ్చినప్పుడు, ఆ



బుద్ధే, తనను ఏ శుభగ్రహమో పట్టి నడుపుతున్నట్టు, మేలు కలిగించే మంచి ఆలోచనలతో, సుఖానికి దారి తీయగల పనులు చేయిస్తుంది. అందుచేత, సమయం వచ్చినప్పుడు, బుద్ధి కూడా సాధారణంగా కర్మానుసారంగానే మనిషిని ముందుకు తోస్తుంది. కాబట్టి 'బుద్ధిః కర్మానుసారిణీ' అంటారు.

అదొక్కటే కాదు. సత్యానుసారిణీ లక్ష్మీః, కీర్తిః త్యాగానుసారిణీ, అభ్యాససారిణీ విద్యా, బుద్ధిః కర్మానుసారిణీ అని ఈ లోకోక్తిలో నాలుగు పాదాలు. లక్ష్మి అంటే అన్ని విధాల ఐశ్వర్యమూ, అదృష్టమూ. ఇది సత్య సంధత కలవాడినే అనుసరిస్తుంది. సత్యమేవ జయతే. త్యాగ బుద్ధి కలవాడు లోకంలో చక్కని యశస్సును పొందుతాడు. కనక కీర్తి అనేది త్యాగబుద్ధి గలవాడిని అనుసరించి ఉంటుంది. ఇక విద్య అంటారా, అది 'అభ్యాససారిణీ'. అభ్యాసాన్ని ఆశ్రయించి ఉంటుంది. అభ్యాసం అంటే ఆవృత్తి. అంటే ఒక పనిని మళ్ళీ మళ్ళీ చేయడం, ఒక పాఠాన్ని మళ్ళీ మళ్ళీ అధ్యయనం చేయడం, ఒక విషయాన్ని మళ్ళీ మళ్ళీ చింతన చేయడం. ఏ విద్యయినా చక్కగా 'అభ్యసించే' వాడికే అబ్బుతుంది.

చివరిగా బుద్ధిః కర్మానుసారిణీ. పూర్వ కర్మ ఎలా ఉన్నదో, దాని ఫలితంగా మనిషి ఏ కష్టాలూ, సుఖాలూ అనుభవించాల్సి ఉందో, దానికి అనుగుణంగా, ఆ దిశగా మనిషి బుద్ధి మనిషిని నడుపుతుంది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.8.03 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** మృగశిర ఉ.8.34 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** సా.5.30 నుండి 7.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.44 నుండి 7.27 వరకు, **అమృతఘడియలు:** రా.11.28 నుండి 1.10 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.45, **సూర్యాస్తమయం:** 6.25.

వాయిదా వేస్తే ఇప్పట్లో కష్టమే!

- గ్రూప్–2 పరీక్షలపై టీఎస్‌పీఎస్సీ అంచనా
- 2 నెలల పాటు అందుబాటులో లేని ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలు
- ఎన్నికల ప్రక్రియతో అధికారులు బిజీగా ఉండే అవకాశం
- అభ్యర్థుల డిమాండ్ నేపథ్యంలో కమిషన్ తర్జనభర్జన



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 పరీక్షల తేదీల మార్పు కష్టంగానే కనిపిస్తోంది. ఈనెల 29, 30వ తేదీల్లో గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు చేసింది. దాదాపు ఐదు నెలల క్రితమే పరీక్ష తేదీని ప్రకటించింది. అయితే వరుసగా పరీక్షలు ఉన్నాయని, కాబట్టి సన్నద్ధతకు మరింత సమయం కావాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఆందోళన కార్యక్రమాలు సైతం చేపడుతున్నారు. గురువారం టీఎస్‌పీఎస్సీ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. శుక్రవారం కూడా పలుచోట్ల ధర్నాలు నిర్వహించారు. పలు ప్రతిపక్ష పార్టీలు వీరికి మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో సర్వీస్ కమిషన్ తర్జనభర్జన పడుతోంది. వాయిదా వేస్తే ఎదురయ్యే పరిణామాలను అధికారులు సమీక్షిస్తున్నారు. ఇప్పుడు వాయిదా వేస్తే మళ్లీ ఎప్పుడు నిర్వహించొచ్చనే కోణంలోనూ పరిశీలన చేస్తున్నట్లు, ఒకవేళ వాయిదా గనుక వేస్తే దీర్ఘకాలం వేచి చూడాల్సి ఉంటుందనే అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. వరుస ఎన్నికల ప్రక్రియతో అధికార యంత్రాంగం బిజీగా ఉండడం, రెండున్నర నెలల వరకు ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలు అందుబాటులో లేకుండా బుక్ అయిపోవడంతో పరీక్షల వాయిదాపై కమిషన్ ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది.

అభ్యర్థుల్లో గందరగోళం...

గతేడాది డిసెంబర్‌లో గ్రూప్–2 ఉద్యోగ ప్రకటన వెలువడింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5.5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల తేదీని దాదాపు ఐదు నెలల క్రితమే టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. దీంతో అభ్యర్థులంతా సన్నద్ధతలో నిమగ్నమయ్యారు. పరీక్ష తేదీ చాలా ముందుగానే ప్రకటించిన నేపథ్యంలో పరీక్ష కోసం పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం ఉద్యోగాలకు సెలవులు పెట్టి మరీ పుస్తకాలు చేతబట్టారు. అయితే మరికొన్ని పరీక్షలు సైతం సమీప తేదీల్లోనే ఉండటంతో గ్రూప్–2 వాయిదా వేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. దీంతో కొందరు అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. పరీక్ష నిర్వహిస్తారా? లేదా? అనే సందేహం వారిని వెంటాడుతోంది. అయితే టీఎస్‌పీఎస్సీ ఎలాంటి స్పందన వ్యక్తం చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఏదో ఒక స్పష్టత ఇచ్చి ఈ గందరగోళానికి తెరదింపాలని అభ్యర్థులు కోరుతున్నారు.

గ్రూప్-2పై 14లోగా నిర్ణయం చెప్పండి

▶ మొదటి పేజీ తరువాయి

వినిపిస్తూ.. 'రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్–2 పరీక్షలకు దాదాపు 5 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది. 1,500కు పైగా పరీక్ష కేంద్రాలు ఎంపిక చేసి, ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. ఆ రెండు రోజులు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కూడా ప్రకటించాం. ఇప్పుడు వాయిదా వేయాలని కోరడం సమంజసం కాదు. 14వ తేదీలోగా దీనిపై నిర్ణయం వెల్లడిస్తాం ..'అని నివేదించారు. దీంతో ధర్మాసనం విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

ఏఎన్‌ఎంల నియామకంపై స్టే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎస్టీ గురుకుల పాఠశాలల్లో జూన్ 26న చేపట్టిన 623 ఏఎన్ఎం పోస్టుల నియామకాలను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎన్‌ఎంలుగా ఎస్టీ అభ్యర్థులనే నియమించడాన్ని సవాల్ చేస్తూ వనపర్తికి చెందిన బి.రమాదేవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పి.మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఏఎన్‌ఎంల నియామకానికి జూన్ 20న ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఎస్సీ, బీసీ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోకుండా ఎస్టీలతోనే పోస్టులను భర్తీ చేశారని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని ఎస్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిని ఆదేశించారు. విచారణను ఈనెల 14వ తేదీకి వాయిదా వేశారు.

నిరుద్యోగులపై కేసులు పెడితే ఒప్పుకోం

గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేస్తే ప్రభుత్వానికి ఏం నష్టం?: దయాకర్




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని లక్షలాది మంది గ్రూప్–2 అభ్యర్థుల వేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగోని దయాకర్ కోరారు. ఆగస్టు నెలలో నాలుగు పోటీ పరీక్షలుంటే ఏ పరీక్షలు రాయాలో ప్రభుత్వమే చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేసిన తప్పిదాలకు జరిగే నష్టాన్ని నిరుద్యోగులు ఎందుకు అనుభవించాలని ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రూప్–2 వాయిదా వేయాలని లక్షలాది మంది నిరుద్యోగులు కోరుతుంటే ప్రభుత్వం ఎందుకు వినడం లేదో అర్థం కావడం లేదని, నిరుద్యోగులు కోరినట్టు ఆ పరీక్షలను వాయిదా వేస్తే వచ్చే నష్టమేంటని ప్రశ్నించారు. గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించిన నిరుద్యోగులపై ప్రభుత్వం కేసులు పెడుతోందని, నిరుద్యోగులపై కేసులు పెడితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక ఒక్క పరీక్ష కూడా సక్రమంగా నిర్వహించకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేంతవరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, నాలుగు నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అప్పుడే నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని దయాకర్ చెప్పారు.

సివిల్స్‌పై అవగాహన సదస్సు రేపు

సాక్షి, హైదరాబాద్: సివిల్ సర్వీసెస్–2024 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ నెల 13న ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు అమిగోస్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ మంజునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠ్యాంశాలు, సన్నద్ధత వ్యూహం, నోట్స్ తయారీ, సమయపాలనపై జాతీయ స్థాయి అధ్యాపకులతో అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు 9000230735 నంబర్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

ఆహార భద్రత కమిషనర్‌గా హరి చందన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి హరి చందన నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రూ. 500 కోట్లు ఎలా ఖర్చు చేశారు?

- పూర్తి వివరాలతో నివేదిక అందజేయండి
- వరదలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వరద బాధితుల కోసం కేటాయించిన రూ.500 కోట్లు ఎలా ఖర్చు చేశారు.. కోర్టు ఆదేశాల తర్వాత ఎంత మంది బాధితులను గుర్తించారు.. అంటువ్యాధులు రాకుండా ఏం చర్యలు చేపట్టారు.. పునరావాసం పరిస్థితి ఏంటీ.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని బాధితులకు రూ.4 లక్షల చొప్పున ఇచ్చారా?.. మృతులు ఎంతమంది?.. లాంటి వివరాలతో పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం సమర్పించిన రెండో నివేదికపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. జూలై 27, ఆగస్టు 1న ఈ కోర్టు ఏ అంశాలపై స్పష్టత కోరిందో.. అవన్నీ తదుపరి నివేదికలో ఉండాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 17కు వాయిదా వేసింది. జాతీయ విపత్తుల నిర్వహణచట్టం కింద ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మధ్యంతర అప్లికేషన్(ఐఏ) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున హరేందర్ పరిషద్ వాదనలు వినిపిస్తూ 548 రహదారులు దెబ్బతిన్నాయని చెబుతూ నివేదిక అందజేశారు. వాస్తవ పరిస్థితికి ప్రభుత్వ నివేదికకు భారీ వ్యత్యాసం ఉందని పిటిషనర్ తరఫున చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. బాధితులకు ఇంకా పరిహారం అందలేదని చెప్పారు.

'గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలి'

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు చేస్తున్న డిమాండ్‌ను టీఎస్‌పీఎస్సీ సానుకూలంగా పరిశీలించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. వరుసగా గురుకుల ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్ నియామక పరీక్షలు వస్తుండడం, వాటి మధ్యలో గ్రూప్–2 తేదీలు రావడంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని సీఎం కేసీఆర్ శాసనసభ సమావేశాలలోనే హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

యూపీఎస్సీ పరీక్ష కంటే.. రాజకీయాలు కఠినం!

అధికారులు మారుతున్న పరిస్థితికి తగ్గట్టు ప్రజాప్రతినిధులతో కలసి పనిచేయాలి

- మొహాలీ ఐఎస్‌బీలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్
- రుణాలు తీసుకోవద్దనే పాత కాలపు ధోరణితో దేశం వెనుకబడుతోంది
- ఈ అపోహలు తొలగాలి.. రుణాలను భవిష్యత్తు పెట్టుబడిగా గుర్తించాలి
- దేశం తెలంగాణను అనుసరిస్తే.. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని వ్యాఖ్య



మొహాలీలోని ఐఎస్‌బీలో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్, చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, అధ్యాపకులు

సాక్షి, హైదరాబాద్: ''రాజకీయాల్లోకి వచ్చే యువత క్షేత్రస్థాయి నుంచి పనిచేసి వస్తే విజయం సాధించే అవకాశం ఉంది. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన నాకు తెలంగాణ ఉద్యమం ద్వారా ప్రజాక్షేత్రంలో క్షేత్ర స్థాయిలో పనిచేసేందుకు అవకాశం దొరికింది. రాజకీయాల్లో ప్రజా క్షేత్రంలో ఎన్నికల్లో గెలవడం యూపీఎస్సీ పరీక్ష రాసిన దానికన్నా కఠినమైనది..''అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. పంజాబ్‌లో మొహాలీలోని 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)'లో శుక్రవారం జరిగిన 'అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ'కోర్సు ప్రారంభ సమావేశంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకుడిగా తన అనుభవాలను పంచుకున్నారు. వివరాలు కేటీఆర్ మాటల్లోనే..

''అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టుల కోసం దేశంలోని అన్ని ప్రభుత్వాలు నిధుల కొరత అనే అతిపెద్ద సవాల్‌ను ఎదుర్కొంటున్నాయి. రుణాలు తీసుకోకుండా ఉండాలన్న పాతకాలపు ఆలోచన ధోరణితో దేశం వెనుకబడుతోంది. రుణాలను భవిష్యత్తుపై పెట్టుబడిగా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు భావిస్తున్నాయి. కానీ భారత్‌లో మాత్రం అనేక అపోహలు ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి. రాష్ట్రాల్లో అమలవుతున్న ఆదర్శ విధానాల నుంచి కేంద్రం స్ఫూర్తి పొందడానికి వెనకాడాల్సిన అవసరం లేదు.

అధికారులు ఆ ఆలోచన వీడాలి

ప్రభుత్వ పాలనలో శాశ్వతంగా ఉంటామనే ఆలోచన విధానం నుంచి అధికారులు బయటికి రావాలి. మారుతున్న పరిస్థితులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులతో కలసి పనిచేయాల్సిన అవసరం ఉంది. రాజకీయ నాయకుల దూరదృష్టి గొప్పదైతే ప్రభుత్వ యంత్రాంగం కూడా అదే స్ఫూర్తితో పనిచేస్తుందని తెలంగాణ తొమ్మిదేళ్ల అనుభవం నిరూపించింది. నాయకత్వం అంటే ప్రతిరోజు నేర్చుకోవడమే. భవిష్యత్తు బాగుంటుందనే ఆశను ప్రజలకు కల్పించగలిగితే వారు ప్రభుత్వాలు, పార్టీలకు అండగా ఉంటారు. విజయం కోసం త్యాగాలు చేయాలనే భావనకు రాజకీయ నాయకులు మినహాయింపేమీ కాదు. విభిన్న రంగాల్లో అనుభవం కలిగిన నిపుణులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది.

దేశం తెలంగాణను అనుసరిస్తే..: గడిచిన దశాబ్ద కాలంలో తెలంగాణను ఇతర రాష్ట్రాలు, కేంద్రం అనుసరించి ఉంటే.. ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉండేది. ప్రజాస్వామ్య పోరాటాలు, ఉద్యమాలతో ఏర్పాటైన తెలంగాణను ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి మార్గంలో నడపడంలో మేం విజయం సాధించాం. స్వతంత్ర భారతంలో ఏ రాష్ట్రం సాధించని విజయాలను అతి తక్కువ సమయంలో సాధించింది తెలంగాణ మాత్రమే''అని కేటీఆర్ పేర్కొన్నారు.

శాంతిభద్రతలు సవాల్‌గా మారుతున్నాయి

దేశంలో ఎంత వైరుధ్యమున్నా సమైక్యంగానే ఉంటుందనే నమ్మకముంది. కానీ దేశంలో విభజన రాజకీయాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఇలాంటి సమయంలో సుహృద్భావ వాతావరణంలో రాజకీయ పార్టీల మధ్య చర్చలు జరుగుతాయని భావించడం కొంత వాస్తవ దూరమే. మతపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడటం భవిష్యత్తులో అన్ని ప్రభుత్వాలకు పెద్ద సవాల్‌గా మారబోతోంది.

దేశానికి అన్నం పెడుతున్నాం

▶ మొదటి పేజీ తరువాయి

ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ శంషాబాద్‌లోని నోవాటెల్‌లో దేశంలోనే తొలి అగ్రికల్చర్ డేటా ఎక్స్ఛేంజ్‌ను మంత్రి కేటీఆర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అగ్రికల్చర్ డేటా ఎక్స్ఛేంజ్ ప్రవేశపెట్టడం దేశ వ్యవసాయ చరిత్రలో కొత్త అధ్యాయమని.. అందుబాటులోకి వచ్చిన అగ్రికల్చరల్ డేటా మేనేజ్‌మెంట్ ఫ్రేమ్ వర్క్ (ఏడీఎంఎఫ్)తో పరిశ్రమలు, స్టార్టప్‌లు వ్యవసాయ డేటాను సమర్థవంతంగా ఉపయోగించుకొని రైతులకు ప్రయోజనకారిగా ఉండాలని పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించి రైతులు పంటల ఎంపిక, పంట వేసే సమయం, మెరుగైన ధరలను అందించే మార్కెట్లను ఎంచుకోవడం, వాతావరణం, ప్రస్తుత తెగుళ్ల పరిస్థితులను తెలుసుకొని రైతులకు మేలు చేయాలని సూచించారు.

రాష్ట్రంలో ఐదు రకాల విప్లవాలు

ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికి వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల్లో తెలంగాణ 24వ స్థానంలో, ధాన్యం ఉత్పత్తిలో 15వ స్థానంలో ఉండేదని.. ఇప్పుడు ఏకంగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. గత తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో ఐదు విప్లవాలు సాకారమయ్యాయని కేటీఆర్ చెప్పారు. ''అత్యధిక వరి ఉత్పత్తి ద్వారా 'గ్రీన్ రెవల్యూషన్' సాధ్యమైంది. మత్స్య సంపద ఉత్పత్తిలోనూ మొదటిస్థానంలో ఉన్నాం. తద్వారా 'బ్లూ రెవల్యూషన్' సాధ్యమైంది. పాడి రైతులకు మెరుగైన ప్రోత్సాహకాలు అందించడం ద్వారా 'వైట్ రెవల్యూషన్' సాధ్యమైంది. కుర్మ,యాదవ కుటుంబాలకు గొర్రెలు పంపిణీతో మాంసాహార ఉత్పత్తి పెరిగి.. 'పింక్ రెవల్యూషన్' సాకారమైంది. ప్రస్తుతం దేశంలో ఎక్కడా లేని విధంగా ఆయిల్‌పామ్ రైతులకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. దీనిద్వారా 'ఎల్లో రెవల్యూషన్' సాధ్యమవుతుంది..'' అని పేర్కొన్నారు.

ఎలక్ట్రిక్ మొబిలిటీలో అగ్రగామిగా రాష్ట్రం: కేటీఆర్

శంషాబాద్: ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోందని.. పరిశోధన, డిజైనింగ్ రంగాల్లో హైదరాబాద్ ముందజలో ఉందని మంత్రి కేటీఆర్ చెప్పారు. శుక్రవారం జీఎంఆర్ ఏరోసిటీలో అమరరాజా కంపెనీకి చెందిన ఈ–పాజిటివ్ ఎనర్జీ ల్యాబ్‌కు మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం నోవాటెల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అమరరాజా పరిశోధన కేంద్రం 'విద్యుత్ నిల్వ, ఎలక్ట్రిక్ మొబిలిటీ' రంగాల సుస్థిర వృద్ధికి బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యావరణహిత సుస్థిరాభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పరిశ్రమలతో కలసి ముందుకు వెళుతోందని చెప్పారు. కాగా.. అభివృద్ధి చెందుతున్న ఇంధన నిల్వ అవసరాలను పరిష్కరించే దిశగా పాజిటివ్ ఎనర్జీల్యాబ్ పనిచేస్తుందని అమరరాజా సంస్థ చైర్మన్ గల్లా జయదేవ్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నటి జయప్రదకు ఆరు నెలల జైలు శిక్ష



సాక్షి, చెన్నై: కార్మికుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని కార్మిక బీమా సంస్థకు చెల్లించకుండా మోసం చేసిన కేసులో సినీ నటి, మాజీ ఎంపీ జయప్రద సహా ముగ్గురికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ చెన్నై ఎగ్మూర్ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. జయప్రదకు గతంలో చెన్నైలోని రాయపేటలో 'జయప్రద థియేటర్ కాంప్లెక్స్'ఉండేది. చెన్నైకి చెందిన రామ్ కుమార్, రాజబాబు థియేటర్ నిర్వహణ వ్యవహారాలు చూసుకునేవారు. కొంతకాలం తర్వాత ఆ కాంప్లెక్స్‌ను మూసివేశారు. అయితే, సిబ్బంది నుంచి ఈఎస్ఐ రూపంలో వసూలు చేసిన సొమ్మును థియేటర్‌ను మూసివేసిన తర్వాత వారికి చెల్లించలేదు. దీంతో బాధితులు బీమా కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు బీమా సంస్థ చెన్నై ఎగ్మూర్ మేజిస్ట్రేట్ కోర్టులో సినిమా థియేటర్ యాజమాన్యానికి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేసింది. కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బును వారికి చెల్లించలేదని పేర్కొంది. దీనికి వ్యతిరేకంగా జయప్రద తదితరులు వేసిన పిటిషన్లను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఆ డబ్బును కార్మికులకు అందజేసేందుకు జయప్రద ముందుకు వచ్చినా బీమా సంస్థ అంగీకరించలేదు. విచారణ ముగియడంతో ఎగ్మూర్ మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం జయప్రద తోపాటు మరో ముగ్గురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

ఆర్ఎంపీలకు కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఆర్ఎంపీ) వైద్యులకి జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) కొత్త నియంత్రణలు విధించింది. ఫార్మా కంపెనీలు, వారి ప్రతినిధులు, వైద్య పరికరాల సంస్థల దగ్గర్నుంచి వైద్యులు, వారి కుటుంబ సభ్యులు ఎలాంటి కానుకలు, డబ్బులు, ఆతిథ్యం స్వీకరించకూడదని నిబంధనలు విధించింది. ఫార్మా కంపెనీలు ఇచ్చే పార్టీల్లో పాల్గొనడం, ప్రయాణ సదుపాయాలను తీసుకోవడం వంటివి చేయకూడదని పేర్కొంది. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు వృత్తిపరమైన బాధ్యతని కలిగి ఉంటూ ప్రవర్తించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆగస్టు 2నే ఈ నిబంధనల్ని జారీ చేసింది. అంతే కాదు ఫార్మా కంపెనీలు తయారు చేసే మందులు ఇతర పరికరాల వినియోగాన్ని ఆమోదిస్తూ ప్రకటనలివ్వకూడదంది.

మూక దాడికి మరణమే

మైనర్లపై అత్యాచారానికి సైతం మరణశిక్షే



▶ మొదటి పేజీ తరువాయి

స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపాల్సిందిగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను మంత్రి కోరారు.

మూడేళ్లలో న్యాయం

ప్రతిపాదిత బిల్లులు ఆమోదం పొందితే నేర న్యాయ వ్యవస్థ సమూలంగా మెరుగు పడుతుందని అమిత్ షా అన్నారు. అంతేగాక ప్రతి పౌరునికీ గరిష్టంగా మూడేళ్లలో న్యాయం అందుతుందన్నారు. 'కొత్త చట్టాల్లో మహిళలు, బాలలకు అత్యంత ప్రాధాన్యం దక్కనుంది. మూక దాడుల వంటి హేయమైన నేరాలకు కూడా నిర్దిష్టమైన శిక్షలను పొందుపరిచాం. తొలిసారిగా ఉగ్రవాదానికి కూడా నిర్వచించాం' అని ప్రకటించారు. 'రాజద్రోహం సెక్షన్ ను పూర్తిగా ఎత్తేస్తున్నాం. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ భావ వ్యక్తీకరణ హక్కు ఉంటుంది' అని వివరించారు. 'ఈ బిల్లులు మన నేర న్యాయ వ్యవస్థను సమూలంగా మెరుగు పరుస్తాయని సభకు హామీ ఇస్తున్నా. వీటి లక్ష్యం శిక్ష విధింపు కాబోదు. న్యాయం అందేలా చూడటమే ప్రధానోద్దేశం. కొత్త చట్టాల్లో కేవలం నేరాలను నియంత్రించే లక్ష్యంతో మాత్రమే శిక్ష విధింపులు ఉంటాయి' అన్నారు. బ్రిటిష్ కాలం నాటి ప్రస్తుత చట్టాల నిండా బానిసత్వపు చిహ్నాలే ఉన్నాయని విమర్శించారు. 'అధికారంలో ఉన్నవారిని వ్యతిరేకించే ప్రతి ఒక్కరినీ ఏదోలా శిక్షించడం వాటి ఏకైక లక్ష్యము. బ్రిటిష్ అధికారాన్ని పరిరక్షించడం, బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపుదిద్దుకున్న చట్టాలవి. శిక్షించడమే వాటి ప్రధాన లక్ష్యం తప్ప న్యాయం అందించడం కాదు' అని ఆరోపించారు. శిక్ష పడే రేటును కనీసం 90 శాతానికి పెంచడమే కొత్త చట్టాల లక్ష్యమన్నారు. ఇందుకోసం ఫోరెన్సిక్ సైన్స్ వాడకాన్ని మరింతగా పెంచే యోచన కూడా ఉందన్నారు.

- మూక దాడులకు, మైనర్లపై అత్యాచారానికి మరణశిక్ష.
- దేశం పట్ల నేరాలను ఇకపై అతి తీవ్రమైనవిగా పరిగణిస్తారు.
- కొన్ని రకాల చిల్లర నేరాలకు శిక్షగా సామాజిక సేవ (అమల్లోకి వస్తే ఇలాంటి శిక్ష ఇదే తొలిసారి అవుతుంది).
- వేర్పాటువాదం, తత్సంబంధ చర్యలు, సాయుధ తిరుగుబాటు, భారత సార్వభౌ మత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను ప్రమాదంలో పడవేయడం వంటి కొత్త నేరాలను పొందుపరిచారు.
- పలు నేరాలకు ఇకపై లింగ భేదం ఉండబోదు.
- పెళ్లి, ఉద్యోగం, ప్రమోషన్ల వంటి ప్రలోభాలు చూపి, గుర్తింపును దాచి మహిళలను లైంగికంగా దోచుకోవడం నేరంగా పరిగణనలోకి వస్తుంది.
- గ్యాంగ్ రేప్ కు 20 ఏళ్లు, లేదా జీవిత ఖైదు.
- తీవ్రతను బట్టి మూక దాడులకు ఏడేళ్లు, జీవిత ఖైదు, లేదా మరణ శిక్ష.
- తొలిసారిగా ఉగ్రవాదానికి నిర్వచనం.
- ఉగ్రవాదుల ఆస్తుల జప్తు

రాజద్రోహం ఇక దేశద్రోహం

బ్రిటిష్ కాలం నాటి వివాదాస్పద రాజద్రోహ చట్టాన్ని తొలగించనున్నట్టు కేంద్రం ప్రతిపాదించింది. అదే సమయంలో దేశద్రోహం పేరిట దానికి కొత్త రూపు ఇవ్వనుంది. బ్రిటిష్ సింహాసనాన్ని గుర్తు చేసే వలస వాసనలు వదిలించుకోవడమే పేరు మార్పు ఉద్దేశమని పేర్కొంది. బీఎన్ఎస్ బిల్లులో ప్రతిపాదించిన ఈ కొత్త చట్టాన్ని మరిన్ని కొత్త సెక్షన్లతో మరింత బలోపేతం కూడా చేయనుంది. దాని ప్రకారం... ఉద్దేశపూర్వకంగా నోటిమాట ద్వారా, రాతపూర్వకంగా, సైగలు, చిహ్నాల ద్వారా, అందరికీ బయటికి కనిపించేలా, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ ద్వారా, ఆర్థిక సాధనాల ద్వారా, ఇతరత్రా, రెచ్చగొట్టే చర్యల ద్వారా, వేర్పాటువాదం ద్వారా, సాయుధ తిరుగుబాటు ద్వారా, అలాంటి ధోరణులను ప్రోత్సహించినా, దేశ సార్వభౌమత్వాన్ని, సమైక్యతను, సమగ్రతను ప్రమాదంలో పడేసినా, అలాంటి మరే ఇతర చర్యలకు పాల్పడినా అది దేశ ద్రోహమే.

- దేశానికి వ్యతిరేకంగా చేసే ఎలాంటి పనినైనా దేశ ద్రోహంగానే పరిగణిస్తారు.
- శాంతి సమయంలో ప్రభుత్వంపై యుద్ధం చేసినా, అందుకు ప్రయత్నించినా, అందుకోసం విదేశీ ప్రభుత్వాలతో చేతులు కలిపినా, అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించినా అందుకోసం మూకలను, ఆయుధాలను సమీకరించినా, అందుకు ప్రయత్నించినా, అలాంటి ప్రయత్నాలు గురించి తెలిసీ చెప్పకపోయినా, వాటిని దాచినా, అది దేశ ద్రోహమే.
- నేర తీవ్రతను బట్టి అందుకు జీవిత ఖైదు, పదేళ్లకు మించని, లేదా ఏడేళ్ల ఖైదు, వాటితో పాటు జరిమానా కూడా పడవచ్చు.

రాజకీయ రెమిషన్లకు చెక్...

శిక్ష తగ్గింపు (రెమిషన్) వంటి సదుపాయాలను రాజకీయ లబ్ధికి వాడుకోవడాన్ని నిరోధించేందుకు ప్రతిపాదిత బిలుల్లో కొత్త సెక్షన్లు పొందుపరిచారు. వాటి ప్రకారం...

- ఇకపై మరణశిక్షను కేవలం జీవిత ఖైదుగా మాత్రమే మార్చేందుకు వీలవుతుంది.
- జీవిత ఖైదును ఏడేళ్ల శిక్షగా మాత్రమే మార్చవచ్చు.
- బిహార్ కు చెందిన నేరమయ నేత ఆనంద్ మోహన్ కు క్షమాభిక్ష పెట్టి విడుదల చేయడానికి అమిత్ షా ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుకే రాజకీయ అండదండ లున్న వారు చట్టం బారి నుంచి తప్పించుకోకుండా చూసేందుకే ఈ సెక్షన్లను చేర్చినట్టు వివరించారు.

న్యాయ సంహిత బిల్లు ప్రకారం ఉగ్రవాది అంటే...

- దేశంలో గానీ, విదేశాల్లో గానీ భారత దేశ ఐక్యతను, సమగ్రతను, భద్రతను ప్రమాదంలో పడేసే చర్యలకు పాల్పడేవాడు.
- తద్వారా జన సామాన్యాన్ని, లేదా ఒక వర్గాన్ని భయభీతులను చేసేవాడు, శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగించేవాడు.

> 'నేర న్యాయ చట్టాలను సమూలంగా మదింపు చేయాల్సిన, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాల్సిన అవసరం చాలా ఉందని 70 ఏళ్ల ప్రజాస్వామ్య భారత అనుభవం చెబుతోంది. సబ్ కా సాథ్ (అందరికీ తోడు), సాబ్ కా వికాస్ (అందరి అభివృద్ధి), సాబ్ కా విశ్వాస్ (అందరి నమ్మకం), సాబ్ కా ప్రయాస్ (అందరి ప్రయత్నం) అన్నదే కేంద్ర ప్రభుత్వ మంత్రం'
>
> - బీఎన్ఎస్ఎస్ బిల్లు లక్ష్య ప్రకటన

పార్లమెంట్ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు శుక్రవారంతో ముగియడంతో ఉభయసభలు నిరవధికంగా వాయి దా పడ్డాయి. పార్లమెంట్ సమావేశాలు జూలై 20వ తేదీ నుంచి ప్రారంభమయిన విషయం తెలిసిందే. ఆందోళనలు, నిరసనల కారణంగా రాజ్యసభ 17 సిట్టింగ్లో 44 గంటల 58 నిమిషాల సమయం వృథా అయిందని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు వంటి కీలక బిల్లును ఆమోదించిందన్నారు. అదేవిధంగా, లోక్‌సభలో 39 గంటలపాటు కార్యకలాపాలు కొనసాగగా ముఖ్యమైన బిల్లులకు ఆమోదముద్ర వేసిందని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు.

'భరత మాత' మాటను తొలగించలేదు

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడి

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రసంగం సమయంలో తను ప్రస్తావించిన 'భరత మాత'మాటను తొలగించారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందించారు. రాహుల్ గాంధీ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఆయన మతి తప్పినట్లుగా అనిపిస్తోందని జోషి వ్యాఖ్యానించారు. అన్ పార్లమెంటరీ మాటలను తొలగించామే తప్ప, భరతమాత అనే మాటను కాదని చెప్పారు. మరో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ..ఏదో హడావుడి చేయాలన్న రాహుల్ గాంధీ ప్రయత్నం మరోసారి ఫెయిల్, ఫ్లాప్ అయ్యిందంటూ ఎద్దేవా చేశారు. 'రాహుల్ తప్పుడు భాషను వాడుతున్నారు. భరత మాత బిడ్డ ఎవరూ కూడా ఆమె హత్య గురించి మాట్లాడరు, ఆలోచించరు. దేశానికి అప్రతిష్ట తెచ్చేందుకే ఇలా మాట్లాడుతున్నారన్న విషయం రాహుల్ వాడిన భాషను చూస్తే స్పష్టంగా తెలుస్తుంది'అని ఆరోపించారు.

మణిపూర్‌పై చర్చించాలని బీజేపీ భావించలేదు

ఆ పార్టీ మాటలన్నీ బోగస్ : కాంగ్రెస్

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే మణిపూర్ అంశంపై చర్చించడానికి తాము అంగీకరించినట్టు కేంద్రం పేర్కొనడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పు పట్టింది. బీజేపీ చెబుతున్నదంతా ఒట్టి బోగస్ అని కొట్టి పారేసింది. పార్లమెంటు ముగిసిన తర్వాత ఇలాంటి తప్పుడు స్టేట్‌మెంట్‌లు ఇవ్వడం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అలవాటేనని ఆరోపించింది . మణిపూర్‌పై చర్చించాలని కేంద్రం భావించిందని కానీ ప్రతిపక్ష పార్టీలు రాజకీయ కారణాలతో దానికి నిరాకరించాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ మండిపడ్డారు. మణిపూర్‌పై ప్రధానితో మాట్లాడించడానికే తాము అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందని ట్వీట్ చేశారు. లోక్‌సభలో 133 నిముషాల సేపు మాట్లాడిన మోదీ మణిపూర్‌పై నాలుగు నిముషాలు కూడా మాట్లాడలేదని, అది కూడా విపక్షాలు వాకౌట్ చేశాక మణిపూర్ అంశాన్ని ప్రస్తావించారని అందులో పేర్కొన్నారు. రాజ్యసభలో కూడా చర్చ జరగాలని ఇండియా కూటమి పట్టుపట్టినా అధికార పక్షం పడనివ్వలేదన్నారు.

అప్పట్లో అద్వానీ ఏం చెప్పారంటే..

ఈసీనియామక కమిటీపై అద్వానీ రాసిన లేఖను పంచుకున్న కాంగ్రెస్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు ముందున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘంపై నియంత్రణ సాధించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. భారత ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర కమిషనర్ల నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బదులుగా కేబినెట్ మంత్రికి స్థానం కల్పిస్తూ కేంద్రం వివాదాస్పద బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. సీజేఐని తప్పించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్.. 2012లో బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ రాసిన లేఖను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అప్పట్లో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌కు అద్వానీ లేఖ రాస్తూ రాజ్యాంగబద్ధమైన నియామకాలు జరిగినప్పుడు ఎలాంటి పక్షపాతానికి చోటివ్వకూడదని పేర్కొన్నారు. సీఈసీని నియమించే కమిటీలో ప్రధానమంత్రితో పాటు పార్లమెంటు ఉభయ సభల్లో ప్రతిపక్ష నేతలు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి చోటు కల్పించాలని అద్వానీ ఆ లేఖలో పేర్కొన్నట్టు జైరాం రమేశ్ వెల్లడించారు. అధికార, ప్రతిపక్షాలకు సమాన ప్రాతినిధ్యం ఉండేలా కమిటీ ఉండాలని అప్పట్లోనే అద్వానీ చెబితే, ఇప్పుడు మోదీ ప్రభుత్వం 2:1 నిష్పత్తిలో సభ్యుల్ని ఉంచడమేంటని ప్రశ్నించారు. ప్రధానమంత్రితో పాటు కేబినెట్ మంత్రి కూడా అధికార పక్షానికి చెందినవాడే కావడం వల్ల ఎన్నికల సంఘంపై బీజేపీ పెత్తనం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మణిపూర్ మండుతూ ఉంటే పార్లమెంట్‌లో జోకులా?

ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజం



న్యూఢిల్లీ: మణిపూర్ హింసాత్మక ఘటనలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీని మరోసారి టార్గెట్ చేశారు. గురువారం పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానానికి బదులిస్తూ ప్రధాని మోదీ నవ్వడం, జోకులు వేయడాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రధాని ప్రవర్తన సరైంది కాదన్నారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో రాహుల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మోదీ మణిపూర్ హింసను తక్షణం ఆపాలనుకుంటే, అందుకు అవసరమైన చాలా మార్గాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని చెప్పారు. భారత ఆర్మీ అక్కడి పరిస్థితులను రెండు రోజుల్లోనే అదుపులోకి తీసుకొస్తుందని చెప్పారు. 'అక్కడ మహిళలు, చిన్నారులు చనిపోతున్నారు. మహిళలు వేధింపులు, అత్యాచారాలకు గురవుతున్నారు. భారత ప్రధాని మోదీ మాత్రం నిండు పార్లమెంట్‌లో రెండు గంటలపాటు నవ్వుతూ, నవ్విస్తూ, నినాదాలతో గడిపారు. నాలుగు నెలలుగా మణిపూర్ మంటల్లో ఉన్న విషయం ఆయన మర్చిపోయినట్లున్నారు. మణిపూర్ మండుతూనే ఉండాలని ఆయన కోరుకుంటున్నారు, మంటలను ఆపడం ప్రధానికి ఇష్టం లేదు' అని రాహుల్ ధ్వజమెత్తారు. ఈ విషయం రాహుల్ గాంధీకి, కాంగ్రెస్‌కు, ప్రతిపక్షానికి సంబంధించింది కాదు, ఇది భారత్‌కు, మన దేశానికి సంబంధించిన విషయం. ఒక రాష్ట్రం నాశనమైంది. అదిప్పుడు ఉనికిలో లేదు. విభజించు, పాలించు, తగులబెట్టు.. తరహా బీజేపీ రాజకీయాల వల్లే ఇలా అయింది'అని రాహుల్ మండిపడ్డారు. 'నేను అటల్ బిహారీ వాజ్‌పేయి, దేవెగౌడ వంటి ప్రధానుల్ని చూశాను. మోదీ వంటి ఇంత దిగజారిన ప్రధానిని ఎన్నడూ చూడలేదు'అన్నారు. 'మణిపూర్‌లో భారత మాత హత్యకు గురైంది'అని నేను చేసిన వ్యాఖ్య సాధారణమైంది కాదు. నా 19 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇలాంటి మాట వాడటం ఇదే మొదటిసారి'అని అన్నారు. మణిపూర్‌లోని మొయితీలుండే ప్రాంతానికి వెళ్లినప్పుడు.. వాళ్లు మమ్మల్నెంతో ప్రేమగా చూశారు. అక్కడే ఉండిపొమ్మన్నారు. అక్కడున్న భద్రతా సిబ్బంది ఒక్క కుకీ వర్గం వ్యక్తి కూడా లేరు. కుకీలుండే ఏరియాకు వెళ్లినప్పుడూ మాకు ఇదే అనుభవం ఎదురైంది. అక్కడ ఒక్కడి భద్రతా సిబ్బందిలో ఒక్క మొయితీ కూడా లేరు. ఇలాంటి పరిస్థితి మణిపూర్‌లో మునుపెన్నడూ లేదని కేంద్ర భద్రతా సిబ్బంది ఒకరు నాతో అన్నారు'అని రాహుల్ చెప్పారు. 'అందుకే మణిపూర్‌లో భరతమాత హత్యకు గురైందన్నాను. అది తమాషాకు కాదు. వాస్తవమే చెప్పాను'అని రాహుల్ తెలిపారు. 'పార్లమెంట్‌లో నా ప్రసంగంలోని భరతమాత అనే మాట దోషంగా భావించి రికార్డుల నుంచి తొలగించి వేశారు. అందులో తప్పేముంది? ఇలా భరత మాత మాటను తొలగించడం పార్లమెంట్ చరిత్రలోనే తొలిసారి'అని రాహుల్ పేర్కొన్నారు.

ప్రధాని హోదాకు తగని ప్రసంగం

గురువారం లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా మండిపడ్డారు. ప్రధాని మోదీ రెండు గంటల ప్రసంగమంతా హాస్యం, వ్యంగ్యం, అసందర్భ వ్యాఖ్యలతోనే గడిచిపోయిందని వ్యాఖ్యానించారు. 'మణిపూర్ లాంటి తీవ్రమైన, సున్నితమైన అంశంపై మాట్లాడేటప్పుడు నవ్వడం, ఎగతాళి చేయడం ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తికి తగదు'అని ఆమె శుక్రవారం ట్వీట్ చేశారు.

రాజస్తాన్‌లోని కోటా. ప్రవేశ పరీక్షల కోచింగ్‌కు పెట్టింది పేరు.
ఇప్పుడు విద్యార్థి ఆత్మహత్యలకు కోటలా మారింది.
వారం రోజుల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.
ఈ ఏడాది ఇప్పటివరకు 18 మంది నిండు ప్రాణాలను తీసుకున్నారు.
ఈ ఆత్మహత్యలకి కారణాలేంటి ?
విద్యార్థుల ఆత్మహత్యల్ని నివారించలేరా?



ఒత్తిడి కోటా ఎక్కువై..

రాజస్తాన్ కోటాలో ఆగని విద్యార్థుల ఆత్మహత్యలు • వారం రోజుల వ్యవధిలో ముగ్గురు బలి

కోటాలో ఏ కోచింగ్ సెంటర్‌లో అడుగుపెట్టినా కళ్లు చెదురుతాయి. పెద్ద రిసెప్షన్ హాలు, లగ్జరీ ఫర్నీచర్, గోడలకి పెయింటింగ్‌లు, సీసీటీవీ కెమెరాలు, బయోమెట్రిక్ సిస్టమ్, ఫైవ్ స్టార్ హోటల్స్‌ని తలపించేలా సకల సదుపాయాలు. ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని ఆశతో కలలు కనే విద్యార్థులకు కావల్సిన సదుపాయాలు అన్నీ ఉన్నాయి. ఈ ఏడాది ప్రవేశ పరీక్షలకు ప్రిపేర్ అవడానికి దేశం నలుమూలల నుంచి 3 లక్షల మంది విద్యార్థులు చేరారు. ఐఐటీ, ఐఐఎంలలో అత్యధిక మందికి సీటు లభిస్తున్నప్పటికీ చాలా మందిలో భవిష్యత్‌పై భరోసా కూడా కరువు అవుతోంది. రాను రాను విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. కొందరు హాస్టల్ భవనంపై నుంచి దూకి, మరికొందరు సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకొని , కొందరు సూసైడ్ నోట్ రాసి మరికొందరు మౌనంగా కన్నవారికి కడుపుకోత మిగిల్చి వెళ్లిపోతున్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్‌కు చెందిన బహదూర్, రాజస్తాన్ జలోర్‌కు చెందిన పుష్పేంద్ర సింగ్ , బిహార్‌కు చెందిన భార్గవ్ మిశ్రా, యూపీకి చెందిన మంజోత్ చాబ్రా, ఇప్పుడు యూపీలోని అజమ్‌గఢ్‌కు చెందిన మనీశ్ ప్రజాపతి .. గత కొద్ది రోజుల్లో కోటాలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులు వీరంతా. అందరూ 16 నుంచి 19 ఏళ్ల వయసు మధ్యనున్న వారే. మనీష్ నాలుగు నెలల క్రితమే కోటాలో ఇంజనీరింగ్ కోచింగ్‌లో జాయిన్ అయ్యాడు. బుధవారమే అతని తండ్రి వచ్చి కొడుకుని చూసి క్షేమసమాచారాలు అడిగి తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన తన ఊరు చేరకుండానే మనీశ్ ఆత్మహత్య చేసుకున్నాడని ఫోన్ వచ్చింది. అంతే ఆ తండ్రి కుప్పకూలిపోయాడు. ఈ మధ్య కాలంలో కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత 12 ఏళ్లలో 150 మంది విద్యార్థులు కోటాలో ఆత్మహత్య చేసుకున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కరోనా మహమ్మారి తర్వాత కోచింగ్ సెంటర్‌లు ప్రారంభమయ్యాక 2021లో నలుగురు ఆత్మహత్యకు పాల్పడితే, 2022లో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 18 మంది బలవన్మరణం చెందారు.



ఆత్మహత్యకి నివారణ మార్గాలేంటి ?

విద్యార్థుల వరస ఆత్మహత్యలతో కోచింగ్ సిటీ కోటాపై వ్యతిరేకత పెరిగిపోతూ ఉండడంతో రాజస్తాన్ ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది. 24/7 పని చేసే హెల్ప్‌లైన్ నెంబర్లు, పోలీసుల ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేశారు. కొన్ని కోచింగ్ సెంటర్లు ప్రత్యేకంగా కౌన్సెలర్లను నియమించి ఒత్తిడిలో ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తోంది. మానసిక ప్రశాంతతనిచ్చే యోగా, ధ్యానం, జుంబా డ్యాన్స్‌లు వంటి క్లాసులు కూడా కొన్ని కోచింగ్ సెంటర్లలో కనిపిస్తున్నాయి. అయితే ఈ చర్యలు సరిపోవని అనూ గుప్తా అనే టీచర్ చెబుతున్నారు. కోచింగ్ సెంటర్ యాజమాన్యాలు 24 గంటలూ పోటీ పరీక్షల్లో టెక్నిక్కులను బోధించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారే తప్ప జీవితంలో వచ్చే సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలో, పోటీ ప్రపంచంలో ఎదురయ్యే అడ్డంకుల్ని అధిగమించే పోరాటస్ఫూర్తిని విద్యార్థుల్లో కల్పించడం లేదని అనూ పేర్కొన్నారు. ఎలాగైనా బతకగలమన్న ధీమా విద్యార్థుల్లో నింపినప్పుడే ఆత్మహత్యల్ని నివారించవచ్చునని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు చదువు మీద పెట్టే సమయానికి, ఇతర కార్యక్రమాలకి ఇచ్చే సమయానికి మధ్య సమతుల్యత ఉండాలని అష్లో మాత్రా అనే సైకాలజిస్ట్ చెప్పారు. రోజుకి 18 గంటలు చదువు రుద్దేయడం వల్ల మెంటల్ బ్యాలెన్స్ కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల్ని కోటా ఫ్యాక్టరీకి పంపించే ముడి పదార్థాలుగా చూస్తున్నారని ఇప్పుడు వారిపై పెట్టుబడి పెడితే భవిష్యత్‌లో వారు ఉపయోగపడతారన్న ధోరణి నుంచి బయటకు రావాలని అవిజిత్ పాఠక్ అనే సైకాలిజిస్టు సూచించారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడానికి రాజస్థాన్ ప్రభుత్వం ప్రైవేటు విద్యా సంస్థల నియంత్రణ బిల్లుని తీసుకురావాలని భావిస్తోంది.ఆ బిల్లు వెంటనే తీసుకువచ్చి విద్యార్థుల ఆత్మహత్యల్ని నివారించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఎందుకీ ఆత్మహత్యల పరంపర ?

- ఇది పోటీ ప్రపంచం. వంద సీట్లు ఉంటే లక్ష మంది పరీక్ష రాస్తున్నారు. అంత పోటీని తట్టుకొని విజయం సాధించడం సులభం కాదు. అందుకే విద్యార్థులు ప్రెషర్ కుక్కర్‌లో పెట్టినట్టుగా తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. తాము కన్న కలలు కల్లలవుతాయన్న భయంతో నిండు ప్రాణాలు తీసేసుకుంటున్నారు.
- కోటాలో ఆత్మహత్య చేసుకుంటున్న విద్యార్థుల్లో యూపీ, బిహార్ వంటి రాష్ట్రాలకు చెందినవారే ఎక్కువ. ఆ విద్యార్థులు వారి స్కూల్లో ఫస్ట్ ర్యాంకర్స్. దీంతో తల్లిదండ్రులు గంపెడాశలతో అప్పో సొప్పో చేసి కోటాలో చేర్పిస్తున్నారు. తమ స్కూల్లో హీరోగా వెలిగిన విద్యార్థికి అక్కడికి రాగానే తాను లక్షల మందిలో ఒకడినన్న వాస్తవం తెలుస్తుంది. మిగిలిన విద్యార్థులతో నెగ్గుకురాలేక, తల్లిదండ్రుల్ని నిరాశపరచలేక ఆత్మహత్యకి పాల్పడుతున్నారు.
- కోటాలో కోచింగ్ తీసుకునే విద్యార్థులు రోజుకి 16–18 గంటల చదవాలి. ఉదయం 6.30 నుంచి మళ్లీ అర్ధరాత్రి 2 వరకు తరగతులు ఉంటాయి. అంటే విద్యార్థి పడుకోవడానికి ఇచ్చే సమయం కేవలం నాలుగు గంటలు. మధ్యలో తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడడానికి అవకాశం ఇస్తారు. "ఏదో ఒకరోజు బాగా నిద్ర వచ్చి పావుగంట ఎక్కువ సేపు పడుకుంటే గిల్టీగా ఫీలవుతాను. తోటి వారి కంటే వెనకబడిపోతానన్న భయం వేస్తుంది. ఆ రోజంతా ఏడుస్తూనే ఉంటాను" అని ఐఐటీకి ప్రిపేర్ అవుతున్న సమర్ అనే విద్యార్థి చెప్పాడు. కంటినిండా నిద్రకి కూడా నోచుకోని చదువుల భారం వారి ప్రాణాలు తోడేస్తోంది.
- కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కోవిడ్ తర్వాత మరింత ఎక్కువయ్యాయి. కరోనా సమయంలో విద్యార్థులకి చదివే అలవాటు తప్పిపోయింది. దానికి తోడు కోవిడ్ సోకిన వారిలో మానసిక సమస్యలు ఎక్కువయ్యాయి. చదువుల ఒత్తిడి మరింతగా కుంగదీస్తోంది. ఆత్మహత్యకు పురిగొల్పుతోంది.
- కోటాలో కోచింగ్‌కే ఏడాదికి 2 లక్షల నుంచి 5 లక్షల రూపాయల దాకా అవుతుంది. నిరుపేద కుటుంబాల విద్యార్థులకి తల్లిదండ్రులు చేసిన అప్పే ఎప్పుడూ కళ్ల ముందు కనిపిస్తోంది. ఆ లేత మనసులపై ఒత్తిడి పెంచుతుంది. దీంతో కోచింగ్ సెంటర్ల పరీక్షల్లో ఫెయిలైనా జీవితాన్ని అంతం చేసుకుంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా సస్పెన్షన్



న్యూఢిల్లీ: నిబంధనల ఉల్లంఘన, అనుచిత ప్రవర్తన, ధిక్కార వైఖరి ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ రాఘవ్ చద్దా రాజ్యసభ నుంచి సస్పెన్షన్‌కు గుర య్యారు. ఆయన సస్పెన్షన్‌పై శుక్రవారం రాజ్యసభ నేత పీయూష్ గోయెల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. దేశ రాజధాని ఢిల్లీ(సవరణ) బిల్లు-2023పై ప్రతిపాది త సెలెక్ట్ కమిటీకి అనుమతి తీసుకోకుండానే కొందరు సభ్యుల పేర్లను చేర్చినందుకు ఈ చర్య తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై సభా హక్కుల కమిటీ విచారణ జరిపి, నివేదిక ఇచ్చే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని తెలిపింది. ఆప్ మరో నేత సంజయ్ సింగ్ సస్పెన్షన్ పొడిగించే తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. వర్షాకాల సమావేశాల ప్రారంభంలోనే సంజయ్ సింగ్ సస్పెన్షన్‌కు గురయ్యారు.

హరియాణా మత ఘర్షణల కేసులపై కమిటీ: సుప్రీం

న్యూఢిల్లీ: సమాజంలో వివిధ వర్గాల మధ్య సామరస్యం, పరస్పర మర్యాదపూర్వక ప్రవర్తన అత్యంత అవసరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. విద్వేషపూరిత ప్రసంగాల్ని ఎవరూ అంగీకరించరని పేర్కొంది. హరియాణాలో ఆరుగురు ప్రాణాలను బలిగొన్న మత ఘర్షణలకు సంబంధించి రిజిస్టర్ అయిన కేసుల విచారణకు రాష్ట్ర డీజీపీ నేతృత్వంలో ఒక కమిటీ వేయాలని సుప్రీం కోర్టు ప్రతిపాదించింది. హరియాణా సహా వివిధ రాష్ట్రాల్లో ఒక మతం వారిని చంపేయాలంటూ చేసిన విద్వేష పూరిత ప్రసంగాల వల్ల హింస చెలరేగుతోందన్న ఆరోపణలతో దాఖలైన పిటి:షన్లను శుక్రవారం సుప్రీం విచారణ చేపట్టింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆగస్టు 18లోగా కమిటీ ఏర్పాటుపై కోర్టుకు సమాచారం ఇవ్వాలని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం. నటరాజ్‌ను ఆదేశించింది. సమాజంలో వివిధ వర్గాల మధ్య సమరస్యపూర్వక వాతావరణం ఉండాలని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.

రోడ్డు ప్రమాదంలో 10 మంది దుర్మరణం

అహ్మదాబాద్: ఆగి ఉన్న వాహనాన్ని మినీ ట్రక్కు ఢీకొన్న ఘటనలో 10 మంది చనిపోగా మరో 13 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘోర ఘటన గుజరాత్‌లోని అహ్మదాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఖేడా జిల్లా కపడ్‌వంజ్ తాలూకాలోని ఓ గ్రామానికి చెందిన 23 మంది సురేంద్రనగర్ జిల్లా చోటిలాలో జరిగిన మతపరమైన కార్యక్రమానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారి వాహనం శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో బగోదర సమీపంలో రాజ్‌కోట్-అహ్మదాబాద్ హైవేపై రోడ్డు పక్క ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది. ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోగా మరో 13 మంది గాయపడినట్లు ఎస్పీ అమిత్ వాసవ తెలిపారు. ఘోర ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున సాయం ప్రకటించారు.

సీఎం గారూ రెగ్యులర్ చేయండి

- 16 ఏళ్లుగా పనిచేస్తున్నామంటూ సెకండ్ ఏఎన్ఎంల ఉత్తరాలు
- కొత్త నోటిఫికేషన్‌తో మా పరిస్థితి ఏంటంటూ ఆవేదన



నాగర్‌కర్నూల్ జిల్లాలో సీఎం కేసీఆర్‌కు ఉత్తరాలు పంపుతున్న సెకండ్ ఏఎన్ఎంలు

సాక్షి, నాగర్‌కర్నూల్: పదహారేళ్లుగా పనిచేస్తున్నామని, తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలంటూ సెకండ్ ఏఎన్ఎంలు పోస్టుకార్డులు రాసి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఏజ్ లిమిట్‌తో కొత్త నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు.

2007లో మంది 4025 మంది నియామకం

ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం 2007లో సెకండ్ ఏఎన్ఎంలను కాంట్రాక్టు పద్ధతిన నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,025 మంది సెకండ్ ఏఎన్ఎంలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాల అమలులో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. శిశువులు, గర్భిణులకు టీకాలు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్, పీహెచ్‌సీల్లో విధులు, ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీ తదితర విధులతోపాటు మొత్తం 40 వరకు జాతీయ కార్యక్రమాలు, 32 వరకు ఆన్‌లైన్ రిపోర్టుల అందజేత వంటి విధుల్లో పాలుపంచుకుంటున్నారు.

జీతమూ తక్కువే...: రెగ్యులర్ ఏఎన్ఎంలు నిర్వర్తించే అన్ని విధులు తాము నిర్వర్తిస్తున్నా జీతం మాత్రం రూ.25 వేలు ఉందని సెకండ్ ఏఎన్ఎంలు వాపోతున్నారు. అదనంగా టీఏ, డీఏలు సైతం ఇవ్వడం లేదని లేవని, 16 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకొని వృద్ధాప్యానికి చేరువవుతున్నా తమ ఉద్యోగాలకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్తగా 1,520 పోస్టులతో ఏఎన్ఎం భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఏళ్లుగా ఆశతో చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగాలకు ఎసరు పెట్టినట్లయ్యిందని సెకండ్ ఏఎన్ఎంలు ఆందోళన చెందుతున్నారు.

వయోపరిమితితో అనర్హత..

ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఏఎన్ఎం నోటిఫికేషన్‌లో ఇప్పటికే పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వందకు 20 పాయింట్లు వెయిటేజీ కల్పించింది. అయితే ఇందులో జనరల్ అభ్యర్థులకు గరిష్ఠంగా 45 ఏళ్ల వయోపరిమితి విధించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల మినహాయింపు కల్పించింది. కానీ, సెకండ్ ఏఎన్ఎంలలో చాలావరకు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు పైబడినవారే ఉన్నారు. ఏళ్లుగా చాలీచాలని జీతాలతో వైద్యసేవలు అందిస్తూ వృద్ధాప్య దశకు చేరుకుంటున్నా, ఉద్యోగ భద్రత కరువైందని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు.

వయసు పైబడుతోంది..



ప్రభుత్వపరంగా చేపట్టే అన్ని ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలకంగా పనిచేస్తున్నాం.16 ఏళ్ల సర్వీసుతో అందరి వయస్సు 45 ఏళ్లు దాటింది. ప్రభుత్వ నోటిఫికేషన్ రద్దు చేసి మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి.

– హైమవతి, సెకండ్ ఏఎన్ఎం, తాడూరు పీహెచ్‌సీ, నాగర్‌కర్నూల్ జిల్లా

మహిళలపై దాడి చేసినా పట్టించుకోరా?

- పట్టణ నడిబొడ్డున ఇద్దరు మహిళలపై దాడి
- కేసు నమోదు చేయకుండా నిందితులను వదిలేసిన పోలీసులు
- పని ఒత్తిడితోనే కేసు నమోదులో జాప్యం: ఎస్‌హెచ్‌వో
- బాధితులపై కూడా కేసు నమోదు చేసిన వైనం



ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎదుట పడిగాపులు కాస్తున్న మహిళలు

ఆర్మూర్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ నడి బొడ్డున టవర్ సర్కిల్‌లో ఇద్దరు మహిళలపై నలుగురు హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై పోలీసుల నిర్లక్ష్యం విమర్శలపాలవుతోంది. బాధితులు ఫిర్యాదుపై కనీసంగా పట్టించుకోకపోవడం, నలుగురు నిందితులను కనీసం విచారించకుండా వదిలేయడం వివాదాస్పదమవుతోంది. ఆర్మూర్ పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్‌పై నివాసం ఉండే శివరాత్రి అరుణ, వింజ శోభ వరసకు అక్కా చెల్లెళ్లు. వీరిద్దరూ ఇళ్లలో కూలీ పనులు ముగించుకుని నడుచుకుంటూ తమ ఇళ్లకు వెళ్తుండగా వారి సామాజిక వర్గానికే చెందిన సంపంగి రమేష్, సంపంగి గణేశ్, సంపంగి బబ్లు, సంపంగి నాగమణి రాళ్లతో దాడి చేశారు. పాత కక్షల నేపథ్యంలో జరిగిన దాడిలో అరుణ తల పగిలి రక్తం కారడంతో తల్లి యాదమ్మ సహాయంతో ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌కు పరిగెత్తుకొని వెళ్లారు. వెంటనే పోలీసులు బాధిత మహిళలిద్దరినీ చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించి ఘటనా స్థలానికి వెళ్లి దాడికి పాల్పడిన నలుగురిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. కానీ ఆ తర్వాత వారిని వదిలి వేయడంపైనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని తిరిగి పోలీస్ స్టేషన్‌కు బాధిత మహిళలు వచ్చినా పోలీసులు పట్టించుకోలేదు. గత రెండు రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోకపోగా.. ఇదే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఎస్సై ఏకంగా మీపైనే కేసు పెడతాం అంటూ తమనే బెదిరించారని బాధిత మహిళలు చెబుతున్నారు. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీస్ అంటూ ప్రచారం చేస్తుండగా ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో మాత్రం నిరుపేద మహిళలపై దాడి చేసిన వారిని కేసులు పెట్టడానికి కూడా పోలీసులు మీనమేషాలు లెక్కించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అలస్యంగా ఎఫ్ఐఆర్ ఎందుకంటే: సురేష్ బాబు, ఎస్‌హెచ్‌వో, ఆర్మూర్

''ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఇతర కేసుల ఒత్తిడిలో ఇద్దరు మహిళలపై దాడి చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఆలస్యం అయింది. దాడి చేసిన నలుగురిపై శుక్రవారం రాత్రి 324 సెక్షన్ కేసు నమోదు చేశాము. బాధిత మహిళలపై సైతం కౌంటర్ కేస్ ఫైల్ చేశాము.'

శభాష్.. శివకుమార్

- ఇంగ్లిష్ ఛానల్ ఈదిన దివ్యాంగుడు



కాచిగూడ: భారతదేశం తరఫున ఇంగ్లీష్ ఛానల్ ను రెండు వైపులా ఈదిన తొలి భారతీయుడుగా తాను గుర్తింపు పొందానని నగరానికి చెందిన దివ్యాంగ స్విమ్మర్ కుసునూర్ శివకుమార్ తెలిపారు. గత నెల 19న ఇంగ్లీష్ ఛానల్ ను 78 కిలోమీటర్లు రానుపోను 31 గంటల 29 నిమిషాల్లో ఈది సరికొత్త రికార్డు నెలకొల్పారు. శుక్రవారం కోచ్ దినేష్ రాజోరియాతో కలిసి కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను తెలంగాణ తరఫున తొలి స్విమ్మర్‌గా రికార్డు నెలకొల్పానని ఇప్పటికే స్విమ్మింగ్‌లో మూడు గోల్డ్ మెడల్స్ సాధించానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తే వచ్చే ప్యారా ఒలంపిక్, ఆసియన్ గేమ్స్, కామన్ వెల్త్ క్రీడల్లో పాల్గొని గోల్డ్‌మెడల్స్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఆయన చెప్పారు.

26 నుంచి పాతగుట్టలో పవిత్రోత్సవాలు



యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో గీతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. 27, 28వ తేదీల్లో పాతగుట్టలో శ్రీస్వామి వారి నిత్య, శాశ్వత కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవం, లక్ష పుష్పార్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం వంటి పూజలు రద్దు చేసినట్లు వెల్లడించారు. 29వ తేదీ నుంచి యథావిధిగా నిత్య కైంకర్యాలు కొనసాగుతాయన్నారు..

రూ.59కే రోజంతా ప్రయాణం

మెట్రో 'సూపర్ సేవర్ ఫ్రీడమ్ ఆఫర్'

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైల్ మరో బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రూ.59కే రోజంతా ప్రయాణం చేసే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం 'సూపర్ సేవర్ ఫ్రీడమ్ ఆఫర్' ప్రవేశపెట్టింది. ప్రయాణికులు రూ.59 చెల్లించి సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డ్‌ను రీచార్జ్ చేసుకోవచ్చు. ఈ కార్డు ద్వారా ఆగస్టు 12, 13, 15 తేదీల్లో అపరిమితమైన మెట్రో రైడ్‌లను ఎంజాయ్ చేయవచ్చు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రయాణికులు నగరంలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా మెట్రోలో ప్రయాణం చేసేందుకు ఈ అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎల్అండ్‌టీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్అండ్‌టీ మెట్రోరైల్ హైదరాబాద్ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల కోసం ఎంతో విలువైన ఆఫర్‌ను ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

పరువు పోయిందని.. ప్రాణం తీసుకుంది

ఓ ప్రేమోన్మాది దురాగతానికి బలి

- ప్రేమించకుంటే చంపేస్తానంటూ ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతికి బెదిరింపులు
- ఆపై అత్యాచార యత్నం
- మనస్తాపంతో గడ్డి మందు తాగిన డిగ్రీ విద్యార్థిని
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కనగల్: తనకు పెళ్లి కుదిరింది.. మరో తొమ్మిది రోజుల్లో నిశ్చితార్థం ఉందని చెప్పినా.. ఆ ప్రేమోన్మాది వినిపించుకోలేదు.. పైగా ఇంట్లో యువతి ఒంటరిగా ఉన్న సమయంలో వెళ్లి నన్నే ప్రేమించాలని ఒత్తిడి చేశాడు.. ఆపై శారీరకంగా కలవాలంటూ అత్యాచారయత్నం చేశాడు. బాధితురాలు కేకలు వేయడంతో పరారయ్యాడు. అయితే పరువు పోయిందని భావించిన ఆ యువతి గడ్డిమందు తాగి చివరకు ప్రాణాలు విడిచింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా.. నల్లగొండ జిల్లా కనగల్ మండలం లింగాలగూడెం గ్రామానికి చెందిన కదిరే శంకర్, మంగమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. చిన్న కూతురు మౌనిక(20) నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతోంది.

ప్రేమించాలని మూడు నెలలుగా వేధింపులు

నల్లగొండ మండల పరిధిలోని జి.చెన్నారం గ్రామానికి చెందిన బొల్లం శ్రవణ్ మూడు నెలల నుంచి మౌనికను ప్రేమించమని వెంటపడుతున్నాడు. ఆమె ఫోన్ నంబర్ తీసుకుని అసభ్యకరంగా మెసేజీలు పెడుతున్నాడు. ప్రేమించకపోతే చంపుతానంటూ బెదిరింపులకు దిగాడు. ఇదే క్రమంలో శ్రవణ్ ఈ నెల 9న మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో మౌనిక ఇంటికి చేరుకున్నాడు. ప్రేమించమని, శారీరకంగా కలవాలని చేయి పట్టుకోవడంతో మౌనిక కేకలు వేసింది. దీంతో శ్రవణ్ పారిపోతుండగా చుట్టు పక్కలవారు, తండ్రి శంకర్ గమనించి అతన్ని మందలించారు. ఈ ఘటనతో పరువు పోయిందని తీవ్ర మనస్తాపం చెందిన మౌనిక అదే రోజు సాయంత్రం గడ్డి మందు తాగింది. వాంతులు చేసుకుంటుండగా మౌనిక తమ్ముడు జాని గమనించి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్స పొందుతున్న మౌనిక శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు శ్రవణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

అభిషేక్ బెయిలు కేసులో ఈడీకి సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయిన అభిషేక్ బోయినపల్లి బెయిలు పిటిషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. బెయిలు కోరుతూ అభిషేక్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారించింది. మూడు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ఈడీని ఆదేశించిన ధర్మాసనం రిజాయిండర్ దాఖలుకు మరో రెండు వారాలు గడువిచ్చింది. తదుపరి విచారణను అక్టోబరుకు వాయిదా వేసింది.

దాహం తీర్చుకునేందుకు వెళ్లి..

- రైతును కాటేసిన మోటారు



బేగరి రాములు

పెద్దేముల్: దాహం తీర్చుకునేందుకు పక్క పొలంలోని బోరు మోటారు వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. మండలంలోని రుక్మాపూర్‌కు చెందిన బేగరి రాములు (54) గురువారం పొలంలో అరక పట్టడానికి వెళ్లాడు. దాహం వేయడంతో పక్క పొలంలోని బోరు వద్దకు వెళ్లాడు. అక్కడ బోరు మోటార్ స్టార్టర్ వద్ద విద్యుత్ తీగ తగిలి మృతి చెందాడు. మృతుని కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

గురునానక్ ఓకే, 'శ్రీనిధి' పేచీ

- అనుమతిలేని వర్సిటీల్లో 3 వేల మంది విద్యార్థులు
- తీసుకోవాల్సిన చర్యలపై సర్కార్‌కు ఉన్నత విద్యా మండలి సిఫార్సులు

సాక్షి, హైదరాబాద్: అనుమతులు లేని విశ్వవిద్యాలయాల్లో చేరిన విద్యార్థుల విషయంలో సానుకూల నిర్ణయాలు తీసుకునేందుకు ఉన్నత విద్యా మండలి సిద్ధమైంది. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను శుక్రవారం రూపొందించింది. దీన్ని సోమవారం ప్రభుత్వానికి పంపే అవకాశం ఉందని మండలి వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై నియమించిన అధికారులతో కూడిన కమిటీ గత రెండు రోజులుగా విస్తృత సంప్రదింపులు జరుపుతోంది. ప్రైవేటు వర్సిటీల బిల్లును అసెంబ్లీ ఆమోదించడం, ఇది గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండటం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వర్సిటీ హోదా కోసం దరఖాస్తు చేసిన గురునానక్, శ్రీనిధి సంస్థలు విద్యార్థులను చేర్చుకున్నాయి. గురునానక్ ఇంజనీరింగ్‌తో పాటు ఎంబీఏ, ఎంసీఏ, పారామెడికల్, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగించింది. శ్రీనిధి మాత్రం ఇంజనీరింగ్‌లోనే అడ్మిషన్లు తీసుకుంది. ఈ రెండు సంస్థల్లో దాదాపు 2,800 మంది విద్యార్థులు గతేడాది చేరారు. ఇందులో గురునానక్‌లో 2,500 మంది వరకూ ఉంటే, శ్రీనిధిలో 280 మంది ఉన్నారు.

శ్రీనిధి మడత పేచీ

కమిటీ జరిపిన చర్చల్లో శ్రీనిధి యాజమాన్యం వ్యవహారంపై ఇప్పటికీ స్పష్టత కన్పించడం లేదు. గతేడాది చేర్చుకున్న 280 మంది నష్టపోకుండా ఉండాలంటే, అనుమతి ఉన్న అదే కాలేజీలో వారిని చేర్చుకోవాలని కమిటీ సూచిస్తోంది. ఈ ఏడాది, వచ్చే సంవత్సరం యాజమాన్య కోటా సీట్లను వదులుకోవాలని చెబుతోంది. అనుమతి లేని కాలేజీలో చేర్చుకున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారిని గట్టెక్కించడానికి ఇది మార్గమని పేర్కొంటోంది. దీనికి శ్రీనిధి యాజమాన్యం అంగీకరించడం లేదు. గతేడాది అఖిల భారత సాంకేతిక విద్యా మండలి తమకు మంజూరు చేసిన 200 అదనపు సీట్లకు ప్రభుత్వం అనుమతిస్తే, కమిటీ ప్రతిపాదనకు సమ్మతిస్తామని శ్రీనిధి చెబుతోందని అధికారులు అంటున్నారు. ఇక గురునానక్ యాజమాన్యం మాత్రం అనుమతి ఉన్న తమ కాలేజీలో విద్యార్థులను చేర్చుకోవడానికి, తమ వద్ద లేని కోర్సులకు సంబంధించి ఇతర సంస్థలకు బదలాయించడానికి సమ్మతించింది.

ఓయూ, జేఎన్‌టీయూలో...

గురునానక్ వర్సిటీలో చేరిన ఇంజనీరింగ్ విద్యార్థులను అదే కాలేజీలో ప్రత్యేక బ్యాచ్ గా కొనసాగించాలని ఉన్నత విద్యామండలి భావిస్తోంది. ఆ కాలేజీ పరిధిలో లేని బయోటెక్నాలజీ విద్యార్థులను జేఎన్‌టీయూహెచ్‌కు బదలాయించి, అక్కడ ప్రత్యేక కోర్సుగా నిర్వహించాలని భావిస్తోంది. బీసీఏ, బీబీఏ, ఎంసీఏ, బీకాంలో చేరిన విద్యార్థులను ఓయూలో చేర్చి, వీరికి ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని నిర్ణయించింది. పారామెడికల్ కోర్సులు ఓయూ, జేఎన్‌టీయూలో లేకపోవడంతో ఆ విద్యార్థులను ఇతర ప్రైవేటు కాలేజీల్లో చేర్చాలని భావిస్తోంది. మల్లారెడ్డి, అనురాగ్ వర్సిటీల్లో చేర్చే ఆలోచన పరిశీలనలో ఉన్నా, వాటి నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని మండలి స్పష్టం చేస్తోంది. ఈ ప్రతిపాదనలన్నీ ప్రభుత్వానికి పంపుతున్నామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేస్తామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి వెల్లడించారు.

నిధులు మళ్లించి.. సొంతానికి వాడుకున్నారు

- వెంకట్రామిరెడ్డి రిమాండ్ తిరస్కరణపై హైకోర్టుకు ఈడీ

సాక్షి, హైదరాబాద్: దక్కన్ క్రానికల్ హోల్డింగ్ కంపెనీ లిమిటెడ్ పేరుతో రుణాలను తీసుకుని.. వెంకట్రామిరెడ్డి ఇతర అవసరాలకు మళ్లించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టులో వాదనలు వినిపించింది. పీఎంఎల్ఏ కేసులో అరెస్టయిన వెంకట్రామిరెడ్డి, పీకే అయ్యర్, మణిల రిమాండ్‌ను కిందికోర్టు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. ఎలాంటి కారణాలు లేకుండా తమను అక్రమంగా అరెస్టు చేశారని, దీనికి పరిహారం ఇప్పించాలని కోరుతూ వెంకట్రామిరెడ్డి మరో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ సుందరేషన్ వాదనలు వినిపించారు. బ్యాంకుల నుంచి రూ.9 వేల కోట్ల రుణాలు తీసుకుని అనుబంధ కంపెనీలతోపాటు తనకు చెందిన వ్యక్తుల ఖాతాల్లోకి వెంకట్రామిరెడ్డి మళ్లించారన్నారు. రూ.103 కోట్లు డివిడెండ్ చెల్లించలేదని చెప్పారు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు ఏడేళ్లుగా ఎందుకు అరెస్ట్ చేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు టి.నిరంజన్‌రెడ్డి, ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం అరెస్టుకు కారణాలను చూపాలని, సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసు ఇవ్వకుండా అరెస్టు చెల్లదన్నారు. అసలు కింద చెల్లించాల్సింది రూ.600 కోట్లు మాత్రమే ఉందని, అందుకోసం ఆస్తులను ఈడీ జప్తు చేసిందని, కంపెనీ దివాలా పరిష్కార ప్రక్రియ ఎన్‌సీఎల్‌టీలో కొనసాగుతోందని చెప్పారు. వాదనలను విన్న న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. విచారణను వారంరోజులకు వాయిదా వేశారు.

ఎంతమంది విడుదలయ్యారు?

- ఐఏఎస్ అధికారి కృష్ణయ్య హత్య కేసులో విడుదలకు సంబంధించిన రికార్డులు పిటిషనర్‌కు అందజేయండి
- బిహార్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో రెండు దశాబ్దాల క్రితం హత్యకు గురైన మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణయ్య హత్య కేసులో ఇప్పటివరకు ఎంతమంది విడుదలయ్యారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ కేసులో నిందితుడైన మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌ను విడుదల చేయడంపై కృష్ణయ్య భార్య ఉమ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్‌దత్తాల ధర్మాసనం విచారించింది. ఉమ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ...గత విచారణలో భాగంగా ఆనంద్‌మోహన్ విడుదలకు సంబంధించిన రికార్డులు అందజేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని, అయితే బిహార్ ప్రభుత్వం ఇప్పటి వరకు రికార్డులు సమర్పించలేదని వాదించారు. ధర్మాసనం జోక్యం చేసుకుని మీరెందుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోలేదని లూత్రాను ప్రశ్నించింది. రికార్డులు కావాలంటే ఆర్‌టీఐ ద్వారా తీసుకోవచ్చని, రహస్యం ఏమీ లేదని బిహార్ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ సమాధానమిచ్చారు. మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌ను విడుదల చేసిన సమయంలోనే 97 మందిని విడుదల చేశామని రంజిత్‌కుమార్ ధర్మాసనానికి తెలిపారు. ''ఓ ప్రభుత్వ అధికారి హత్య కేసులో 97 మందిపై అభియోగాలా! అందుకేనా అతడిని (ఆనంద మోహన్) విడుదల చేయడానికి పాలసీలో మార్పు చేశారు...''అని జస్టిస్ దీపాంకర్‌దత్తా ప్రశ్నించారు. పిటిషనర్ దరఖాస్తు చేసుకున్న తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రికార్డులు అందజేయాలని ధర్మాసనం ఆదేశించింది. అదనంగా మరో అఫిడవిట్ దాఖలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిస్తూ తదుపరి విచారణ సెప్టెంబరు 26కు వాయిదా వేసింది.

క్లుప్తంగా...

స్పీకర్ గారూ.. ఇప్పుడేం చేయాలి?

లోక్‌సభలో బండి వ్యాఖ్యలపై కేటీఆర్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: 'ప్రధాని నరేంద్రమోదీ ఇంటి పేరును అవమానించారనే సాకుతో కాంగ్రెస్ ఎంపీని లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించారు. కానీ, తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీ బండి సంజయ్.. రెండుసార్లు ప్రజాభిమానంతో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన కేసీఆర్‌ను లోక్‌సభలో అసభ్య పదజాలంతో దూషించారు. ఇప్పుడు మీరు లేదా మేము ఏం చేయాలి స్పీకర్ గారూ' అని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఉద్దేశించి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ శుక్రవారం ట్వీట్ చేశారు. ఉమ్మడి పాలమూరు–రంగారెడ్డి నీటిపారుదల ప్రాజెక్టుకు అనుమతులు లభించడంపైనా కేటీఆర్ స్పందించారు. 'అత్యంత పట్టుదలతో సీఎం కేసీఆర్ సాగించిన ప్రయత్నాలకు ఇప్పుడు ఫలితం వచ్చింది. దీంతో ఎంతోకాలంగా ఎదురుచూ స్తున్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు యుద్ధ ప్రాతిపదికన పూర్తి అవుతుంది' అని కేటీఆర్ పేర్కొన్నారు.

పాలమూరు కష్టాలు తీరినట్లే..



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ సుదీర్ఘ ప్రయత్నాలతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు లభించాయని, దీంతో పాలమూరు ప్రజల కష్టాలు తీరినట్లేనని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు రెండేళ్ల క్రితమే పూర్తయ్యేదని ఆయన పేర్కొన్నారు. కొందరు ఇంటి దొంగల కేసులు, పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు, మరో వైపు కేంద్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నీటిని సీఎం కేసీఆర్‌తో విడుదల చేయిస్తామని నిరంజన్‌రెడ్డి వెల్లడించారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే దిష్టిబొమ్మల దహనం



కొమురవెల్లి (సిద్దిపేట): ప్రభుత్వ పథకాలు పేదలకు అందకుండా తమ నాయకులే లబ్ధి పొందుతున్నారని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆరోపించారు. తమ నాయకుల తీరును నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటలో శుక్రవారం వారు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాల ఎంపికలో పేదలకు అన్యాయం చేసి పార్టీ నాయకులే కాజేస్తున్నారని అన్నారు.

ధరణి విషయంలో ప్రభుత్వాన్ని వదలం

బీఆర్‌ఎస్ నేతలను గ్రామాల్లో తిరగనివ్వం: కాంగ్రెస్ నేత కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ధరణి లోపాల విషయంలో ఈ ప్రభుత్వాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి స్పష్టం చేశారు. ధరణిపై న్యాయ పోరాటం చేస్తామని, ధరణిలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేంతవరకు బీఆర్‌ఎస్ నేతలను గ్రామాల్లో తిరగనివ్వబోమని ఆయన హెచ్చరించారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. భూరికార్డుల ప్రక్షాళన పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు.

న్యాయ పోరాటం చేస్తాం

బుద్వేల్‌లో దళితులకు భూసంస్కరణల కింద పంచిన 282 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ 100 ఎకరాలు వేలం వేసి రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించిందన్నారు. ఈ భూముల అమ్మకం చెల్లదని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ ధనిక రాష్ట్రమైన తెలంగాణలో అసైన్డ్ భూములను అమ్మాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కోకాపేట, బుద్వేల్‌లో భూములు కొన్నవారంతా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు బంధువులేనని ఆరోపించారు.

'బీఆర్‌ఎస్ పాలనలో దళితులపై నిత్యం దాడులే'

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో దళితులపై నిత్యం దాడులు జరుగుతున్నాయని బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్రఅధ్యక్షుడు కొప్పు భాష ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులకు పాల్పడుతున్న వారిలో అత్యధికులు బీఆర్‌ఎస్ నేతలే ఉన్నారని చెప్పారు. శుక్రవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చెన్నూరు నియోజకవర్గంలో దళితరైతు దుర్గం బాబును బీఆర్‌ఎస్ నేత కట్టేసి కొట్టిన ఘటన అత్యంత దారుణమని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ కనీసం స్పందించకపోగా, ఘటనకు పాల్పడిన వ్యక్తికే వంతపాడారని ఆరోపించారు.

విస్తృత భేటీలు.. ముమ్మర ప్రచారం

- రిజర్వ్‌డ్ నియోజకవర్గాలపై బీజేపీ ఫోకస్
- 28 నుంచి సెప్టెంబర్ 15 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



సమావేశంలో తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, ఈటల, జితేందర్‌రెడ్డి, డీకే అరుణ తదితరులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గెలుపు ఎత్తుగడల్లో భాగంగా బీజేపీ ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలపై దృష్టి పెట్టింది. రాష్ట్రంలో రిజర్వ్ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు సాధిస్తుందో ఆ పార్టీయే అధికారంలోకి వస్తుందనే ఉద్దేశంతో ఆ మేరకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించింది. రిజర్వ్‌డ్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించడంతోపాటు, ప్రతి నియోజకవర్గంలో ఆరేడు వేల మంది కార్యకర్తలతో కలిసి సమావేశాలు నిర్వహించనుంది. ఆయా భేటీల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని, సీఎం కేసీఆర్ దళితులకు, గిరిజనులకు చేస్తున్న అన్యాయంపై విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు చెందిన 31 అసెంబ్లీ స్థానాలకు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఇప్పటికే జాతీయ నాయకులు ఆయా నియోజకవర్గాల్లోని నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, నేతలు అరవింద్ మీనన్, తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ, ఏపీ జితేందర్‌రెడ్డి తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఇక ఒక్కో పోలింగ్ కేంద్రం నుంచి 20 నుంచి 30 మంది కార్యకర్తలతో బూత్ స్థాయి సమావేశాలు కూడా నిర్వహించనున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ దళితులకు ఇచ్చిన హామీలను ఏవిధంగా తుంగలో తొక్కిందన్న అంశాలను వివరించడంతోపాటు, కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు, అదే విధంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు / గిరిజనులకు అమలు అవుతున్న పథకాల గురించి వివరించేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన పలు పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా నీరుగార్చిందనే విషయాన్ని కూడా వివరిస్తామని బీజేపీ ముఖ్య నాయకుడు ఒకరు వివరించారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లలో దళితులు, గిరిజనులను ఓట్లు వేయించుకోవడానికి వాడుకోవడం తప్ప.. వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించని విషయాన్ని కూడా వివరిస్తామని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్న అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తామని వివరించారు.

పార్టీ నేతలతో జవదేకర్ భేటీ

తెలంగాణలో పార్టీని మరింత పటిష్టం చేయడంతో పాటు, ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విజయం సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రకాష్ జవదేకర్ శుక్రవారం మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డితో పాటు ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు నేతలతో సమావేశమయ్యారు. పార్టీ పటిష్టత, లోపాలకు సంబంధించి అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ కూడా ఇచ్చినట్లు సమాచారం. ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేరికలు, ఇతర అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది.

సం'క్షేమం'గా ఎన్నికలకు

▶ మొదటి పేజీ తరువాయి

అమలు చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఇప్పటివరకు సంక్షేమ పథకాలు అందని వర్గాలను వెతికి మరీ వారి కోసం ప్రకటించాల్సిన తాయిలాలపై కసరత్తు జరుగుతోందని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. సామాజిక పింఛన్లు మరో రూ.1,000 పెంపు, గిరిజనబంధు వంటి అస్త్రాలను చివరి నిమిషంలో ప్రయోగించే సూచనలు కనిపిస్తున్నాయి. దళితబంధు, బీసీ, మైనారిటీల ఆర్థిక సాయం, గృహలక్ష్మి వంటి పథకాలను ఎన్నికల తర్వాత మరింత పకడ్బందీగా విస్తృత స్థాయిలో అమలు చేస్తామని మేనిఫెస్టోలో భరోసా ఇవ్వనున్నారు. రైతులు, పేదలు, కులవృత్తులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ప్రభుత్వ ఉద్యోగులు లక్ష్యంగా ఇప్పటికే పలు సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఓటరూ ప్రభుత్వ పథకం లబ్ధిదారుడే అనే లెక్కలతో వారి ఓట్లను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా మలుచుకోవడానికి ప్రాధాన్యతనిస్తున్నారు.

అన్ని విధాలుగా సన్నాహాలు

రైతురుణ మాఫీ ప్రకటనతో విపక్షాల స్పీడ్‌కు అడ్డుకట్ట వేసిన కేసీఆర్.. వారికి మరే ఇతర ఎన్నికల ప్రచార అస్త్రాలు దొరక్కుండా చేయాలని భావిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ మేనిఫెస్టోలో చేర్చేందుకు అవకాశమున్న పథకాలు, ఆ పార్టీలు ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించే అంశాలపైనా దృష్టి పెట్టారు. ఆ పార్టీల ఎత్తుగడలను ఎన్నికల మేనిఫెస్టో, ప్రచార పర్వంలో తిప్పికొట్టేందుకు వీలుగా అవసరమైన అస్త్రాలను కూడా సిద్ధం చేసుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, కుటుంబ పాలన, ప్రాజెక్టుల్లో అవినీతి, తొమ్మిదేళ్లలో పాలన వైఫల్యం వంటి అంశాలను విపక్షాలు ప్రధానంగా ఎత్తి చూపుతాయని బీఆర్‌ఎస్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన ఎత్తుగడలపై కేసీఆర్ వ్యూహరచన చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు గెలుపు గుర్రాలకే ప్రాధాన్యతనిస్తూ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కూడా వేగంగా నిర్వహిస్తున్నారు. అనేక స్థానాల్లో నేతల వారసులు, కొత్త అభ్యర్థులు, పార్టీలో అసంతృప్తులు, ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్సీ వంటి అధికారిక పదవుల్లోఉన్న వారు టికెట్లు ఆశిస్తున్న నేపథ్యంలో సిట్టింగుల వైపు కేసీఆర్ మొగ్గు చూపుతున్నారు. సుమారు 13 నుంచి 15 మంది సిట్టింగులకు టికెట్లు దక్కే సూచనలు కనిపించడం లేదని బీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు. కాగా 2018 ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్‌లోకి వచ్చిన సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇచ్చేందుకు కేసీఆర్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు విపక్షాలను కకావికలం చేసే వ్యూహంలో భాగంగా కాంగ్రెస్, బీజేపీ నుంచి ఒకరిద్దరు బలమైన నేతలను కూడా పార్టీలో చేర్చుకునే సంకేతాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌కు చెందిన ఓ ముఖ్య నేత కీలక సమయంలో పార్టీని వీడి వస్తారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

కాంగ్రెస్ ప్రచార నగారా!

- బీఆర్‌ఎస్ సర్కారు వైఫల్యాలపై ప్రజల్లోకి ప్రధాన ప్రతిపక్షం
- రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న కాంగ్రెస్ నేతలు
- బోయిన్‌పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్ వేదికగా నేడు షెడ్యూల్ ప్రకటన




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార నగారా మోగించబోతోంది. అసెంబ్లీ ఎన్నికల కోసం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలతోపాటు తాము అధికారంలోకి వస్తే ఆయా వర్గాలకు చేసే మేలు గురించి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఉన్న గాంధీ ఐడియాలజీ సెంటర్ వేదికగా ప్రచార షెడ్యూల్‌ను ప్రకటించనుంది. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఏఐసీసీ కార్యదర్శులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

గడప గడపకూ చేరేలా..

ఈసారి ఎలాగైనా అధికార పీఠం దక్కించుకోవాలన్న ఆశతో ముందుకెళుతున్న కాంగ్రెస్ 100 రోజుల ప్రచార కార్యక్రమాన్ని ప్రకటించనుంది. బీఆర్‌ఎస్ సర్కారు తొమ్మిదేళ్ల పాలనలో చేయలేని పనులను ఎత్తిచూపుతూ కరపత్రాలు ప్రచురించి, వాటిని రాష్ట్రంలోని గడపకూ చేర్చి ఓటర్లను చైతన్యవంతులను చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని శనివారం ప్రకటించనుంది. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కార్నర్ మీటింగ్‌లకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. గతంలో ప్రతిపాదించిన విధంగా సీనియర్ నేతల బస్సుయాత్ర షెడ్యూల్‌ను కూడా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇక సెప్టెంబర్ 17న ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించనున్న కాంగ్రెస్ పార్టీ ఆ మేనిఫెస్టో కోసం ఇప్పటికే ప్రకటించిన కొన్ని ప్రధానాంశాలతో పోస్టర్లు రూపొందించి రాష్ట్రమంతటా వేయాలనే ఆలోచనలో ఉంది. మొత్తమ్మీద కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి అవసరమైన అన్ని అంశాలనూ ప్రస్తావిస్తూ శనివారం నాటి షెడ్యూల్ ప్రకటన ఉంటుందని టీపీసీసీ నేతలు చెప్తున్నారు. దీనిపై టీపీసీసీ సీనియర్ నేత మల్లురవి 'సాక్షి'తో మాట్లాడారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు కాంగ్రెస్ ఏమేం చేస్తుందన్నది ప్రజలకు వివరిస్తామని.. ఇందులో భాగంగా ఎన్నికల ప్రచారాన్ని శనివారం ప్రారంభించనున్నామని వెల్లడించారు. షెడ్యూల్ ప్రకటన అనంతరం కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు.

శ్రీశైలంలో విద్యుదుత్పత్తి ఆపండి

జెన్‌కోకు కృష్ణాబోర్డు సూచన



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో తక్షణమే విద్యుదుత్పత్తి నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కృష్ణాబోర్డు ఆదేశించింది. బోర్డు జారీ చేసే నీటి కేటాయింపుల ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని సూచించింది. ఈ మేరకు కృష్ణాబోర్డు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో)కు లేఖ రాసింది. నీటి అవసరాల కోసం తెలంగాణకు ఇంకా ఎలాంటి ఇండెంట్ ఇవ్వలేదని గుర్తు చేసింది. సాగర్‌కు నీటి విడుదల కోరుతూ ఇండెంట్ ఇస్తేనే శ్రీశైలంలో జలవిద్యుదుత్పత్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ప్రస్తుతం కృష్ణానది పరీవాహక ప్రాంతంలో తీవ్ర వర్షాభావం నెలకొని ఉన్న నేపథ్యంలో, వార్షిక సగటు వర్షపాతం కన్నా తక్కువగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అభిప్రాయపడింది. ప్రస్తుతం జలాశయాలు పూర్తిగా నిండకపోవచ్చని, ఈ నేపథ్యంలో నీటిని సంరక్షించాల్సిన అవసరముందని చెప్పింది.

కృష్ణా బోర్డుకు సంబంధం లేదు

సాగర్‌కు నీటి విడుదల కోరుతూ ఇండెంట్ ఇస్తేనే శ్రీశైలంలో జలవిద్యుదుత్పత్తి జరపాలని కృష్ణా బోర్డు కోరడం పట్ల తెలంగాణ నీటిపారుదలశాఖ వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. సాగర్‌కు నీటి విడుదల కోసమే శ్రీశైలం జలాశయం నిర్మించాలని ప్రణాళిక సంఘం అనుమతిచ్చిందని, శ్రీశైలం నిండిన తర్వాతే సాగర్‌కు నీటిని విడుదల చేయాలని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేస్తున్నాయి. పూర్తిగా జలవిద్యుదుత్పత్తి అవసరాల కోసమే శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించారని గుర్తు చేస్తున్నాయి. ఈ విషయంలో కృష్ణాబోర్డు తన పరిధిని దాటి వ్యవహరించిందని, జలవిద్యుదుత్పత్తి బోర్డు పరిధిలోకి రాదని స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు నీటిపారుదలశాఖ త్వరలో కృష్ణా బోర్డుకు లేఖ రాయనున్నట్టు తెలిసింది.

జల విద్యుదుత్పత్తి కొనసాగుతుంది

ప్రస్తుతం వర్షాభావం నెలకొని ఉండడంతో రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్‌కు డిమాండ్ భారీ పెరిగింది. విద్యుత్ డిమాండ్ గరిష్ట స్థాయికి చేరినప్పుడు లోటును పూడ్చుకోవడానికి మాత్రమే శ్రీశైలం జలాశయంలో విద్యుదుత్పత్తి చేస్తున్నామని జెన్‌కో ఉన్నతస్థాయి వర్గాలు పేర్కొన్నాయి. నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ కొరత నెలకొన్న సమయంలో జలవిద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తామని స్పష్టం చేశాయి.

21న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ

- కృష్ణాజలాల కేటాయింపులపై జరగనున్న చర్చ
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు తెలియజేసిన బోర్డు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఏపీ, తెలంగాణకు నీటి కేటాయింపులపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి ఈ నెల 21న ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని కృష్ణాబోర్డు నిర్ణయం తీసుకుంది. కృష్ణా బోర్డు సభ్యకార్యదర్శి నేతృత్వంలోని ఈ త్రిసభ్య కమిటీలో ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల ఈఎన్సీలు సభ్యులుగా ఉన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి ఆగస్టులో తాగు, సాగునీటి అవసరాల కోసం 16 టీఎంసీలను కేటాయించాలని ఇటీవల ఏపీ కోరిన నేపథ్యంలో దీనిపై తెలంగాణ అభిప్రాయాన్ని తెలియజేయాలని కృష్ణా బోర్డు సూచించింది. ఆగస్టు, సెప్టెంబర్‌లో తెలంగాణ, ఏపీలకు అవసరమైన నీటి కేటాయింపుల కోసం 17వ తేదీలోగా ఇండెంట్ సమర్పించాలని రెండు రాష్ట్రాలను కోరింది. ఆగస్టు 16 నాటికి వినియోగించిన కృష్ణా జలాల వివరాలను సైతం అందించాలని పేర్కొంది.

త్వరలో గోదావరి బోర్డు సమావేశం

త్వరలో గోదావరి నదీయాజమాన్య బోర్డు సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ నెల 18లోగా ఎజెండాలో చర్చించాల్సిన అంశాలను సూచించాలని కోరుతూ తాజాగా గోదావరి బోర్డు ఏపీ, తెలంగాణలకు లేఖలు రాసింది. గోదావరిలో మిగులు జలాల లభ్యతలేదని ఇటీవల కేంద్ర జల సంఘం సమర్పించిన నివేదికతోపాటు తెలంగాణకు సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టుల డీపీఆర్‌లపై ఈ భేటీలో చర్చించే అవకాశం ఉంది.

కాంగ్రెస్ కూటమి ఒక దోపిడీ ముఠా

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ కూటమి ఒక దోపిడీ ముఠా అని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. పార్లమెంటులో ప్రజాసమస్యలు చర్చకు రాకుండా విపక్షాలు వ్యవహరించాయని, మణిపూర్ అంశంపై చర్చలు జరపాలని కాంగ్రెస్ గొడవ చేస్తుంటే బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిన విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు కాంగ్రెస్‌కు తోకపార్టీల్లా వ్యవహరిస్తున్నాయని ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమని, ప్రజాక్షేత్రంలోనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలకు బుద్ధి చెప్తామని హెచ్చరించారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాలు పొందడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ప్రధాని సమాధానం కోసం పట్టుబట్టిన విపక్షాల నేతలు ఆయన మాట్లాడుతుంటే లోక్‌సభ నుంచి ఎందుకు పారిపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు.

యోధుల త్యాగాలను స్మరించేలా విగ్రహాలు

ఎంఐఎం పార్టీ ఒత్తిడికి లోబడి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు బత్తిని మొగిలయ్య గౌడ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర మరుగున పడేలా చేశాయని డాక్టర్ లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నెహ్రూ, తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబాలవే చరిత్ర అన్నట్లు ఈ రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. గురువారం ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో బీజేపీ నాయకుడు తూళ్ల వీరేందర్ గౌడ్ నేతృత్వంలో జరిగిన బత్తిని మొగిలయ్యగౌడ్ వర్ధంతి సభలో కేంద్ర పర్యాటక శాఖ సహాయమంత్రి శ్రీపాద్ నాయక్, ఎంపీ లక్ష్మణ్ పాల్గొని ప్రసంగించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఇలాంటి యోధుల విగ్రహాలు పెట్టడమేకాకుండా, వారి త్యాగాలను స్మరిస్తూ కుటుంబాలకు న్యాయం చేస్తామన్నారు. రజాకార్ల పోకడలను కళ్లకు కట్టేలా సినిమా తీస్తున్న రజాకర్ సినిమా బృందాన్ని ఎంపీ లక్ష్మణ్ అభినందించారు.

పార్లమెంట్ సాక్షిగా అబద్ధాలా?: హరీశ్

'కాళేశ్వరం'పై బీజేపీ నేతల తీరు సిగ్గుచేటని వ్యాఖ్య



గజ్వేల్‌లో బీసీ బంధు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.85 వేల కోట్లు కేంద్రం ఇచ్చిందని పట్టపగలు పార్లమెంట్ సాక్షిగా బీజేపీ అబద్ధాలాడటం సిగ్గుచేటని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీసీబంధు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ తర్వాత మరో ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంత్రి సమక్షంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకోవడానికి కేసులు వేస్తే, బీజేపీ దానికి ఒక్క రూపాయి ఇవ్వకున్నా రూ.85 వేల కోట్లు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను ఈ రెండు పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. ఈ రాష్ట్రంలో బీజేపీకి బలం లేకపోగా, కాంగ్రెస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని ఎద్దేవా చేశారు. రూ.20 వేల కోట్ల రుణమాఫీని నెల రోజుల్లోనే పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజారంజక పాలన తో వరుసగా మూడోసారి కూడా అధికారంలోకి వచ్చి సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు.

వీచేదంతా కాంగ్రెస్ గాలే

- కేంద్రం, రాష్ట్రంలో హస్తందే విజయం
- టికెట్ ఎవరికి ఇచ్చినా అందరూ కష్టపడాలి: పొంగులేటి



సాక్షి, మహబూబాబాద్: 'ప్రస్తుత పాలకులపై ప్రజలకు నమ్మకం పోయింది. దేశవ్యాప్తంగా వీచేదంతా కాంగ్రెస్ గాలే.. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం' అని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో–చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల గోస చూడలేక కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టారని, లేకపోతే ప్రత్యేక తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. తెలంగాణ వస్తే కాపలా కుక్కలా ఉంటానని చెప్పిన కేసీఆర్, ఇప్పుడు ఏం చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. తన మాటల మంత్రంతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారని, ఇచ్చిన హామీలు విస్మరించి ఇప్పుడు కొత్త హామీలతో మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నారని అన్నారు. స్వరాష్ట్ర సాధన కల నిజం చేసిన సోనియా గాంధీ రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ నాయకులు, కేడర్ కూడా విజయమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎవరికి టికెట్ వచ్చినా.. ఎవరికి రాకపోయినా.. చేతిగుర్తు ను గెలిపించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, అదే స్ఫూర్తితో మానుకోట జిల్లాలో అన్ని స్థానాలు కాంగ్రెస్ పార్టీ ఖాతాలో జమచేయాలన్నారు. ఇందుకోసం తనతోపాటు, సీనియర్ నాయకులు రాంసహాయం సురేందర్‌రెడ్డి సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఆదివాసీ విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్, మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాక్షసత్వానికి ప్రతీక చంద్రబాబు పాలన

మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య



నాంపల్లి (హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన రాక్షసత్వానికి ప్రతీకని, ఆయన పాలనంతా దాడులు దౌర్జన్యాలతోనే సాగి ఎంతోమందిని పొట్టన పెట్టుకుందని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య విమర్శించారు. 1997, ఆగస్టు 11న దాదాపు 5 లక్షల మంది కార్యకర్తలు సచివాలయాన్ని ముట్టడించిన సందర్భంగా పోలీసులు జరిపిన లాఠీచార్జ్‌లో మృతి చెందిన మాలల సంస్మరణ సభను శుక్రవారం ఏసీ గార్డ్స్‌లోని యేటూరి టవర్స్‌లో నిర్వహించారు. ఈ సభకు జేఏసీ చైర్మన్ చెన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత మాలమహానాడు వ్యవ స్థాపక అధ్యక్షుడు పీవీ రావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చంద్రబాబు ప్రజలను విభజించి పాలించే రీతిలో ఎస్సీ రిజర్వేషన్ ఆర్డినెన్స్‌ను 1997లో తీసుకువచ్చారని, దీనికి నిరసనగా చేపట్టిన సచివాలయ ముట్టడి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షలమంది పాల్గొన్నారని గుర్తు చేశారు. చంద్రబాబు ఆదేశానుసారం ఈ ముట్టడిలో పాల్గొన్న మాలలపై పోలీసులు లాఠీచార్జి చేసి గుర్రాలతో తొక్కించారని మండిపడ్డారు. ఈ దాడిలో పాణంగి శేషయ్య, రెడ్డి సత్యనారాయణ, టి.నారాయణ, సుదర్శన్ వంటివారు చనిపోగా, వందలాదిమంది గాయపడి వికలాంగులైనట్లు వివరించారు. ఇది చరిత్రలో చీకటిరోజుగా అభివర్ణించారు. ఎస్సీల వర్గీకరణను అడ్డుకుంటామని చెన్నయ్య తెలిపారు.

సాగర్‌లోని నిల్వలు మావే!

- ఈ ఏడాది కోసం గతేడాది వాడుకోకుండా పొదుపు చేశాం
- సాగర్ పూర్తిగా నిండే వరకు 'క్యారీ ఓవర్' వాడుకోవచ్చు
- కుడి కాల్వ తాగునీటి అవసరాలు 2.84 టీఎంసీలే.. ఏపీ 5 టీఎంసీలు అడగడం సరికాదు
- కృష్ణా బోర్డుకు లేఖ రాసిన తెలంగాణ రాష్ట్రం

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత నీటి సంవత్సరంలో ఇప్పటి వరకు నాగార్జునసాగర్ జలాశయానికి ఎలాంటి ప్రవాహం రాలేదని, గతేడాది తాము వాడుకోకుండా పొదుపు చేసిన 18 టీఎంసీల నీళ్లే ప్రస్తుతం జలాశయంలో మిగిలి ఉన్నాయని తెలంగాణ రాష్ట్రం స్పష్టం చేసింది. ఈ నీళ్లను వినియోగంపై తమకే హక్కు ఉందని పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి. మురళీధర్ గురువారం కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు.

పొదుపు చేసిన జలాలు మావే..

కొత్త నీటి సంవత్సరం ప్రారంభమైన తర్వాత జలాశయంలో అప్పటికే మిగిలి ఉండే నిల్వల్లో కొత్త ప్రవాహం వచ్చి కలిసిపోతుందని, ఈ నేపథ్యంలో గతేడాది పొదుపు చేసిన జలాలను మరుసటి ఏడాది సంబంధిత రాష్ట్రానికి కేటాయించాలంటే(క్యారీ ఓవర్).. రెండు రాష్ట్రాల సమ్మతి అవసరమని గత కృష్ణా బోర్డు సమావేశంలో చైర్మన్ పేర్కొన్న విషయాన్ని తెలంగాణ గుర్తు చేసింది. వాస్తవానికి ప్రస్తుత ఏడాది జలాశయం పూర్తిగా నిండి గేట్లను ఎత్తే నాటి వరకు గతేడాది తాము పొదుపు చేసిన 18 టీఎంసీలను వాడుకోవచ్చని, దీని ద్వారా పొరుగు రాష్ట్ర హక్కులకు ఎలాంటి భంగం కలగదని తెలియజేసింది. కృష్ణా జలాలను నిల్వ చేసుకోవడానికి తమకు ప్రత్యేకంగా ఆఫ్‌లైన్ జలాశయాలు లేకపోవడంతో 2023–24కి సంబంధించిన తాగు, సాగునీటి అవసరాల కోసం ఉమ్మడి జలాశయం సాగర్‌లోనే నిల్వ చేసుకోవాల్సి వచ్చిందని తెలియజేసింది. గతేడాది ఏపీ తమ వాటాకు మించి 51.745 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించిందని ఆరోపించింది.

సాగర్ కుడి కాల్వ తాగునీటి అవసరాలు 2.84 టీఎంసీలే

కృష్ణా ట్రిబ్యునల్–2కు గతంలో సమర్పించిన వివిధ ప్రాజెక్టు నివేదికల ప్రకారం సాగర్ కుడి కాల్వ కింద వార్షిక తాగునీటి అవసరాలు 2.84 టీఎంసీలు మాత్రమేనని కాగా, గత జూలై నెల తాగునీటి అవసరాల కోసం నుంచి 5 టీఎంసీల నీళ్లను కేటాయించాలని ఏపీ కోరడం పట్ల లేఖలో తెలంగాణ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. కృష్ణా బోర్డు 17వ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశాన్ని కేంద్ర జలశక్తి శాఖకు రెఫర్ చేయాలని తెలంగాణ రాష్ట్రం మరోసారి కోరింది.



సమర్థవంతంగా ఎన్నికలు

వచ్చే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని.. ఎన్నికలపై అన్నివిభాగాల వారికి పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ గోపి సూచించారు. 10లో▸



సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించి నివేదిక అందించాలని సీపీ సుబ్బారాయుడు ఆదేశించారు. కమిషనరేట్‌లో అధికారులతో సమీక్షించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం 36.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.



పంద్రాగస్టు ఏర్పాట్లు అలా..

పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి ఆదేశించారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను ఆయన సందర్శించారు. ముఖ్యఅతిథులు, ప్రముఖుల స్వాగతం, పోలీసుల పరేడ్, శకటాల ప్రదర్శనలపై ఆరాతీశారు. సీపీ సుబ్బారాయుడు ఏర్పాట్లు చేస్తున్న తీరు వివరించారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, డీసీపీలు లక్ష్మీనారాయణ, రాజు, భీంరావు తదితరులు ఉన్నారు. – కరీంనగర్ అర్బన్



వరద బాధితుల రక్షణ ఇలా..

కరీంనగర్ మానేర్ డ్యామ్‌లో శుక్రవారం అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వర్షాలు.. వరదలు వచ్చినప్పుడు ఆపదలో చిక్కుకున్న బాధితులకు ఏ విధంగా సహాయ సహకారాలు అందించాలో అధికారులు బోట్‌లో ప్రయాణిస్తూ వివరించారు. సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్‌కు అగ్నిమాపక అధికారులు ప్రభాకర్, పరమేశ్వర్, సిబ్బంది తదితరులు హాజరయ్యారు. – కరీంనగర్ క్రైం



రోడ్డు వేయకుంటే ఎలా?

కంకర రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని మానకొండూర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రోడ్డుపై వెళ్తున్న సుమారు 40 ఇసుక లారీలను అడ్డుకున్నారు. బీటీ రోడ్డు వేస్తామని అధికారులు హామీ ఇచ్చే వరకూ వెళ్లనీయమని స్పష్టం చేశారు. వీణవంక మండలం నుంచి వచ్చే ఇసుక లారీలతో కంకర రాళ్లు ఎగిరిపడి గాయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగించారు.– మానకొండూర్

న్యూస్‌రీల్

ఆనందం.. అంతలో విషాదం

- ఫ్రెషర్స్ డేలో డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిన విద్యార్థిని
- గంగాధర మోడల్ స్కూల్‌లో ఘటన



ప్రదీప్తి (ఫైల్)

గంగాధర(చొప్పదండి): డీజే పాటలు.. స్నేహితులతో డ్యాన్సులు.. చుట్టూ కేరింతలు.. ఆనందంతో ఆడిపాడుతున్న ఓ బాలిక ఒక్కసారిగా కుప్పకూలింది. అధ్యాపకులు ఆస్పత్రికి తరలిస్తుండగా.. గుండెపోటుతో మరణించింది. గంగాధర మండలం కొండన్నపల్లి శివారులోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో విషాదం నెలకొంది. శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకల్లో డ్యాన్స్ చేస్తూ విద్యార్థిని గుండు ప్రదీప్తి(16) గుండెపోటుతో మృతి చెందింది. గంగాధర మండలంలోని వెంకటాయిపల్లి గ్రామానికి చెందిన గుండు అంజయ్య–శారదల కూతురు ప్రదీప్తి ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. శుక్రవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకల సందర్భంగా డ్యాన్స్ చేస్తూ.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ కుప్పకూలింది. ఉపాధ్యాయులు వెంటనే సీపీఆర్ చేస్తూ.. గంగాధర ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలిస్తుండగా.. మార్గంమధ్యలో చనిపోయింది. ప్రదీప్తి చిన్నప్పుడే గుండెకు రంధ్రం ఉండగా.. మందులు వాడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రాజు

కరీంనగర్‌క్రైం: ప్రజల ఫిర్యాదులపై సత్వరం స్పందించి, వేగంగా విచారణ జరిపాలని కరీంనగర్ అడిషనల్ డీసీపీ(పరిపాలన) సి.రాజు అన్నారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు చెందిన పరిపాలన అధికారులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం కమిషనరేట్ కేంద్రంలో నిర్వహించారు. అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. వివిధ రకాల సమస్యలతో పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజలతో కనీస మర్యాదతో మెదలాలని సూచించారు. డయల్ 100 ఫిర్యాదులపై తీవ్రతను బట్టి స్పందించి, చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ బృందాలు ఫిర్యాదు అందినవెంటనే నిర్దేశిత సమయంలోపు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక సమాచారం సేకరించడంతోపాటు సత్వరం సేవలందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం పోలీస్‌శాఖలో ఆధునికసాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరిగిందని, ప్రతీ అధికారి శ్రద్ధతో పట్టుసాధించాలని పిలుపునిచ్చారు. ఏసీపీ పి.కాశయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఒ.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ బకాయిలు రూ.20.78 కోట్లు

- ఇబ్బందుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- ఎనిమిది నెలలుగా బిల్లులకు మోక్షం లేదు
- నిలిచిపోయిన జీపీఎఫ్, ఫైనల్ పేమెంట్లు, పార్టు ఫైనల్ లోన్లు, అడ్వాన్సులు
- ఉమ్మడి జిల్లాలో వందల మంది ప్రభుత్వ ఉద్యోగుల వెతలు



‘గంగాధరలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు గతేడాది అక్టోబర్‌లో తన జీపీఎఫ్ నుంచి అవసరం నిమిత్తం లోన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. తనకు రావాల్సిన బకాయిలు అందించాలని ఎన్నోసార్లు జిల్లా పరిషత్ జీపీఎఫ్ విభాగంలో ధ్రువపత్రాలు అందించాడు. పదినెలలు గడుస్తున్నా డబ్బులు రాలేదు. జిల్లా పరిషత్ కార్యాలయం చుట్టూ ఆ ఉపాధ్యాయుడు తిరుగుతూనే ఉన్నాడు’.

.. ఇలా పది నెలలుగా లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఎందరో జీపీఎఫ్ కోసం ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ రకాల లోన్లకోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల ఇబ్బందులు పడుతున్నారు.

కరీంనగర్:

ఉమ్మడి జిల్లా పరిధిలోని పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, వరంగల్ అర్బన్, భూపాలపల్లి జిల్లాలోని 71 మండలాల్లో 12వేల మందికిపైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్) విభాగం నుంచి ఉద్యోగ విరమణ పొందిన సమయంలో వీరి పెన్షన్ డబ్బులతో పాటు ఇతరత్రా సదుపాయాలు పొందే వీలుంటుంది. ఉపాధ్యాయులు వారి సర్వీసును బట్టి దాచుకున్న డబ్బులు ఇల్లు రిపేర్లు, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఆరోగ్యరీత్యా ఎదురయ్యే సమస్యలకు జీపీఎఫ్ విభాగం నుంచి పొందే వీలుంది. కానీ ఇందుకు భిన్నంగా జిల్లా పరిషత్ అధికారులు వ్యవహరిస్తుండడంతో వేలాది మంది జెడ్పీలోని జీపీఎఫ్ విభాగం చుట్టూ తిరగాల్సి వస్తోంది.

ధర్నా చేసినా.. ఫిర్యాదు ఇచ్చినా..

జిల్లా పరిషత్ జీపీఎఫ్ విభాగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో అనేక సందర్భాల్లో ధర్నాలు నిర్వహించి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు, జిల్లా మంత్రులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా జెడ్పీ అధికారుల్లో మార్పు రాలేదు. ఈ విద్యా సంవత్సరం కూడా ఉపాధ్యాయులు తాము దాచుకున్న డబ్బుల కోసం పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. క్షేత్రస్థాయిలో జీపీఎఫ్ విభాగంలో ప్రతిఏటా ఇదే తంతు జరుగుతోందని పలువురు ఉపాధ్యాయులు తమ మనోభావాల్ని వెలిబుచ్చుతున్నారు. జిల్లాలు వేరై, జీపీఎఫ్ విభాగాలు వేరైనా ఇంత వరకు ఉమ్మడి జిల్లా కేంద్రంగానే మంజూరైన చెక్కులు డీటీవో కార్యాలయంలో పేరుకుపోయాయని, తక్షణమే పెండింగ్ చెక్కులు క్లియర్ చేసి బకాయిలు చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.

బకాయిలు ఇలా...



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు (ఫైల్)

ఉమ్మడి జిల్లా పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన వారు, ఆరోగ్య రీత్యా అవసరాల లోన్‌కోసం దరఖాస్తు చేసుకున్న వారు, ఇళ్ల నిర్మాణం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం జీపీఎఫ్ విభాగానికి దరఖాస్తు చేసుకున్న వారి బకాయిలు రూ.20.78కోట్ల పైబడి ఉంటుందని లెక్కలు చెబుతున్నాయి. పార్ట్‌ఫైనల్, అడ్వాన్సులకు సంబంధించి రూ.8కోట్ల పైబడి బకాయిలు రావాల్సి ఉంది. లోన్ అడ్వాన్సులు రూ.7లక్షలపైబడి రావాల్సి ఉంది. మరో 200 మందికిపైగా ఉపాధ్యాయులు అడ్వాన్సు, పార్ట్ పేమెంట్ లోన్లకై దరఖాస్తులు చేసుకున్నారు. బిల్లుల ఆలస్యంపై జెడ్పీ జీపీఎఫ్ విభాగంతో పాటు డీటీవో కార్యాలయంలో సంప్రదించగా బిల్లులు యథావిధిగా ప్రభుత్వానికి నివేదిస్తున్నామని, టోకెన్ ప్రకారమే చెల్లింపులు జరుగుతున్నాయని, త్వరలోనే చెల్లింపులు జరిగే అవకాశం ఉందని సెలవివ్వడం గమనార్హం.

సమస్య పరిష్కరించాలి



ఉమ్మడి జిల్లాలో 12వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. తాము దాచుకున్న జీపీఎఫ్ విభాగం నుంచి అత్యవసర నిమిత్తం డబ్బులు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కాలరాయడం భావ్యం కాదు. పది నెలలుగా 200మందికి మంజూరై ఉన్న డబ్బులను కారణాలు లేకుండా జాప్యం చేయడం తగదు. త్వరగా బిల్లులు క్లియర్ అయ్యేలా చూడాలి.

– ముస్కు తిరుపతిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

త్వరగా మంజూరు చేయాలి



అత్యవసర సమయంలోనే జీపీఎఫ్ లోన్లు, పార్ట్‌ఫైనల్‌కు దరఖాస్తు చేస్తారు. సకాలంలో మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రతిసారి బిల్లుల మంజూరుకు నెలల తరబడి ఎదురు చూడాల్సి రావడం బాధాకరం. వెంటనే మంజూరుకు చొరవ చూపాలి.

– కట్టా రవీంద్రాచారి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

అవినీతికి ‘ఉత్తమ’ ముసుగు!

- స్వాతంత్య్ర దినోత్సవ వేళ సరికొత్త ఎత్తుగడ
- అవార్డుల కోసం అడ్డదారిలో పైరవీలు
- బల్దియాలో పావులు కదుపుతున్న అక్రమార్కులు

కరీంనగర్ కార్పొరేషన్: స్వాతంత్య్ర దినోత్సవ వేళ నగరపాలకసంస్థలో కొంతమంది అధికారులు సరికొత్త ఎత్తుగడ వేశారు. కొంత కాలంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు ఉద్యోగులు ఉత్తమ అవార్డుల కోసం పైరవీలు చేస్తున్నారు. తమకు అంటిన అవినీతి మరకను ఉత్తమ అవార్డుతో తుడుచుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. ఏటా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉత్తమ సేవలందించే వారిని గుర్తించి అవార్డులు అందిస్తుండడం తెలిసిందే. మరో మూడు రోజుల్లో స్వాతంత్య్ర దినోత్సవం ఉండడంతో, ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం నగరపాలకసంస్థ కసరత్తు చేస్తోంది. బల్దియాలోని ఇంజినీరింగ్, పారిశుధ్యం, రెవెన్యూ, మెప్మా, పరిపాలన తదితర విభాగాల నుంచి ఉత్తమ సేవలందిస్తున్న ఉద్యోగులను ఎంపిక చేసి, జాబితాను కలెక్టరేట్‌కు పంపిస్తారు. ఇదిలాఉంటే నగరపాలకసంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు కొంతమంది ఇటీవల పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటుండడం తెలిసిందే. తమ విభాగాల్లో జరుగుతున్న అనేక అవినీతి అక్రమాలకు సదరు అధికారులే బాధ్యులని నగరపాలకసంస్థతో సంబంధాలున్న ప్రతి ఒక్కరికి తెలుసు. అధికారుల అవినీతిపై విస్తృతస్థాయిలో ప్రచారం జరుగుతుండడం, పలు ఫిర్యాదులు వస్తుండడంతో సదరు అధికారులు కాస్త పలచనయ్యారు. ఇదే సమయంలో స్వాతంత్య్ర దినోత్సవం రావడంతో సదరు అక్రమార్కులు సరికొత్త ఎత్తుగడ వేశారు. ఎలాగైనా ‘ఉత్తమ అధికారి’ అవార్డును సొంతం చేసుకొని అర్జెంట్‌గా ‘పరపతిని’ పెంచుకోవాలనే ఆలోచన చేశారు. ఉత్తమ అధికారి అవార్డు వస్తే నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్రమంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవచ్చు, ఆపై ప్రజాప్రతినిధుల ప్రశంసలు కూడా పొందవచ్చనే దూరాలోచనతో ఉన్నత స్థాయిలో పైరవీలు మొదలు పెట్టారు. తమకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఉత్తమ అధికారి అవార్డు రావాలని టార్గెట్ పెట్టుకొని పైరవీలు చేయిస్తున్నారు. నగరపాలకసంస్థలోని ఆయా విభాగాల్లో తమ ఆధిపత్యం పూర్తిస్థాయిలో చలాయిస్తున్న సదరు అధికారులు, ఉన్నత స్థాయిలో చక్రం తిప్పుతారనే పేరుంది. వారు దేనిపై దృష్టి సారించినా, అది సాధిస్తారనే ప్రచారమూ ఉండడంతో, ఉత్తమ అవార్డు కూడా వారికి సొంతమవుతుందనే చర్చ మొదలైంది. సాధారణంగా అత్యుత్తమ సేవలందించి, అవినీతి అక్రమాలకు తావులేకుండా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, అధికారులకు ఈ ఉత్తమ అవార్డును అందిస్తుంటారు. కాని తాము అందించిన సేవలకు కాకుండా, తమపై పడిన అవినీతి మరకను చెరిపివేసుకోవడానికి కొంతమంది అక్రమార్కులు అడ్డదారిలో అవార్డుకోసం ప్రయత్నిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

స్కాంల కాంగ్రెస్.. స్కీంల బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్, వేదికపై మేయర్ సునీల్‌రావు తదితరులు

- బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి శూన్యం
- బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

కరీంనగర్: కాంగ్రెస్‌ది స్కాంల ప్రభుత్వం అయితే.. బీఆర్‌ఎస్‌ది స్కీంల ప్రభుత్వమని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో 125మందికి రూ.1.25 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాజస్థాన్, బీజేపీ పాలించే గుజరాత్‌లో ఇప్పటికీ నీటికొరత ఉందని అన్నారు. వారికి అధికారం ఇస్తే తెలంగాణ గుడ్డి దీపం అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాక ముందు, వచ్చాక కరీంనగర్ ఎలాఉందో ఆలోచించుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరికి సొంతఇల్లు ఉండాలని గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామని, ఈనెల 16 నుంచి మైనారిటీలకు, బీసీ కులాలకు చేయూత అందిస్తామని అన్నారు. మేయర్ వై.సునీల్‌రావు, ఆర్డీవో మహేశ్వర్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, చల్ల హరి శంకర్, అబ్బాస్ సమీ, వాసాల రమేశ్ పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా సీఎంఆర్‌ఎఫ్

నిరుపేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తుందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం మీసేవ కార్యాలయంలో 157 మందికి రూ.48,59,500 విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ప్రభుత్వం సీఎం సహాయనిధి కింద చికిత్సకు తగిన సాయం అందిస్తోందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

కరీంనగర్ కార్పొరేషన్: సీఎం కేసీఆర్ పేదల పక్షపాతిఅని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని 40వ డివిజన్ పరిధిలో డీమార్ట్ సమీపంలో రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో తప్పకుండా నాణ్యత పాటించాలని ఆదేశించారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కోటగిరి భూమాగౌడ్, గంట కల్యాణి, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

మందకొడిగా మద్యం టెండర్లు

- ఇప్పటి వరకు 385 దరఖాస్తులు
- గ్రూపులు కడుతున్న లిక్కర్ వ్యాపారులు
- 18 వరకు తుది గడువు.. జిల్లాలో 94 వైన్స్‌లు



దరఖాస్తు అందజేస్తున్న మహిళ

కరీంనగర్‌క్రైం: మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై వారం గడవగా.. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 385దరఖాస్తులు వచ్చాయి. టెండర్ ఫీజు రూ.2లక్షలు ఉన్నప్పటికీ గతంలో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఇప్పుడు పాతవారితో పాటు కొత్త వ్యక్తులు బరిలో ఉంటారని భావించినప్పటికీ దరఖాస్తుల సంఖ్య తక్కువగానే ఉంటోంది. కొందరు మంచి ముహూర్తాల కోసం వేచిచూస్తుండగా.. మరికొందరు పక్కావ్యూహంతో ‘గ్రూపు’లు కట్టేందుకు సిద్ధం అవుతున్నారు.

గతంలో 1,720 దరఖాస్తులు

జిల్లావ్యాప్తంగా 94 మద్యం దుకాణాలు ఉన్నాయి. గతంలో 1,720దరఖాస్తులు వచ్చాయి. రూ.34.44కోట్ల వరకు ఆదాయం సమకూరింది. కరీంనగర్ అర్బన్ సర్కిల్‌లో 21షాపులకు 428, రూరల్ సర్కిల్‌లో 26షాపులకు 481, తిమ్మాపూర్‌లో 14షాపులకు 323, జమ్మికుంటలో 16షాపులకు 182, హుజూరాబాద్‌లోని 17షాపులకు 306 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం కరీంనగర్ అర్బన్‌లో 134, కరీంనగర్ రూరల్‌లో110, తిమ్మాపూర్ సర్కిల్‌లో 78, జమ్మికుంటలో 20, హుజూరాబాద్ సర్కిల్‌లో 43 దరఖాస్తులు వచ్చాయి.

సర్కిళ్ల వారీగా ఇప్పటివరకు అందిన దరఖాస్తులు

సర్కిల్	షాపులు	దరఖాస్తులు
కరీంనగర్ అర్బన్	21	134
కరీంనగర రూరల్	26	110
తిమ్మాపూర్	14	78
జమ్మికుంట	16	20
హుజూరాబాద్	17	43
మొత్తం	94	385

గ్రూపులుగా బరిలోకి

జిల్లావ్యాప్తంగా కొందరు గ్రూపులుగా టెండర్లు దాఖలు చేసి వచ్చిన షాపులు కలిసే నిర్వహించుకుంటారు. వీరందరూ కలిసి వందల సంఖ్యలో దుకాణాలకు టెండర్లు వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. టెండర్ దరఖాస్తులకు ఈనెల 18 గడువుకాగా.. చివరి రెండు రోజుల్లో పెద్ద ఎత్తున టెండర్లు దాఖలు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. గతంలో వందలసంఖ్యలో టెండర్లు వేసినా పలుగ్రూపులకు మూడు,నాలుగు వైన్స్‌ల కన్నా ఎక్కువగా రాలేదని చర్చ జరిగింది. ఈ సారి ఖచ్చితంగా వైన్స్ వచ్చేలా వ్యూహం పన్నుతున్నారు. టెండర్ ఫీజు రూ.2లక్షలు ఉండడంతో కొత్తవారు ఆలోచించి అడుగులు వేస్తున్నారు.

క్లుప్తంగా

'అల్ఫోర్స్'లో చిత్రలేఖన పోటీలు



కొత్తపల్లి: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదం చేస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో 430 మందికి పైగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వాతంత్య్ర దినోత్సవం రోజు బహుమతి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. స్వాతంత్య్ర కోసం పోరాడిన మహనీయుల చరిత్ర, స్వాతంత్య్రం సాధించిన తీరు, చంద్రయాన్–3 విజయవంతం గురించి విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి వృద్ధుడి మృతి

- మృతుడు హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మామ



హుజూరాబాద్‌రూరల్: ప్రమాదవశత్తు కాల్వలో పడి హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మామ సాంబయ్య మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన సాంబయ్య (75) తన వ్యాపార పనుల నిమిత్తం శుక్రవారం రంగాపూర్ పంచాయతీ పరిధిలోని రైస్‌మిల్లుకు వెళ్లారు. తిరిగి వస్తూ బహిర్భూమికి వెళ్లి, సమీపంలోని కాకతీయ డీబీఎం–16 కాల్వలో ప్రమాదవశాత్తు జారి పడ్డారు. కొట్టుకుపోతుండగా స్థానికులు గమనించి, రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. సాంబయ్య నీటమునిగి మృతిచెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి, నివాళి అర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

జాన్సన్ గ్లోబల్ ఐఐటీ ఫౌండేషన్ ప్రారంభం



సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని జాన్సన్ గ్లోబల్ స్కూల్‌లో శుక్రవారం జాన్సన్ గ్లోబల్ ఐఐటీ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్కూల్ డైరెక్టర్లు మహిపాల్, వరప్రసాద్, హరికృష్ణ, రాంరెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో కారు డ్రైవర్ మృతి

కరీంనగర్‌రూరల్: గోపాల్‌పూర్‌కు చెందిన ఎన్నం రాము(32) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల కథనం.. రెండేళ్ల క్రితం రాముకు వివాహం కావడంతో అత్తగారి ఇళ్లయిన కొత్తపల్లిలో నివాసముంటూ కారుడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని గోపాల్‌పూర్ తీసుకొచ్చారు. సర్పంచు మంజుల ఆధ్వర్యంలో విరాళాలతో అంత్యక్రియలు చేశారు. మృతుడికి భార్య చందన, తల్లి పుష్ప ఉన్నారు.

సమర్ధవంతంగా ఎన్నికల నిర్వహణ

- నిబంధనలపై అవగాహన తప్పనిసరి
- కలెక్టర్ డాక్టర్ బి.గోపి



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి, పక్కన అధికారులు

కరీంనగర్ అర్బన్: రానున్న ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరిస్తూ ఎన్నికలను విజయవంతం చేయాలని అన్నారు. ఎన్నికల ప్రకటన నుంచి పోలింగ్ రోజు ఉదయం నిర్వహించే మాక్‌పోల్ వరకు విధులపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. 18ఏళ్లు నిండిన వారందరిని ఓటరుగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రం వారిగా వికలాంగుల కొరకు వీల్‌చైర్లు, ర్యాంపులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 28న డ్రాఫ్ట్ పబ్లిషింగ్ జరుగుతుందని, ఆ రోజు నుంచి అభ్యంతరాలను స్వీకరించి సెప్టెంబర్ 19వరకు సర్దుబాట్లకు అవకాశం కల్పించాలని అన్నారు. అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా ప్రకటిస్తారని వివరించారు. ఈ నెల 19న జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల హెడ్‌క్వార్టర్లలో 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో 5కే రన్‌ను నిర్వహించనున్నామని, అధికారులందరు పాల్గొనాలని ఆదేశించారు. సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ ఐపీఎస్ మహేష్ బాబాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'పై సమీక్ష

గృహలక్ష్మి దరఖాస్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బి.గోపి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పథకంపై సమీక్షించారు. ఈ పథకం కింద సొంతభూమి ఉన్న పేదవారికి ఇంటినిర్మాణం కోసం 100శాతం సబ్సిడీపై మూడు విడతల్లో రూ.3లక్షల ఆర్థికసాయం అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో ఎంపీడీవోలకు, మున్సిపల్ పరిధిలో కమిషనర్లకు వచ్చిన దరఖాస్తులను ఈనెల 20లోగా పరిశీలించి, 25వ తేదీ నాటికి మంజూరుకు పంపించాలని తెలిపారు. దరఖాస్తుల్లో కులధ్రువీకరణ, సొంత స్థలం, ఆధార్, రేషన్‌కార్డు, ఓటరు ఐడీని సరిచూసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 26,834 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని వివరించారు.

సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు

- జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాట్లు
- పక్కాగా ఎన్నికల పోలింగ్ కేంద్రాల సమాచారం
- విస్తృతంగా వాహన తనిఖీలు
- సీపీ ఎల్.సుబ్బారాయుడు



మాట్లాడుతున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కమిషనరేట్ పరిధిలోని అన్నిస్థాయి పోలీసులు సమన్వయంతో ముందుకు సాగాలని సీపీ ఎల్.సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. కమిషనరేట్‌కేంద్రంలో శుక్రవారం వివిధస్థాయిల అధికారులతో సమావేశం అయ్యారు. సీపీ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతీ అవసరాన్ని ముందుగా గుర్తించి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా అల్లర్లు జరిగే ప్రాంతాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను గుర్తించాలని సూచించారు. సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాల్సి ఉంటుందని అన్నారు. అంతర్ జిల్లాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో జరిగిన కేసుల్లో ఎలాంటి వారెంట్లు పెండింగ్‌లో ఉండొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీపీ వివరించారు. రాష్ట్రంలోని కొన్నిప్రాంతాల్లో చెడ్డీగ్యాంగ్ కదలికలు కొనసాగుతున్నందున కమిషనరేట్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, వాహన తనిఖీ ముమ్మరం చేసి, ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. వారం రోజుల్లో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నివేదికలు తయారుకావాలని ఆదేశించారు. అడిషనల్ డీసీపీలు ఎ.లక్ష్మినారాయణ, సి.రాజు, ఏసీపీలు నరేందర్, జీవన్‌రెడ్డి, ఏ.శ్రీనివాస్, విజయ్‌కుమార్, ట్రైనీ ఐపీఎస్ గీత్‌మహేశ్ బాబా సాహెబ్, ఎస్‌బీఐ ఓ.వెంకటేశ్ పాల్గొన్నారు.

సమర్థవంతంగా పనిచేస్తే గుర్తింపు

కరీంనగర్ క్రైం: సమర్థవంతంగా పనిచేసే పోలీసు అధికారులకు ఎక్కడైనా గుర్తింపు లభిస్తుందని సీపీ ఎల్.సుబ్బారాయుడు అన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో పనిచేస్తూ బదిలీ అయిన అధికారులకు కమిషనరేట్ కేంద్రంలోని ఓపెన్ థియేటర్ ఆవరణలో శుక్రవారం రాత్రి వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. బదిలీపై వెళ్లిన డీసీపీ(శాంతిభద్రతలు) ఎస్.శ్రీనివాస్, డీసీపీ (పరిపాలన) జి.చంద్రమోహన్, ఏసీపీలు తుల శ్రీనివాసరావు, విజయసారథి, వెంకటరెడ్డి, విజయకుమార్, సత్యనారాయణ, ఆర్‌ఐలు మురళి, మల్లేశం, జానీమియా, ఎస్బీఐ వెంకటేశ్వర్లును శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. కమిషనరేట్‌లో పనిచేసి, బదిలీపై వెళ్లిన ప్రతి పోలీసు అధికారి సమర్థవంతంగా పని చేశారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ఎ.లక్ష్మీనారాయణ(శాంతిభద్రతలు), సి.రాజు(పరిపాలన), అడిషనల్ డీసీపీ (సీఏఆర్) భీం రావు, ఏసీపీలు నరేందర్, జీవన్ రెడ్డి, ఎ.శ్రీనివాస్, సి.ప్రతాప్, ఎస్బీఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

భర్త మద్యానికి బానిసయ్యాడని..

- ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



మానస (ఫైల్)

బీబీనగర్: భర్త మద్యానికి బానిసయ్యాడని మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. కరీంనగర్ జిల్లా వీణవంక గ్రామానికి చెందిన నల్ల మానస(33)కు అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌తో 2014లో వివాహమైంది. వీరికి కుమారుడు సంతానం. ఉపాధి కోసం శ్రీనివాస్ కుటుంబంతో కలిసి కొన్నేళ్ల క్రితం బీబీనగర్‌కు వలస వచ్చాడు. ఘట్కేసర్ మండలం బోగారం గ్రామంలోని లిక్కర్ గోదాంలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో భర్తను మద్యం మానేయాలని కోరినా అతను పట్టించుకోవడం లేదు. దీంతో మనస్తాపం చెందిన మానస గురువారం రాత్రి కుమారుడు నిద్రపోయాక, భర్త ఇంట్లో లేని సమయంలో ఉరేసుకుంది. శుక్రవారం ఉదయం ఇరుగుపొరుగు వారు గమనించి ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని, పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోగారం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఉపాధ్యాయ నాయకులు



కరీంనగర్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు శుక్రవారం కలెక్టర్ బి.గోపిని కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ నాయక్ మాట్లాడుతూ.. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. నాయకులు మీసాల మల్లిక్, మాలోతు బలరాం నాయక్, రెవెల్లి తిరుపతి, రవినాయక్, రంగయ్యనాయక్, శంకర్, భూక్య రాజన్న, అయిలయ్య, బుచ్చయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'డబ్బుల స్వాహాపై విచారణ జరిపించండి'

చిగురుమామిడి: మండలంలోని రామంచ గ్రామ పరిధి అంటకాలపల్లెలో లక్ష్మీనర్సింహ గ్రామైక్య సంఘంలోని 12 స్వశక్తి సంఘాల మహిళల సంతకాలను ఫోర్జరీ చేసి, సీఏ ఖాతాలోకి డబ్బులు బదిలీ చేయడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు బ్యాంకుల్లోని కొందరు అధికారులు సహకరించారని ఆరోపిస్తున్నారు. చిగురుమామిడిలోని యూనియన్, చిన్నముల్కనూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో తమ పేరిట ఏమైనా రుణాలు తీసుకున్నారా అని అనుమానిస్తున్నారు. డబ్బుల స్వాహా విషయమై కలెక్టర్ విచారణ జరిపించాలని కోరుతున్నారు.

సీఏ, ఐకేపీ సిబ్బందిపై ఫిర్యాదు

తమ సంతకాలు ఫోర్జరీ చేసి, రూ.13.40 లక్షలు స్వాహా చేశారని సీఏ, ఐకేపీ ఏపీఎం, సీసీలపై స్వశక్తి సంఘాల మహిళలు గురువారం సాయంత్రం చిగురుమామిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డబ్బులను రికవరీ చేసి, బ్యాంకులో జమ చేయాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ద్విచక్రవాహనాలు ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు



శంకరపట్నం: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని రాజాపూర్‌కు చెందిన ఆసరి ఐలయ్య, రెడ్డి రాజయ్య శుక్రవారం బైక్‌పై కరీంనగర్ వెళ్తున్నారు. కుక్కల రాజయ్య ద్విచక్రవాహనంపై రాజాపూర్ వైపు వస్తున్నాడు. గ్రామ శివారులో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐలయ్యతోపాటు కుక్కల రాజయ్య తీవ్రంగా గాయపడ్డారు. ఈఎంటీ సతీశ్‌రెడ్డి వారికి ప్రథమ చికిత్స చేసి, 108 వాహనంలో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికల షెడ్యూల్‌లోగా పరీక్షలు నిర్వహించాలి

కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ ద్వారా విడుదలైన నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసి, నెలలు గడుస్తున్నా పరీక్ష తేదీలు ఖరారు చేయకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ ఒక ప్రకటనలో అన్నారు. డీఏవో, హెచ్‌డబ్ల్యూవో, గ్రూప్–3 పరీక్షల తేదీలను త్వరగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం బయటపడటంతో రద్దయిన పరీక్షలకు ఇప్పటివరకు తేదీలు ఖరారు చేయకపోవడం సరికాదన్నారు. ఎన్నికల షెడ్యూల్‌లోపే పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ప్రకటించాలని కోరారు.

రేపు అండర్-7, 11 చెస్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న కరీంనగర్‌లోని భగవతి ఉన్నత పాఠశాలలో అండర్–7, 11 విభాగాల్లో ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధులు బి.రమణారావు, చెరుకు ప్రద్యుమ్న కుమార్, అంతగిరి రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాణించిన క్రీడాకారులను ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 01-01-2016, ఆ తర్వాత జన్మించినవారు, అండర్–11 పోటీల్లో పాల్గొనేవారు 01-01-2012, ఆ తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.300 ఎంట్రీ ఫీజు, సొంత చెస్ బోర్డుతో హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 93901 77607 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్రీడల్లో పాల్గొనే ఉద్యోగులు వివరాలివ్వండి

కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సివిల్ సప్లయ్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఈవెంట్స్ ఈ నెల 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా డిపార్ట్‌మెంటల్ ఉద్యోగులు ఈ నెల 14లోగా తమ వివరాలను జిల్లా క్రీడాశాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి రాజవీరు ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఐడీ కార్డుతో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలన్నారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్, బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ బెస్ట్ ఫిజిక్ క్రీడల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 96409 67943, 90595 95266 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పేద వైద్య విద్యార్థికి ఆర్థికసాయం



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ శివారులోని ప్రతిమ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సవంత్సరం చదువుతున్న పేద విద్యార్థికి కరీంనగర్‌కు చెందిన బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు రూ.25 వేల చెక్కును శుక్రవారం తన ఆస్పత్రిలో అందజేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన కె.రాంపాల్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకైన విద్యార్థి. అతని అమ్మానాన్న వ్యవసాయ కూలీలని, ఆర్థిక పరిస్థితి బాగా లేదని తెలుసుకున్న బీఎన్ రావు రాంపాల్‌కు బుక్స్, ఇతర ఖర్చుల నిమిత్తం సాయం చేశారు.

16 నుంచి 'మోడల్' సిబ్బంది ఆందోళన



మాట్లాడుతున్న రమేశ్

కరీంనగర్: రాష్ట్ర మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16 నుంచి కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మోడల్ స్కూల్ హాస్టల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రమేశ్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ వేతనాలతో పదేళ్లుగా పని చేస్తున్న సిబ్బందిని 2018లో సర్వశిక్ష అభియాన్‌లో విలీనం చేశారన్నారు. హాస్టల్ ఇన్‌చార్జి బాధ్యత కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌కు అప్పగించడం వల్ల ఉపయోగం లేదని పేర్కొన్నారు. హాస్టల్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు వేతనాలు పెంచి, నిర్దిష్ట డ్యూటీ చార్ట్ అమలు చేయాలని, అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. కేర్ టేకర్‌కు రూ.22,750, వాచ్‌మెన్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్లకు రూ.15,600 చొప్పున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని, హాస్టల్స్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఇన్‌చార్జి రద్దు చేసి, కేర్ టేకర్‌కు పూర్తి బాధ్యత అప్పగించాలన్నారు. 24గంటల పని విధానం రద్దు చేసి, 8 గంటల డ్యూటీ చార్ట్ అమలు చేయాలని, స్వీపర్, డే వాచ్‌మెన్, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లా నాయకులు లావణ్య, కృష్ణవేణి, సునీత, లత, సుజాత, లక్ష్మి తదితరులున్నారు.

దేశాన్ని దివాలా తీయిస్తున్న కేంద్రం

- క్విట్ ఇండియా స్ఫూర్తితో కాపాడుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, సంపదను కార్పొరేట్లకు తాకట్టు పెడుతూ దేశాన్ని దివాలా తీయిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆరోపించారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఎడ్ల రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ పరోక్షంగా మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. మణిపూర్ ఘటనకు యావత్ దేశం సిగ్గుపడాలని, కేవలం 34 లక్షల మంది ఉన్న రాష్ట్రంలో నేటికీ హింస ఆగకపోవడం వెనుక రాజకీయ కోణం ఉందన్నారు. ఇప్పటికైనా చర్చల ద్వారా ఆ రాష్ట్రంలో శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం వారి ఖాతాల్లో జమ చేయాలని, గృహలక్ష్మి పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.భీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, శీలం అశోక్, వెలమారెడ్డి రాజిరెడ్డి, జి.రాజేశం, డి.నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ అకాడమీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అకాడమీ ఇండోర్ స్టేడియం సరూర్‌నగర్‌లో ప్రవేశానికి 14 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో క్రీడాకారుల శారీరక, క్రీడా నైపుణ్యాన్ని పరీక్షించేందుకు ఈ నెల 17న ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 01-08-2005 నుంచి 31-08-2009 మధ్య జన్మించి ఉండాలన్నారు. 14 నుంచి 16 ఏళ్ల మధ్య వయసున్న బాలురు 182 సెం.మీ, బాలికలు 166 సెం.మీ. ఎత్తు ఉండాలని, 16 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న బాలుర ఎత్తు 186 సెం.మీ, బాలికల ఎత్తు 170 సెం.మీ. ఉండాలని తెలిపారు. వయసు, స్పోర్ట్స్ అచీవ్‌మెంట్ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ ఒరిజినల్, జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 8 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 98483 64143 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మధ్యంతర భృతి 20 శాతం ప్రకటించాలి



సభ్యత్వం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

హుజూరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి 20 శాతం ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి పీఆర్సీ గడువు 30 జూన్‌తో ముగిసిందన్నారు. రెండో పీఆర్సీని ఈ నెల నుంచి 30 శాతం ఫిట్‌మెంట్ తగ్గకుండా ఇవ్వాలని కోరారు. ఎంప్లాయీ హెల్త్ స్కీం 500 ఆర్‌ఎస్ స్లాబ్‌తో ఉద్యోగితోపాటు కుటుంబానికి రూ.20 లక్షల వరకు, 1,000 స్లాబ్‌తో రూ.40 లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులివ్వాలన్నారు. 2003 ఉద్యోగ, ఉపాధ్యాయులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మార్చాలని, పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకం చేపట్టాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తోకల శివారెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవరావు, భాగ్యరేఖ, రాష్ట్ర బాధ్యులు సమ్మయ్య, కరుణాకర్ రెడ్డి, సాంబమూర్తి, రవికుమార్, అనిల్ సంజీవరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న ఎస్‌యూ ఇన్‌స్టంట్ పరీక్షలు

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించేందుకు పరీక్షలు, ఫీజు చెల్లింపు తేదీలను పరీక్షల నియంత్రణ అధికారి శుక్రవారం ప్రకటించారు. 5వ, 6వ సెమిస్టర్లలో(సీబీసీఎస్–ఆర్19) థియరీలో గానీ ప్రాక్టికల్స్‌లో గానీ ఒక్క పేపర్ ఫెయిలైనవారికి ఈ నెల 26న పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఒక పేపర్‌కు రూ.750 ఫీజుతోపాటు దరఖాస్తును ఈ నెల 18వ తేదీలోగా తమ తమ కళాశాలల్లో అందించాలన్నారు. ఈ నెల 26న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ సెమిస్టర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 6వ సెమిస్టర్ పరీక్షలుంటాయని పేర్కొన్నారు. గడువు తేదీ తర్వాత ఎటువంటి రుసుముతోనూ దరఖాస్తు తీసుకోబోమని తెలిపరాఉ. విద్యార్థులు వారి వారి కళాశాలల్లోనే దరఖాస్తు ఫాంలు పొందవచ్చన్నారు. ఒకసారి చెల్లించిన రుసుము ఎట్టిపరిస్థితుల్లోనూ తిరిగి ఇవ్వబోమని, సర్దుబాటు చేయడం ఉండదన్నారు.

కాలువలో పడి ఛత్తీస్‌గఢ్‌వాసి గల్లంతు

హుజురాబాద్ రూరల్: హుజూరాబాద్ పట్టణ శివారులోని గాంధీనగర్ సమీపంలో గల ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో పడి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి గల్లంతయినట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని ధీమతార జిల్లా తనకహమియా గ్రామానికి చెందిన నేతం దిలీప్ జీవనోపాధి నిమిత్తం తన భార్య ఉత్తర, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లతో కలిసి కొన్ని నెలల క్రితం హుజూరాబాద్ వచ్చి, గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతను మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లిన దిలీప్ ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాల్వలో పడి, కొట్టుకుపోయాడు. ఆ సమయంలో అతని కుమారుడు రోషన్, భార్య ఉత్తర అక్కడే ఉన్నారు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో కొంత దూరం వెళ్లి, పలువురిని తీసుకువచ్చేలోపే నీటిలో మునిగి, గల్లంతయ్యాడు. బ్లూకోల్ట్స్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాలువ వెంట రాత్రి వరకు గాలించినా అతని ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దిలీప్ కోసం గాలిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

అసంక్రమిత వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్‌రూరల్: ప్రజలు అసంక్రమిత వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో కె.లలితాదేవి సూచించారు. శుక్రవారం హుజూరాబాద్ రూరల్ మండలంలోని చెల్పూర్, కందుగుల, పెద్దపాపయ్యపల్లి గ్రామాల్లో పర్యటించారు. పల్లె దవాఖానాల్లో అందే ఆరోగ్య సేవలను తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జూలైలో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 37శాతం ఉన్న ప్రసవాల సంఖ్య 67శాతానికి పెరిగిందని అన్నారు. వ్యాధి నిరోధకటీకాల్లో జిల్లా ప్రథమస్థానంలో ఉందన్నారు. పల్లె దవాఖానాల్లో ఓపీని పెంచాలని ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, వైద్యాధికారులు శ్యామ్, పంజాల ప్రతాప్, సాజిద్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

పదోన్నతి...అలాట్‌మెంట్

- జిల్లాలో 11 మందికి అవకాశం

కరీంనగర్ అర్బన్: నాయబ్ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ సీసీఎల్‌ఏ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 11మందికి పదోన్నతి లభించగా ఇతర జిల్లాలకు అలాట్‌మెంట్ చేశారు. కముటం శ్రావన్‌కుమార్(కరీంనగర్ అర్బన్)ను సిద్దిపేట అలాట్‌మెంట్ చేయగా, పి.చంద్రశేఖర్(గంగాధర), కె.రవికుమార్(చిగురుమామిడి)ను భద్రాద్రి కొత్తగూడెం, హరికిరణ్‌కుమార్(సివిల్ సప్లయ్), వి.శ్రీనివాస్‌రెడ్డి(కొత్తపల్లి), కె.శ్రీకాంత్(కరీంగర్)కు సిద్దిపేట, ఆర్.సురేష్(కరీంనగర్ ఆర్డీవో ఆఫీస్), ఎస్.మహేశ్‌కుమార్(గన్నేరువరం)లకు రాజన్న సిరిసిల్ల, ఖాజాకుతుబుద్దీన్(రామడుగు)కు నిజామాబాద్, జి.రమేష్(సివిల్ సప్లయ్ గంగాధర)కు జగిత్యాల, డి.శ్రీనివాస్(డీఎం సివిల్ సప్లయ్)కు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు అలాట్ చేశారు.

వరదలొస్తే.. వంతెన మునుగుడే



శిథిలావస్థలో తోకబొంద వంతెన

- శిథిలావస్థలో కొత్తపల్లి తోకబొంద వంతెన...
- వర్షాలతో పూర్తిగా దెబ్బతిన్న లో లెవల్ వంతెన
- రైతులు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



కొత్తపల్లి: కొత్తపల్లి శివారులోని తోకబొంద లో లెవల్ వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వరదలొస్తే వంతెన పూర్తిగా మునగడంతో పాటు అధ్వాన్నస్థితికి చేరడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. గతేడాది వరదలతో ఈ రోడ్డు కోతకుగురై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితుల్లో మున్సిపల్‌చైర్మన్ తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి వాహనాలు ప్రయాణించేలా చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు భారీఎత్తున వరద రావడంతో వంతెన పూర్తిగా మునిగి పూర్తిగా చెడిపోయింది. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రోడ్డుపై ప్రయాణించే వాహనాలకు కష్టాలు తప్పడం లేదు. వంతెన కోతకు గురవుతున్నప్పుడల్లా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక ప్రాతిపదికన నూతన బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

వంతెనతో రైతులకు కష్టాలు..

కొత్తపల్లి-కిష్టారావుపల్లెకు వెళ్లే రోడ్డుపై లో లెవల్ వంతెనతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఈ రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలు ఉధృతమవడంతో లో లెవల్ వంతెన పూర్తిగా ధ్వంసమై పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో పొలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా వరద ఉధృతికి కొత్తపల్లి-చింతకుంట బైపాస్ సైతం మునుగుతుండడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు మార్గం లేకుండా పోతోంది. రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీటితో తోకబొంద బ్రిడ్జి పూర్తిగా మునిగి శిథిలావస్థకు చేరింది. అంతేగాకుండా వంతెనపై పెద్ద గుంతలు ఏర్పడి ఆ మార్గం గుండా వెళ్లడం కష్టంగా ఉంది. దీంతో పొలాలకు వెళ్లడం, వ్యవసాయ పనులు చేపట్టడం ఇబ్బందిగా మారింది. రైతులను దృష్టిలో పెట్టుకుని వంతెన నిర్మాణం చేపట్టాలి.

– గుంటి మల్లయ్య, కొత్తపల్లి

మంత్రి దృష్టికి తీసుకెళ్లా

కొత్తపల్లి శివారులోని తోకబొంద లో లెవల్ వంతెన తరచూ వరదలతో మునిగిపోతోంది. దీంతో రైతులకు ఇబ్బంది కలుగుతున్న విషయాన్ని మంత్రి గంగుల కమలాకర్ దృష్టికి తీసుకెళ్లా. ఎఫ్‌డీఆర్ నిధులు విడుదల చేసి వంతెన నిర్మించాలని విన్నవించా. వంతెన నిర్మాణానికి మంత్రి స్పందించారు. త్వరలోనే నిధులు మంజూరు చేస్తారన్న విశ్వాసం ఉంది.

– రుద్ర రాజు, మున్సిపల్ చైర్మన్, కొత్తపల్లి

క్లుప్తంగా

వినోద్‌కుమార్ పెళ్లిరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పెళ్లిరోజు సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్ట్రీ క్వార్టర్స్‌లో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జీఎస్.ఆనంద్, కలర్ సత్తన్న, గోడిసెల రమేశ్, ఆకుల వెంకటేశ్, మల్లికార్జున, రాజేందర్, కిరణ్ రాజు న్నారు.

తహసీల్దార్‌కు అభినందన



పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: మండల తహసీల్దార్‌గా ఇటీవల విధుల్లో చేరిన నవీన్‌ను శుక్రవారం మండల ప్రజాప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్, చెర్లభూత్కూర్ సర్పంచు దబ్బెట రమణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు డి.అంజిరెడ్డి, చింతల లక్ష్మణ్, మంద అశోక్ బుర్ర గంగయ్య,రాజయ్య పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కరీంనగర్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూఎస్పీసీ రాష్ట్రశాఖ పిలుపుతో దశలవారీ పోరాటం కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఎదుట యూఎస్పీసీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్‌కమిటీ సభ్యులు ముక్కలకుమార్, పోరెడ్డి దామోదర్‌రెడ్డి, యాంసాని ఉమారాణి , కేఎఫ్.జావేద్, ఆర్.చంద్రశేఖర్, తూముల తిరుపతి పేర్కొన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి: మండలంలోని ఎలగందుల ఆదర్శ పాఠశాలలో కేర్ టేకర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో మధుసూదన్ తెలిపారు. ఇంటర్ విద్యార్హతతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థనుంచి ఏఎన్‌ఎం శిక్షణ సర్టిఫికెట్ కలిగిఉండాలని స్థానిక మండలానికి చెందిన మహిళా అభ్యర్థి ఈ ఉద్యోగానికి అర్హులన్నారు. ఈనెల 14 సాయంత్రం 5గంటల వరకు కరీంనగర్‌లోని ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.12,500 వేతనం చెల్లిస్తామన్నారు.

ఎస్సారార్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ స్వచ్ఛభారత్



చెత్తను తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: జాతీయ సేవాపథకం, ఎస్సారార్ కళాశాల ఆధ్వరంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుకళాశాలలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వర గార్డెన్‌లో ఇటీవల వర్షాలకు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల్ని తొలగించి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించారు. పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి శ్రమదానం చేశారు. కళాశాలలోని రోడ్లని ఊడ్చారు. రాబోయే స్వాతంత్ర్య దినోత్సవానికి ఉపయోగపడేలా కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసినందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రామకృష్ణ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా.వి.వరప్రసాద్, డీడీ.నాయుడు బి.సురేశ్‌కుమార్, వి.చంద్రమౌళి డా.శారదను అభినందించారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు

చొప్పదండి: పట్టణంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం ఓటుహక్కు వినియోగంపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పద్దెనిమిదేళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏ. శరత్‌బాబు సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలని కోరారు హర్యానాలో జరిగిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరానికి చొప్పదండి నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరు కాగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌కుమార్, కనకయ్య, సబితారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇదెక్కడి గోల..!



కరీంనగర్ అర్బన్: ఈ చిత్రం చూసి ఇదేదో మేకల అంగడి అనుకుంటే పొరపాటే. నగరంలోని మహాత్మగాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో నిత్యం వందల సంఖ్యలో మేకలు తిరుగుతూ కూరగాయలు తింటున్నాయి. రాత్రిపూట మార్కెట్ నిర్వహిస్తుండడం పరిపాటి కాగా వీటిని నియంత్రించడం పెద్దసమస్యగా మారిందని రైతులు వాపోతున్నారు. హోల్‌సేల్‌గా కూరగాయలను అమ్ముకునేందుకు వస్తే ఇదెక్కడి గోలరా నాయనా అంటూ మండిపడుతున్నారు.

పరీక్షల తేదీల్లో మార్పులు

కరీంనగర్‌సిటీ: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్శిటీ పరిధిలోని పలు పరీక్ష తేదీల్లో మార్పులు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి శుక్రవారం తెలిపారు. డిగ్రీ పరీక్షల్లోని 2వ, 4వ, 5వ, 6వ సెమిస్టర్లలోని పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు సూచించారు. ఈనెల జూలై 22న నిర్వహించాల్సిన పరీక్షలు ఈనెల 18వ తేదీన, జూలై 26న నిర్వహించాల్సిన పరీక్షలు ఈనెల 19న, జూలై 27న నిర్వహించాల్సిన పరీక్షలు ఈనెల 21న, జూలై 28న నిర్వహించాల్సిన పరీక్షలు ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. సెంటర్లల్లో ఎలాంటి మార్పులుండవన్నారు.

అంధుల పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు

కొత్తపల్లి: స్థానిక పద్మానగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల డైరెక్టర్ రశ్మిత ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పారమిత పాఠశాల విద్యార్థులు స్థానిక కొత్తపల్లి మండలం రేకుర్తి అంధుల పాఠశాలకు వెళ్లి అక్కడి విద్యార్థులకు పండ్లు, ఆహార పదార్థాలు, స్వీట్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులురశ్మిత ప్రసాద్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రితేష్‌మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్తలు సరిత,హరిప్రియ ఉపాధ్యాయులు దిడ్డి అభినవ్, రాజు, గౌతం, విద్యార్థులు పాల్గొన్నారు.



పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నియామకం



విద్యానగర్: తెలంగాణ బీసీ జనసేన మున్నూరు కాపు కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్ విద్యారాణ్యపురికి చెందిన తోటరామన్న నియమితులయ్యారు. శుక్రవారం తెలంగాణ బీసీ జనసేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు అంజనేయులు తోట రామన్నకు నియమకం పత్రాలు అందించారు. ఈ సందర్భంగా తోట రామన్న మాట్లాడుతూ.. బీసీల సమస్యల పరిష్కారానికి వారి హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

కరీంనగర్‌రూరల్: తల్లిపాలతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం చామనపల్లిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్వశక్తి సంఘాల మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని తల్లిపాల ప్రాధాన్యత వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ నిర్మల, ఎంసీహెచ్ సూపర్‌వైజర్ విమల, పీహెచ్‌సీ వై ద్యురాలు ఇందు సఖీసెంటర్ ఇన్‌చార్జి లక్ష్మి, ఏఎన్‌ఎం స్వరూప, ఆశా కార్యకర్తలు సత్యశోభ, కవిత, అంగన్‌వాడీ టీచర్లు గీత,మణెమ్మ,తల్లులు, స్వశక్తిమహిళలు పాల్గొన్నారు.



మహిళలతో ఎంపీపీ లక్ష్మయ్య

రైతుసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, డైరెక్టర్లు

కరీంనగర్‌అర్బన్: అన్నదాత సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు అన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్న నినాదంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు. శుక్రవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యార్డులో పండ్ల మార్కెట్‌లో నిర్మిస్తున్న రెండు నూతన షెడ్ల ప్రారంభోత్సవం, ఇతర సమస్యలపై చర్చించారు. సమావేశంలో మార్కెట్‌కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం, మార్కెట్ వైస్‌చైర్మన్ ఉప్పు రాజశేఖర్, డైరెక్టర్లు కర్నాటి చలమయ్య, పబ్బతి రంగారెడ్డి, గుంటి రాజమల్లు, సోమిరెడ్డి లక్ష్మారెడ్డి, గోలి మల్లయ్య, గంగాధర లస్మయ్య, గుండేటి అనిత, చంద్రపల్కల అంజయ్య, బోనాల జనార్దన్, మహముద్ పాషా, విజయ్‌కుమార్ ముందడా, శివనాథుని వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 33/11 కె.వీ. బ్యాంక్‌కాలనీ, వావిలాలపల్లి, అంబేద్కర్‌నగర్, వాటర్ వర్క్స్(హౌజింగ్‌బోర్డు కాలనీ), పద్మానగర్, ఎస్సారార్ కళాశాల సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 1,2 ఏడీఈలు ఎస్.నరేందర్, ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. నూతన 8 ఎంవీఆర్ పీటీఆర్ ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకు 33/11 కె.వీ.సప్తగిరి కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని కాశ్మీర్‌గడ్డ, శ్రీనగర్‌కాలనీ, ఎమ్మార్ గార్డెన్, గోదాంగడ్డ, సప్తగిరికాలనీ, భగత్‌నగర్, ముకరంపుర, మంకమ్మతోట శివనగర్, టెలిఫోన్ క్వార్టర్స్‌రోడ్, హస్నాపూర్, బతుకమ్మకాలనీ ప్రాంతాలతో పాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు 11 కె.వీ.రాంనగర్‌ఫీడర్ పరిధిలోని సంతోష్‌నగర్, చేపల మార్కెట్ నుంచి సత్యనారాయణ స్వామి దేవాలయం, సిద్ధార్థ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ 2 తెలిపారు.

కొత్తపల్లి, రూరల్ పరిధిలో..

విద్యుత్ సబ్‌స్టేషన్లలో విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6 గంటల వరకు 33/11 కె.వీ. కొత్తపల్లి, రేకుర్తి, బొమ్మకల్, నగునూర్, శాతవాహన యూనివర్సిటీ, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు.

రేపు కొత్తపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం

కొత్తపల్లి: పురపాలక సంఘం ఆధ్వర్యంలో సన్‌షైన్ ఆసుపత్రి కరీంనగర్ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు తెలిపారు. ఈమేరకు మెగా వైద్యశిబిరం పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. గుండె, కీళ్లవాపు, స్త్రీ సంబంధిత, జనరల్ ఫిజీషియన్, చిన్నపిల్లలకు సంబంధించిన వైద్యులు శిబిరంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా షుగర్ రక్త పరీక్షలు, ఈసీజీ, 2డీ ఏకో, లుపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందిస్తారన్నారు. కొత్తపల్లి పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఈ మెగా ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. కౌన్సిలర్ సత్యనారాయణ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఎస్‌కే. బాబా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్

యూనివర్సిటీ పోటీలకు ఎంపిక

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ విద్యార్థిని స్వప్నిక ఏషియా యూనివర్శిటీ కప్‌లో భాగంగా పవర్ లిఫ్టింగ్‌లో ఎంపికైందని యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ డా.మల్లేశం శుక్రవారం తెలిపారు. ఈనెల 16 నుంచి 21 వరకూ శాన్‌జాబ్‌లో పోటీలు జరుగుతున్నాయన్నారు.

మంత్రి గంగులకు రేషన్ డీలర్ల సన్మానం

కరీంనగర్‌అర్బన్: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారంలో మంత్రి గంగుల కమలాకర్ పాత్ర మరువలేనిదని ఉమ్మడి జిల్లా రేషన్‌డీలర్లు కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. డీలర్లకు కమీషన్ పెంపుతో పాటు హెల్త్‌కార్డులు, కారుణ్య నియామకాల అంశాలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గ ప్రతినిధులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

స్థలం, నిధులు ఇప్పించండి

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ డ్యాన్స్‌స్పోర్ట్స్ అసోసియేషన్ కరీంనగర్‌కు భవనానికి 5 గుంటల స్థలం, భవననిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరుచేయాలని కోరుతూ శుక్రవారం అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కట్ట రమేశ్, శ్రీరామోజు రామకృష్ణ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రభు, సతీశ్, కోశాధికారి సాయిదీప్ వంశీనాథ్, శేఖర్ నాయుడు, రాజశేఖర్, విఘ్నేశ్, వినయ్ ఉన్నారు.

ట్రాన్స్‌పోర్టు ఆఫీసు ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని బావుపేటలో ఏర్పాటుచేసిన లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని శుక్రవారం మంత్రిగంగుల కమలాకర్ ప్రారంభించారు. ఎంపీపీ పిల్లి శ్రీలత , సర్పంచ్ నాయినిప్రసాద్, ఎంపీటీసీలు మనోహర్, తిరుపతినాయక్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సాబీర్ పాష, జీకే.యూత్ గౌరవ అధ్యక్షుడు గంగుల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి

చొప్పదండి: ప్రజాగాయకుడు గద్దర్‌కు చొప్పదండిలోని కళాకారుల బృందం శుక్రవారం పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో నివాళి అర్పించారు. జానపద కళారత్న అవార్డు గ్రహీత డోలక్ రాజు ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి మౌనం పాటించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చీకట్ల లచ్చయ్య, దండె రాజయ్య, పిట్టల రఘు, దండె కొమురయ్య, మంచికట్ల విఠల్, పూదరి నారాయణ, దండె లింగన్న, దూస రాము, తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న కళాకారుల బృందం సభ్యులు

చేనేత ఉత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రథమ బహుమతి పొందిన చిత్రం

చొప్పదండి: జాతీయ చేనేత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. నియోజకవర్గ స్థాయిలో హ్యాండ్లూమ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో సమీర ప్రథమ, వ్యాస రచన పోటీలో ఎస్. సంతోష్ ద్వితీయ బహుమతి. హ్యాండ్లూమ్ డ్రెస్ కాంపిటిషన్‌లో కె. శ్రీవాణి ప్రథమ, బి. అర్చన ద్వితీయ బహుమతులు, డ్రాయింగ్‌లో ఆర్ట్ టీచర్ కె.చంద్రశేఖర్ ప్రథమ బహుమతి సాధించారు. విద్యార్థులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, హెచ్‌ఎం కరుణ, ఉపాధ్యాయులు అభినందించారు.

సాయినాథుడికి స్వీట్స్ నైవేద్యం



కరీంనగర్‌కల్చరల్: అధిక శ్రావణ మాసం సందర్భంగా కరీంనగర్ సాయినగర్‌లోని శ్రీ విజయగణపతి సాయి నాథ మహారాజ్‌కి శ్రీషిర్డిసాయి భక్త భజన మండలి మహిళలు 33రకాల స్వీట్లు నైవేద్యంగా సమర్పించారు. కన్వీనర్ నలుమాచు రాణి, చంద్రశేఖర్, శ్రీషిర్డీసాయి భక్త భజనమండలి సభ్యులు వనజ, అనిత, భారతి,సావిత్రి, సమత,రజిత, కవిత మౌనిక, రాధిక, పద్మ,పద్మిని, మధులత ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

తిమ్మాపూర్: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పశువులకు టీకాలు వేయించాలని మన్నెంపల్లి సర్పంచ్ మేడి అంజయ్య అన్నారు. గ్రామంలోని పాలకేంద్రం ఆవరణలో సంఘ అధ్యక్షుడు కమ్మం ఓదెలు ఆధ్వర్యంలో టీకాల పంపిణీని ప్రారంభించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఇక ట్రెజరీ జీతాలు!

బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర పడితే ఈ నెల నుంచే..
- ఏదైనా జాప్యం జరిగితే వచ్చే నెల నుంచి అమలు
- ఉద్యోగుల హోదాలు, వేతనాల వివరాలను సిద్ధం చేస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు
- అయోమయానికి తావు లేకుండా కొన్నిరోజులు బదిలీలు, పదోన్నతులపై ఆంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఉద్యోగులకు ప్రభుత్వ ట్రెజరీ నుంచి జీతాలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కుదిరితే ఈ నెల నుంచే ప్రభుత్వ జీతాలు అందేలా ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. దీనికి గవర్నర్ ఆమోదముద్ర పడగానే చట్టబద్ధత రానుంది. ఈ క్రమంలో అటు గవర్నర్ ఆమోద ముద్ర కోసం ఎదురుచూస్తూనే.. ఇదే సమయంలో ఆర్టీసీ ఉద్యోగులకు సంస్థ నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వం నుంచే జీతాలు విడుదలయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ తాజాగా ఆర్టీసీ ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని కోరింది. దీంతో.. ఉద్యోగి పేరు, హోదా (డెజిగ్నేషన్), పనిచేస్తున్న విభాగం, ఆధార్‌కార్డు, ప్రస్తుతం అందుకుంటున్న జీతం వివరాలను ఆధార సహితంగా జాబితా రూపంలో ఆర్టీసీ సిద్ధం చేస్తోంది.

ఈ నెల 16 తర్వాత బదిలీలు వద్దు

ఉద్యోగులు, జీతాల జాబితాలను ఆయా విభాగాధిపతులు సిద్ధం చేసి బస్‌భవన్‌కు పంపితే, అక్కడి నుంచి ఆర్థిక శాఖకు చేరనున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సిబ్బంది ఎక్కడివారు అక్కడే ఉంటే జాబితాలో అయోమయం లేకుండా ఉంటుందన్న ఉద్దేశంతో.. ఆర్టీసీలో ఈనెల 16వ తేదీ తర్వాత బదిలీలు, పదోన్నతులకు వీలు లేకుండా ఆదేశాలు వెలువడ్డాయి. పదోన్నతులు, బదిలీల వంటివి ఆలోగానే పూర్తి చేయాల్సి ఉంటుంది. 16వ తేదీ తర్వాత ఉద్యోగుల వివరాలను సిద్ధం చేసి, ఆర్థిక శాఖకు పంపనున్నారు. ఈ మేరకు ఆర్థికశాఖ జీతాల పద్దును సిద్ధంచేసి ట్రెజరీకి పంపుతుంది. ఆలోగా ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం వస్తే.. ప్రస్తుత నెల జీతాలను ట్రెజరీ నుంచి విడుదల చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. ఒకవేళ జాప్యం జరిగితే.. ఈ నెలకు ఆర్టీసీ నుంచే జీతాలిచ్చి, వచ్చే నెల నుంచి ట్రెజరీ ద్వారా విడుదల చేసే అవకాశం ఉంటుంది.

కొంతకాలం ప్రస్తుత వేతనాలే..!

ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమైనా కొంతకాలం ప్రస్తుతమున్న వేతనాలే అందనున్నాయి. ఎందుకంటే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలోని వివిధ హోదాలు, కేడర్లకు సమానంగా నిర్ధారించాల్సి ఉంటుంది. అప్పుడు ఆయా కేడర్లను బట్టి వేతనాల్లో మార్పులు చేర్పులు జరుగుతాయి. త్వంలో ప్రభుత్వం నియమించనున్న అధికారుల సబ్ కమిటీ దీనికి సంబంధించి విధివిధానాలను రూపొందించాల్సి ఉంటుంది. సదరు కమిటీ ఏర్పాటై, వివరాలు కోరగానే అందజేసేందుకు వీలుగా.. ఆర్టీసీ ఉన్నతాధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ఏపీలో ఇంతకుముందే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనంచేసిన నేపథ్యంలో.. అక్కడ అనుసరించిన పద్ధతులు, ఎదురైన ఇబ్బందులు, వాటి పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించేందుకు ఇటీవలే టీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులు విజయవాడ వెళ్లి వచ్చారు. తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు కూడా విజయవాడ వెళ్లి అధ్యయనం చేసి వస్తున్నారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు

- మరో పది మందిపై కూడా..
- ఎన్నికల అఫిడవిట్ ట్యాంపరింగ్‌లో నాంపల్లి కోర్టు ఆదేశాల మేరకు చర్యలు



మహబూబ్‌నగర్ క్రైం/సాక్షి, హైదరాబాద్: నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మరో పదిమందిపై కేసులు నమోదయ్యాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అఫిడవిట్ ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలలోగా కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు 11 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. నేడు రెండవ శనివారం, 13న ఆదివారం సెలవు ఉండటంతో 14న కోర్టుకు కేసుకు సంబంధించిన నివేదిక ఇవ్వడానికి పోలీసులు సిద్ధమైనట్లు సమాచారం

ఇదీ కేసు..

ఎన్నికల అఫిడవిట్ ట్యాంపరింగ్‌పై దాఖలైన కేసులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు రాష్ట్ర, కేంద్ర రిటర్నింగ్ అధికారులపై కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. 2018, డిసెంబర్‌లో ఎన్నికలు జరిగిన సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌ను శ్రీనివాస్‌గౌడ్ ట్యాంపరింగ్ చేశారని, అయినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన రాఘవేంద్రరాజు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో దావా వేశారు. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి, మంత్రి సహా సదరు అధికారులపై కేసు నమోదు చేయాలని తీర్పునిచ్చారు.

కేసు నమోదైంది వీరిపైనే..

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అప్పటి అధికారులు, ప్రస్తుత ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా అండర్ సెక్రెటేరియల్ రాజీవ్‌కుమార్, సంజయ్‌కుమార్, రాష్ట్ర ఎన్నికల అధికారి శశాంక్‌గోయల్, సెక్రెటరీ, ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, కలెక్టర్ వెంకట్రావు, డిప్యూటీ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీఓ శ్రీనివాసులు, టెక్నికల్ అధికారి వెంకటేష్‌గౌడ్, విశ్రాంత ఉద్యోగి సుధాకర్, న్యాయవాది రాజేంద్ర ప్రసాద్‌పై కేసు నమోదైనట్టు సమాచారం.

గిట్టనివారి అంతు చూస్తారట!

- ఇందుకోసమే వారికి అధికారం ఇవ్వాలట..
- బాబు, అతని దత్తపుత్రుడు, సొంత పుత్రుడిపై నిప్పులు చెరిగిన ఏపీ సీఎం జగన్

75 ఏళ్ల ముసలాయన, ఆయన దత్తపుత్రుడు, సొంత పుత్రుడు మాట్లాడుతున్న మాటలు వినండి. అధికారం ఇస్తే ఏం చేస్తారో వీళ్ల నోటితో వీళ్లే చెప్పారు. తనకు అధికారం ఇస్తే ఎవరినీ వదలడట.. తనకు గిట్టని వారి అంతు చూస్తాడట.. మట్టుబెడతాడట.. ఉగ్రరూపం చూపిస్తాడట.. ఏకంగా నరకం చూపిస్తాడట.. ఇందు కోసం ఆయనకు అధికారం ఇవ్వాలట! ఇదీ ఈ పెద్దమనిషి నైజం. ఇలాంటి ఆయన కోసం ఆయన దత్తపుత్రుడు పరుగెడుతున్నాడు. ఈ పెద్దమనిషికి ఏనాడైనా ప్రజలకు మంచి చేసిన చరిత్ర ఉందా? ఫలానా పని చేశానని చెప్పుకోవడానికి ఏమీ లేకే రెచ్చగొట్టి గొడవలు సృష్టించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. ఇదేం రాజకీయం? – సీఎం వైఎస్ జగన్



సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, అమలాపురం: 'చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంత పుత్రుడు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ఎక్కడా చెప్పడం లేదు. అలా చెబితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అందుకే గొడవలు సృష్టించి ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారు. యాత్రలు, సభల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు' అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. అమలాపురంలో వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగో విడత నిధుల విడుదల సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఈ రోజు నిజంగా వీళ్లందరి ఆలోచన ఏ స్థాయిలో ఉందో ప్రజలు గమనించాలని కోరారు. 'వారు మంచి చేస్తామంటే ప్రజలు నమ్మరని వాళ్లకు తెలుసు. కాబట్టే ప్రజల్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారు. అబద్ధాలు చెబుతున్నారు. ప్రతి రోజూ మోసాలు చేస్తారు. మీటింగులు పెట్టి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. చివరకు 47 మంది పోలీసులపై దాడి చేశారు. ఇలాంటి రాక్షసులకు ఎందుకు సెక్యూరిటీ ఇవ్వాలని అనిపించింది. ఎక్కడికక్కడ ప్రజల్ని రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్న వారి పట్ల మనమంతా చాలా జాగ్రత్తగా ఉండాలి' అని సూచించారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

శవ రాజకీయాలు చేస్తున్నారు.

- మొన్న అంగళ్లలో చంద్రబాబు తానే స్వయంగా రెచ్చగొట్టి గొడవలు చేయించారు. మళ్లీ పుంగనూరులో ఒక రూటుకు అనుమతి తీసుకొని ఆ రూట్లో పోకుండా పుంగనూరుకు వచ్చి వేరే రూట్లో పోవాలని ప్రయత్నించారు. అప్పుడే పోలీసులు మీకు అనుమతి లేదని.. అక్కడ అధికార పార్టీ వాళ్లు నిరసన కార్యక్రమం చేసుకుంటున్నారు.. లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తుందని చెప్పారు.
- దీంతో చంద్రబాబు వారిని ఇష్టమొచ్చినట్లు తిట్టాడు. వాళ్ల క్యాడర్‌ను రెచ్చగొట్టి 47 మంది పోలీసులను గాయపరిచారు. ఒక పోలీసు సోదరుడికి కన్ను కూడా పోగొట్టాడు. కారణం గొడవలు జరగాలి. శవ రాజకీయాలు చేయాలన్నదే ఆలోచన. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 వాళ్లదే. వాళ్లు ఏం చెబితే అది రాస్తారు. మైకులు పట్టుకొని దత్తపుత్రుడు రెడీగా ఉన్నాడు

నోరు తెరిస్తే అబద్ధాలే

- 2014కు ముందు ఈయన మాట్లాడిన మాటలు గుర్తుకు తెచ్చుకోండి. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు రావాలి అన్నారు. రైతుల రుణాలు మాఫీ కావాలంటే బాబు రావాలట. అక్కచెల్లెమ్మలకు పొదుపు సంఘాల రుణాలు మాఫీ కావాలంటే బాబు రావాలట. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే బాబు రావాలంటూ మోసం చేశాడు. రూ.85,712 కోట్ల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి, చేయకుండా రైతులను నిలువునా మోసం చేశాడు.
- రూ.14,207 కోట్ల పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశాడు. చివరకు చదువుకుంటున్న పిల్లలనూ వదల్లేదు. ఉద్యోగం ఇస్తాను లేదా ఉపాధి కల్పిస్తాను అని నిస్సిగ్గుగా అబద్ధాల వాగ్దానాలు చేశాడు. లేదంటే ఇంటింటికీ రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. ప్రతి ఇంటికీ రూ.2 వేలు అంటే ప్రతి పిల్లాడికీ ఏటా రూ.24 వేలు అలా ఐదేళ్లలో రూ.లక్షా 20 వేలు మోసం చేశాడు.

నాడు, నేడు అదే బడ్జెట్..

- చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇదే బడ్జెట్, ఇదే రాష్ట్రం. అప్పులు కూడా అప్పటికన్నా ఇప్పుడే తక్కువ. కేవలం సీఎంమారాడు. మీ బిడ్డకు ఓటు వేయకపోయినా ఫర్వాలేదు..కచ్చితంగా వారికి రావాల్సినవి రా వాలని ప్రయత్నం చేశాడు. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు.. అప్పట్లో ఇదే చంద్ర బాబు ఎందుకు చేయలేకపోయాడని ఆలోచించండి.
- మీ బిడ్డ మీ కోసం ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా రూ.2.31 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి మీ అకౌంట్లలోకి పంపించాడు. ఈ నాలుగేళ్లలో ఇంతటి సంక్షేమాభివృద్ధిని ఏనాడైనా చూశామా? చంద్రబాబు హయాంలో సామాజిక న్యాయం ఉందా? నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగా ఇన్ని పదవులు ఏనాడైనా ఇచ్చారా? ఏనాడైనా మీ బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచన చేశాడా? చివరకు పేదింటి పిల్లలు ఇంగ్లిష్ మీడియం చదవాలంటే కూడా వద్దన్న చరిత్ర ఆయనది.
- చంద్రబాబు అధికారంలో ఉండగా ఇలా 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చి.. ఇళ్లు కట్టించడం ఎప్పుడైనా చేశారా? ఇలా చేయలేకపోయిన ఈ 75 ఏళ్ల ముసలాయన వాటిని అడ్డుకోవడంలో మాత్రం ముందుంటారు. దత్తపుత్రుడు ఎందుకిలా పరుగెడుతున్నాడంటే ఆయన సీఎం కావడానికి కాదట. ఈ ముసలాయన్ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టడానికట. ఇలాంటి వ్యక్తి సీఎం అయితే మనకు మంచి జరుగుతుందా?
- మీకు మంచి చేయడానికి వస్తున్న వలంటీర్లను కూడా వదలకుండా ఎంత దారుణంగా మాట్లాడారు. రాబోయే రోజుల్లో వీళ్ల నీచ రాజకీయాలు, అబద్ధాలు ఇంకా ఎక్కువ అవుతాయి. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారు కొనిస్తామని చెబుతారు. నాకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, దత్తపుత్రుడు అండగా లేరు. మీ బిడ్డ నమ్ముకున్నది దేవుడి దయ, మీ దీవెనలనే. మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటే మాత్రం మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడండి.

భావితరాల కోసం నీటి వనరులను కాపాడండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భావితరాల వారి కోసం నీటివనరులను కాపాడాల్సిన అవసరం ఉందని, లేదంటే వారు క్షమించరని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని ప్రతిసారి చెబుతున్నా పట్టనట్లు వ్యవహరించడం సహించరానిదని వ్యాఖ్యానించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలోని చెరువులు, కుంటల బఫర్ జోన్లపై అఫిడవిట్ అందజేయాలని ఆదేశించింది. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటల బఫర్ జోన్లు ఏర్పాటు చేయాలని, ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను నిర్ధారించాలని గతంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఆదేశించినా నివేదిక అందజేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. చెరువుల బఫర్ జోన్లను గుర్తించారా?, హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు ఎన్ని? అని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. లేక్ ప్రొటెక్షన్ కమిటీ తరఫు న్యాయవాది స్పందిస్తూ హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3,532 సరస్సులు ఉన్నాయని, 239 సరస్సులకు బఫర్ జోన్లు గుర్తించామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. అఫిడవిట్ వేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను 19వ తేదీకి వాయిదా వేసింది.

కేసులో కావాలనే ఇరికించారు.. బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పిటిషన్లు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో తమను సీబీఐ కావాలనే ఇరికించిందని, తమకు బెయిల్ ఇవ్వాలని వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సీబీఐ కోర్టు తమ బెయిల్ పిటిషన్లను కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్యకేసులో దర్యాప్తు పూర్తయిందని, సీబీఐ అభియోగ పత్రాన్ని కూడా దాఖలు చేసిందని తెలిపారు. ఈ కేసులో పిటిషనర్లను అక్రమంగా ఇరికించారని, వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు కోర్టుకు సమర్పించలేదన్నారు. ఇప్పటికే 5 నెలలకు పైగా జైలులో ఉన్నారని, భాస్కర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని చెప్పారు. పలుమార్లు జైలు అధికారులు ఆస్పత్రుల్లో భాస్కర్‌రెడ్డికి పరీక్షలు కూడా నిర్వహించారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది.

సదర్మాట్, కడెం ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సదర్మాట్‌ను పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఖానాపూర్: నియోజకవర్గంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే సదర్మాట్, కడెం ప్రాజెక్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. ఖానాపూర్ పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంత భవనంలో శుక్రవారం మాట్లాడారు. సదర్మాట్ బ్యారేజీ పనులను వెంటనే పూర్తిచేయడంతోపాటు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల చిరకాల కోరిక సదర్మాట్ ప్రత్యేక కాలువను ఏర్పాటు చేయాలన్నారు. 2016లో పొన్కల్‌లో ప్రారంభించిన బ్యారేజీకి నేటికి కనీసం గేట్లు కూడా ఏర్పాటు చేయాలేదన్నారు. అధిక వర్షాలతో సదర్మాట్ కాలువకు పండిన గండ్లు త్వరగా పూడ్చాలన్నారు. గతేడాది మరమ్మతులు చేయక ఆయకట్టుకు నీరందలేదని తెలిపారు. కడెం ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రాజెక్టుకు అదనపు గేట్లతోపాటు రేడియాలజీ గేట్లను ఏర్పాటు చేయాలన్నారు. డ్యాం ఎగువన ఉన్న భూములు ముంపునకు గురికాకుండా డ్యాంలోని సిల్ట్ తొలగించాలని సూచించారు. అధిక వర్షాలతో కడెం ప్రాజెక్టుకు ముప్పు వాటిల్లకుండా ఎగువన నేరడిగొండ కుంటాల ప్రాంతంలో కుప్టి ప్రాజెక్టును నిర్మించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతాంగం ఇబ్బందులు పడుతోందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రాజెక్టులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పేరుకే నియోజకవర్గమైన ఖానాపూర్ కేంద్రంలో పాలకవర్గం ఏర్పాటైన నాటి నుంచి ప్రారంభించిన రోడ్డు వైడింగ్ పనులు పాలకవర్గం గడువు ముగిసేలోగా కూడా పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. రోడ్డు పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టణ పరిధిలోని ప్రజలకు ఇక్కట్లు ఎదురుకాకుండా చూడాలని కోరారు. అంతకుముందు మేడంపల్లి గ్రామంలో సదర్మాట్ ఆనకట్టను సందర్శించడంతోపాటు ఖానాపూర్ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్, మహిళ కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దయానంద్, చిన్నం సత్యం, మడిగెల గంగాధర్, యాసుఫ్‌ఖాన్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, కిశోర్‌నాయక్, కడార్ల గంగనర్సయ్య, జంగిలి శంకర్, తోట సత్యం, జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హలో.. నేను ఏసీబీ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నా..

- ఓసారి నన్ను కలవండి
- అధికారులకు ఫోన్‌కాల్స్
- రెవెన్యూ శాఖ టార్గెట్

జగిత్యాల: 'నేను ఏసీబీ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నా.. ఎన్నిరోజుల్నుంచి ఇక్కడ పనిచేస్తున్నావు.. భూ కొలతల కోసం వచ్చిన దరఖాస్తులు ఎన్ని ఉన్నాయి.. అందులో ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా?.. మీపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి.. మీరు నన్ను ఓసారి కలవండి' అంటూ జిల్లాలోని ఓ సర్వే అధికారికి ఇటీవల ఫోన్‌కాల్ వచ్చింది. ఆందోళన చెందిన ఆ అధికారి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా చేరవేశారు.

జిల్లావ్యాప్తంగా..

జిల్లాలో అత్యధికంగా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు లక్ష్యంగా కొందరు ఏసీబీ అధికారులమంటూ ఫోన్లు చేస్తున్నారు. మీపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని బెదిరిస్తున్నారు. జిల్లాలోని రెవెన్యూ శాఖ ఉద్యోగులు లక్ష్యంగా ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఈ విషయాన్ని బాధితులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. కానీ, ఎవరికీ ఫిర్యాదు చేయలేకపోతున్నారు.

నిజమేనని..

ఏసీబీ అధికారులమంటూ ఉద్యోగులకు ఫోన్లు రావడంతో కంగుతింటున్న అధికారులు.. నిజమైన ఏసీబీ అధికారులు కావచ్చని భయపడుతున్నారు. వారి సూచన మేరకు కలుస్తామంటూ అభయం ఇస్తున్నట్లు తెలిసింది. కొందరైతే ఏకంగా బేరసారాలు కుదుర్చుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఉన్నతాధికారులకు సమాచారం

మండలాలు, డివిజన్‌స్థాయి అధికారులకు అవినీతి నిరోధక శాఖ అధికారుల ఫోన్‌కాల్స్ రావడంతో బాధితులు జిల్లాస్థాయి అధికారులకు ఫోన్‌చేస్తూ తమ గోడు వెళ్లబోసుకుంటున్నారని తెలిసింది. 'సార్.. ఏసీబీ అధికారులమని ఫోన్ చేసి అన్ని వివరాలు అడుగుతున్నారు.. ఏం చేయాలి' అని ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నట్లు తెలిసింది. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ ద్వారా అన్ని వివరాలు రాబట్టాలని, ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారని సమాచారం. కొందరు ఎవరికీ చెప్పుకోలేక.. ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని తెలిసింది.



గతంలోనూ...

గతంలోనూ ఓ తహసీల్దార్‌కు ఇలాంటి ఫోన్‌కాల్స్ వచ్చాయి. విచారణ చేయడంతో ఫేక్‌కాల్స్‌ని తేలింది. ఇవి కూడా ఫేక్ కాల్స్ అయి ఉంటాయని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. అయితే, బాధితులు లోలోపల ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

రూ.3వేల కోసం మామను చంపిన అల్లుళ్లు



భీమయ్య(ఫైల్)



వివరాలు నమోదు చేస్తున్న సీఐ నాగరాజు

పెంచికల్‌పేట్: అల్లుడు.. మేనల్లుడు కలిసి మామను హత్య చేశారు. కేవలం రూ.3వేల కోసం కర్రతో దాడి చేసి.. సీసీ రోడ్డుపై పడేయడంతో తలకు తీవ్ర గాయమై మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలం లోడుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతురాజుల భీమయ్య(52) పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. కూతురు సరితను ఇదే గ్రామానికి చెందిన సేగం తిరుపతికి ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించాడు. తిరుపతి ఏ పనీ చేయకుండా తిరుగుతూ ఉంటాడు. ప్రతీరోజు భీమయ్య వద్ద రూ.100, రూ.200 తీసుకుని మద్యం తాగుతుంటాడు. ఉదయం సేగం తిరుపతి ఇంటి ముందు నుంచి భీమయ్య కాలినడకన వెళ్తున్న క్రమంలో అల్లుడు తిరుపతి, కన్నెపల్లి మండలం వీగామ గ్రామానికి చెందిన మరో అల్లుడు(అక్క కొడుకు) బుర్స మల్లేష్‌లు అడ్డగించారు. రూ.3వేలు ఇవ్వాలని ఆతడితో వాగ్వాదానికి దిగి కర్రతో దాడి చేశారు. అక్కడి నుంచి తప్పించుకున్న వెళ్తున్న క్రమంలో మళ్లీ అడ్డగించి సీసీ రోడ్డుపై రెండుసార్లు కింద పడేశారు. దీంతో భీమయ్య తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. మృతుడి భార్య రాజక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ నాగరాజు తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిస్రీన్ సుల్తాన్

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిస్రీన్ సుల్తాన్ విమర్శించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారంగ సమగ్ర అభివృద్ధికి చేపట్టిన జీపు యాత్ర బెల్లంపల్లిలో మొదలై శుక్రవారం మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వసతిగృహాలు అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇంజినీరింగ్, బెల్లంపల్లిలో పీజీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, ఐటీఐలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి అనిల్, జిల్లా కమిటీ సభ్యులు అభినవ్, సత్యనారాయణ, రాజు, దినేష్ రాకేష్ పాల్గొన్నారు.

సమావేశానికి ప్రజాప్రతినిధుల డుమ్మా..!

లక్సెట్టిపేట: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ అన్నం మంగ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా, ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం అధికారులు, ప్రజాప్రతినిధులు సమయపాలన పాటించకపోవడంతో ఆలస్యమైంది. 18మంది సర్పంచులు, 14మంది ఎంపీటీసీలు ఉండగా 3సర్పంచులు, 2ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. మండల అభివృద్ధికి, గ్రామాల్లోని సమస్యలపై నిర్వహించాల్సిన సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. పలు సమస్యలపై చర్చించి మమా అనిపించారు. జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

యుద్ధభూమిని ముద్దాడిన ఎర్రనిపొద్దు గద్దర్



గద్దర్ సంస్మరణ సభలో కవులు, రచయితలు

కరీంనగర్ కల్చరల్: తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమంలో యుద్ధభూమిని ముద్దాడిన ఎర్రనిపొద్దు, అస్తమించని విప్లవ సూర్యుడు గద్దర్ అని జిల్లా సాహితీ సంస్థల సమాఖ్య సాహితీగౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్‌తో పాటు పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గద్దర్‌సంస్మరణ సభలో గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. గద్దర్‌కు గద్దరే పోటీ అని, ఆయన మళ్లీ పుట్టి ఆడిపాడాలని ఆకాంక్షించారు. తెరవే అధ్యక్షుడు కందుకూరి అంజయ్య, రచయిత ఎండీ ఖాలిద్ గద్దర్ గీతాలు ఆలపించారు. కవులు అనిల్‌కుమార్, దొమ్మాటి శంకరప్రసాద్, సజ్జన కమలాకరరావు, కాందూరి శ్రీనివాసాచార్యులు, రేగులపాటి విజయలక్ష్మి, నీలగిరి అనిత, జి.ఆముక్తమాల్యద, కోరుకంటి శశికిరణ్మయి, భవానీశర్మ, ఎండీ.ఖాలిద్, కాందూరి వేంకటేశ్వర్లు, గుంజపడుగు హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఏషియన్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక



స్వప్నికను అభినందిస్తున్న వీసీ మల్లేశం

కరీంనగర్‌స్పోర్ట్స్: షార్జాలో ఈ నెల 16 నుంచి 21వరకు జరుగనున్న ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలకు కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఆర్.విరించి సప్నిక ఎంపికైంది. జూన్ 6 నుంచి 21 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. 4వ స్థానం సాధించి ఏషియన్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికై ంది. స్వప్నికను శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్లర్ ఎస్.మల్లేశం, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీరుద్దీన్, ప్రొఫెసర్ ప్రభాకర్‌రావు, ఎస్సారార్ ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్లు నాగేశ్వర్ రావు, విజయ్‌కుమార్ అభినందించారు.

నైపుణ్యశిక్షణకు దరఖాస్తులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ రాంనగర్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్, డొమెస్టిక్ ఎలక్ట్రిషన్, సీసీటీవీ, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులలో శిక్షణకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీవైఎస్ఓ కీర్తి రాజవీరు తెలిపారు. నైపుణ్య శిక్షణకు హాజరయ్యే వారు 7వ తరగతి ఆ పైబడిన తరగతి పాస్, ఫెయిల్ అయి 18ఏళ్లు నిండి ఉండాలని అన్నారు. వివరాలకు 9640967943, 9949850360 నంబరును సంప్రదించాలని సూచించారు.

నవోదయకు గడువు పెంపు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు సమర్పించే గడువు తేదీని ఈ నెల 17కు పొడిగించారు. అగస్టు 10 చివరి తేదీ ఉండగా, మరో ఏడు రోజుల పాటు గడువును పొడగిస్తున్నట్లు విద్యాలయ సమితి ప్రకటించింది. వచ్చే (2024-25) విద్యా సంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30 వరకు 'ఓపెన్' ఫీజు గడువు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఓపెన్‌టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసింది. అక్టోబర్‌లో జరిగే ఈ పరీక్షల ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. ఈనెల 21నుంచి 30వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు. రూ.25 అపరాధ రుసుంతో ఈనెల 31నుంచి సెప్టెంబర్ 4వరకు, రూ.50 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 5నుంచి 9వరకు చెల్లించవచ్చని తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 12-8-2023

అందరూ వెళ్లే దారిలో వెళ్లాలనిపించదు.
కొత్తగా ఏదైనా చేస్తే బాగుంటుందనే ఆలోచన
కుదురుగా ఉండనీయదు.
జీవనం పరీక్షగా అనిపిస్తుంటుంది.
'అవకాశాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయా?
మనమే అవకాశాలను అందిపుచ్చుకోవాలా?!
ఈ విధమైన సంఘర్షణే అరటినార వైపుగా
అడుగులు వేయించింది' అంటారు
బళ్లారి వాసి విశ్వనాథ్.
అరటినారతో గృహోపకరణాలను
తయారుచేస్తూ తమ గ్రామమైన కంప్లిలో
20 మంది మహిళలకు
ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.
ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఎకోఫ్రెండ్లీ
వస్తువుల ప్రదర్శనలో స్టాల్ ఏర్పాటు చేసిన
విశ్వనాథ్ తన ప్రయత్నం వెనక ఉన్న కృషిని వివరించారు.


విశ్వనాథ్


తయారీలో మహిళలు


అరటి నార ఉత్పత్తులతో మహిళా బృందం

అరటి నారతో ఆనందాన్ని అల్లుకున్నాడు!





''ప్రయత్నం లేకుండా ఫలితాలను ఆశించలేం అని తెలుసు. కానీ, కొంతకాలం మైండ్‌లో ఏ పని మీద దృష్టి పెట్టాలో తెలియకుండా ఉంటుంది. నా విషయంలో అదే జరిగింది. బీటెక్ చదువును మధ్యలో వదిలేశాను. ఇంట్లో అమ్మానాన్నలకు ఏ సమాధానమూ చెప్పలేక బెంగళూరులో ఏదైనా పని చేసుకోవచ్చని కొన్ని రోజులు ప్రయత్నించాను. ఏ పనీ సంతృప్తిని ఇవ్వలేదు. కరోనాటైమ్‌లో ఇంటి వద్దే కాలక్షేపం. బోలెడంత సమయం ఖాళీ. చదువు పూర్తి చేయలేకపోయానని అమ్మానాన్నల ముందు గిల్టీగా అనిపించేది.

అరటితోటల్లోకి..

మా ప్రాంతంలో అరటితోటలు ఎక్కువ. నా చిన్నతనంలో అరటి నుంచి తీసే నారతో అమ్మావాళ్లతో కలిసి తాళ్లు, ఏవో ఒకట్రెండు ఐటమ్స్ తయారు చేసిన జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ, ఎవరూ వాటి మీద పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. కాలక్షేపానికి అరటి నారతో రాఖీలు, కీ చెయిన్లు తయారు చేయడం మొదలుపెట్టాను. మా ఊరైన కంప్లిలో మహిళలు ఊలు దారాలతో క్రొచెట్ అల్లికలు చేస్తుంటారు. ఆ క్రొచెట్‌ను అరటినారతో చేయిస్తే ఎలా ఉంటుంది..? అనే ఆలోచన వచ్చింది. ముందు నేను ప్రయత్నించాను. క్రోచెట్ అల్లికలను నేర్చుకున్నాను. బ్యాగులు, బుట్టలు చేయడం మొదలుపెట్టాను. ముందైతే జీరో వేస్ట్ ప్రొడక్ట్స్ అనే ఆలోచన ఏమీ లేదు. నచ్చింది చేసుకుంటూ వెళ్లడమే. అయితే, అరటినారను తీసి, బాగా క్లీన్ చేసి, ఎండబెట్టి, ప్రత్యేక పద్ధతిలో దీనిని తయారు చేస్తే ఎక్కువ కాలం మన్నుతాయి అనే రీసెర్చ్ సొంతంగా చేశాను. సిద్ధం చేసుకున్న అరటినారను క్రొచెట్ అల్లే మహిళలకు ఇచ్చి, నాకు కావల్సిన వస్తువులు తయారు చేయించడం మొదలుపెట్టాను.

రాఖీతో మొదలు...

నేను చేసే పనిని ఒక ప్లానింగ్‌గా రాసుకొని, బ్యాంకువాళ్లను సంప్రదిస్తే 50 వేల రూపాయలు రుణం మంజూరు చేశారు. ఆ మొత్తంతో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని, అరటి నార తీసి, ఎండబెట్టడం.. ప్రక్రియకు వాడటంతోపాటు మహిళలు వచ్చి అల్లికలు చేసేలా జాగ్రత్తలు తీసుకున్నాను. మూడేళ్ల క్రితం ఇదే టైమ్‌లో మార్కెట్‌కి వెళ్లినప్పుడు రాఖీలను చూశాను. అవన్నీ కాటన్, ప్లాస్టిక్ మెటీరియల్‌తో చేసినవి. అవి చూసి రాఖీలను అరటి నార, మట్టి ఉండలు, గవ్వలు, సీడ్ బాల్స్, తాటి ఆకులతో తయారు చేశాను. తెలిసిన వారికి వాటిని ఇచ్చాను. ప్రతి ఉత్పత్తి జీరో వేస్ట్ మెటీరియల్‌తో రూపొందించడంలో శ్రద్ధ తీసుకున్నాను. 'విష్‌నేచర్' పేరుతో హస్తకళాకారుల ఫోరమ్ నుంచి ఐడీ కార్డ్ ఉంది. దీంతో ఎక్కడ ఎకో ఫ్రెండ్లీ ఎగ్జిబిషన్స్, స్టాల్స్‌కు అవకాశమున్నా నాకు ఇన్విటేషన్ ఉంటుంది. నా వీలును, ప్రొడక్ట్స్‌ను బట్టి స్టాల్ ఏర్పాటు చేస్తుంటాను. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఆర్డర్స్‌ను బట్టి ఇతర రాష్ట్రాలు, విదేశాలకూ మా అరటినార ఉత్పత్తులు వెళుతుంటాయి.

వంద రకాలు..

ఊలు దారాలతో క్రొచెట్ చేసే మహిళలు ఇప్పుడు అరటినారతో గృహాలంకరణ వస్తువులను తయారు చేస్తున్నారు. హ్యాండ్‌బ్యాగ్స్, ఫోన్ బ్యాగ్స్, క్లచెస్, మిర్రర్, టేబుల్ మ్యాట్స్, ప్లాంటేషన్ డెకార్, పెన్ హోల్డర్స్, తోరణాలు, బుట్టలు... దాదాపు 100 రకాల వస్తువులను తయారు చేస్తుంటాం. ఈ ఉత్పత్తులు ఐదేళ్లకు పైగా మన్నికగా ఉంటాయి. నీటిలో తడిసినా పాడవవు. అయితే, తడి ఉన్న ఉత్పత్తులను నీడన ఎక్కడో పడేస్తే మాత్రం ఫంగస్ చేరుతుంది. శుభ్రపరిచినా ఎండలో బాగా ఆరబెట్టి, తిరిగి వాడుకోవచ్చు. ఈ జాగ్రత్తలు తీసుకోవాలని ముందే చెబుతుంటాను. ఇరవైమంది మహిళలు ఒక్కొక్కరు నెలకు పది నుంచి పదిహేను వేల రూపాయల దాకా ఆదాయం పొందుతున్నారు. గుర్తింపు, ఆదాయాన్ని పొందే మార్గాన్ని కనుక్కోవడంతో కొంతమంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ పనిని మరింత విస్తృతం చేయాలన్న ఆలోచనతో నేచరల్ ఫేస్ స్క్రబ్స్, ఇతర ఎకో ఫ్రెండ్లీ ఐటమ్స్ ఒక ప్యాకేజీగా ఇవ్వాలన్న తపనతో పని చేస్తున్నాను. నా పనిని మెచ్చుకున్నవారిలో బాలీవుడ్ నటి విద్యాబాలన్, కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ వంటి ప్రముఖులు ఉన్నారు. మూడేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నం, నా పనితీరుతో అమ్మానాన్నలు సంతోషంగా ఉన్నారు'' అని వివరించారు విశ్వనాథ్.

– నిర్మలారెడ్డి

గెట్ రెడీ ఫర్ ఆగస్టు 15



పిల్లలు నోరు తెరిచి దేశం గురించి మాట్లాడే రోజు ఆగస్టు 15.
గొంతెత్తి దేశభక్తిని గానం చేసేరోజు మన స్వాతంత్ర్య దినోత్సవం.
సంవత్సరంలో 364 రోజులు వారు ఫోనులోనో గేమ్స్‌లోనో మునిగి ఉన్నా
ఈ ఒక్కరోజైనా వారి చేత దేశం గురించి మాట్లాడించాలి.
దేశ ఘనతను పాడించాలి. తల్లిదండ్రులు తమ పిల్లల చేత
కనీసం ఒక పాట పాడించాలి. ఐదు నిమిషాలు మాట్లాడించాలి.
ఏ పాటలు? ఏ మాటలు? ఇవిగోండి సలహాలు...

ఎలుగెత్తి చెబుదాం గొంతెత్తి పాడుదాం



'దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా వొట్టి మాటలు కట్టిపెట్టొయ్ గట్టిమేల్ తలపెట్టవోయ్'... అన్నారు గురజాడ. 'దేశమును ప్రేమించాలి' అని పిల్లలకు తెలుసు. కాని దేశంలో మంచి పెరిగితేనే అది ప్రేమించ దగ్గ దేశమవుతుందని, దేశంలోని ప్రతి ఒక్కరికీ మేలు జరిగినప్పుడే అది గొప్ప దేశమవుతుందని గురజాడ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇలాంటి ఒక పాటైనా పిల్లల చేత పాడించకపోతే తల్లిదండ్రుల పెంపకంలో నిర్లక్ష్యం ఉన్నట్టే అర్థం. 'చెట్టపట్టాల్ పట్టుకొని దేశస్తులంతా నడవ వలెనోయ్... అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నీ మెలగవలెనోయ్' అని కూడా గురజాడ అన్నారు. ఇవాళ్టి సందర్భంలో పిల్లలకు ఈ పాట నేర్పి, దాని అర్థం మనసుకు ఎక్కించకపోతే భవిష్యత్తులో వారు 'దేశమంటే మట్టి' అనుకుంటారు. 'మనుషులు' అనుకోరు. అందుకే తల్లిదండ్రులు పూనుకుని తమ ప్రతి పిల్లల చేత అయితే తమ అపార్ట్‌మెంట్‌లో, లేదా తమ వీధిలో, ఇంట్లో ఏదో విధాన ఒక పాట పాడించడం, దేశం గురించి తప్పకుండా నాలుగు ముక్కలు మాట్లాడించడం అవసరం. పిల్లలు సరిగ్గా చెప్తే వింటారు. నేర్చుకుంటారు. వారికి ఆ వేళ విశేషమైన దుస్తులు, దేశభక్తుల వేషాలు వేస్తే ఎంతో సంబరపడతారు. ఆ స్ఫూర్తిని నింపుకుంటారు. ఆగస్టు 15 అంటే సెలవు దినం, ఆ రోజు ఎటైనా వెళ్దొద్దాం అని ప్లాన్ చేసుకునే తల్లిదండ్రులు పిల్లలను దేశం వైపు నడిపించడంలో నిర్బాధ్యతగా ఉన్నట్టే లెక్క.

ఎన్నో పాటలు

పిల్లలు నేర్చుకుని పాడటానికి తెలుగు, హిందీ భాషల్లో ఎన్నో పాటలు ఉన్నాయి. ప్రయివేటు గీతాలతో పాటు సినీ గీతాలు కూడా ఉన్నాయి. వీటిలో ఏదో ఒకటి నేర్పించవచ్చు. 'దేశమును ప్రేమించుమన్నా' (గురజాడ), 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' (శంకరంబాడి), 'జయ జయ ప్రియభారత జనయిత్రి' (దేవులపల్లి), 'తేనెల తేటల మాటలతో' (ఇంద్రగంటి శ్రీకాంత శర్మ), 'మాకొద్దీ తెల్లదొరతనము' (గరిమెళ్ల), 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడ' (వేములపల్లి శ్రీకృష్ణ)... ఇవన్నీ ఉన్నాయి. ఇక సినిమా పాటల్లో 'పాడవోయి భారతీయుడా' (శ్రీశ్రీ) పిల్లలు పాడటానికి సులువుగా ఉంటుంది. మన పిల్లలకు 'వందేమాతరం', 'జనగణమన', 'సారే జహాసే అచ్ఛా' కనీసం వచ్చునా రావా అన్నది కూడా గమనించుకుంటే మంచిది.

త్యాగఫలం తెలియచేయాలి

ఇవాళ మనం పీలుస్తున్న ప్రతి శ్వాస మన పూర్వీకుల రక్తం, చెమట, త్యాగం ఫలితం. మహానుభావులు వారి జీవితాలను త్యాగం చేసి భావితరాల చేతుల్లో పెట్టారు దేశాన్ని. ఎంతో విలువైన ఈ దేశ సంపద, దేశ సంస్కృతి పట్ల పిల్లలకు గౌరవం, బాధ్యత తెలియాలంటే వారిలో జాతీయ భావాలు, సుహృద్భావం కలగాలంటే ఆగస్టు 15ను ఒక సందర్భంగా చేసుకుని తెలియచేయాలి. ఇవాళ దురదృష్ట వశాత్తు కొన్ని ఇళ్లల్లో పిల్లలకు తెలుగు నేర్పించడం లేదు. కొన్ని స్కూళ్లలో పిల్లలు జెండా వందనం రోజు జైహింద్ చెప్తే సరిపోతుందనుకుంటున్నారు. కనీసం ఒక బృంద గానంలో కూడా పాల్గొనడం లేదు... వక్తృత్వంలో నాలుగు ముక్కలు దేశం గురించి మాట్లాడటం

దేశం గురించి మాట్లాడాలి

పిల్లలు దేశం గురించి, దేశ ఔన్నత్యం గురించి మాట్లాడాలి. మాట్లాడటంలో వారికి తర్ఫీదు ఇవ్వాలి. ఏం మాట్లాడాలన్న విషయంలో కొంచెం సాయం చేసినా పర్వాలేదు. 'భిన్నత్వంలో ఏకత్వం', 'మన జాతిపిత', 'దేశాభ్యున్నతికై పర్యావరణ పరిరక్షణ', 'డిజిటల్ ఇండియా', 'స్త్రీ శక్తి', 'సామాజిక బాధ్యత'... ఇలా ఏదో ఒక అంశం ఇచ్చి ఐదు నిమిషాలు మాట్లాడేలా చేయాలి. ఇది ఒక సంప్రదాయం. ఒక తరం నుంచి మరో తరానికి అందాలి. అమృతోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జెండా ఎగరేయడంలో పిల్లలను భాగస్వాములను చేయాలి.

దేశ పతాకం పిల్లల చేతుల్లో రెపరెపలాడాలి. దేశభవిష్యత్తుకు వారే విధాతలు కావాలి.

గెలుపు దారి


ప్రపంచంలోని ఎన్నో అద్భుత నిర్మాణాల వెనుక
రోమా అగర్వాల్ సృజనాత్మక కృషి ఉంది.
'నీ ఆసక్తే నీ గురువు' అంటున్న రోమా అగర్వాల్
ప్రపంచంలోని ప్రసిద్ధ స్ట్రక్చరల్ ఇంజనీర్ (ఎనలైజ్, డిజైన్, ప్లాన్, రీసెర్చ్)లలో ఒకరిగా పేరు తెచ్చుకుంది.
చరిత్రలో ఎన్నో అద్భుతమైన నిర్మాణాలు ఉన్నాయి.
ఆ అద్భుత నిర్మాణాలకు ఎంతో చరిత్ర ఉంది.
ఆ చరిత్రను ఔపోసన పట్టినవాళ్లే విజేతలు అవుతారు.
రోమా అగర్వాల్ ఈ కోవకు చెందిన విజేత...

అద్భుత నిర్మాణ శిల్పి


రోమా అగర్వాల్

ముంబైలో పుట్టిన రోమా అగర్వాల్‌కు చిన్నప్పుడు 'లెగో' ఆడడం అంటే ఇష్టం. స్కూల్ రోజుల నుంచి తనకు ఫిజిక్స్, మ్యాథ్స్‌లు ఆసక్తికరమైన సబ్జెక్ట్‌లు. ఎలక్ట్రికల్ ఇంజనీర్ అయిన తండ్రి, అగర్వాల్‌కు వచ్చే ఎన్నో సందేహాలను క్షణాల్లో తీర్చేవాడు.

'యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్'లో ఫిజిక్స్‌లో డిగ్రీ చేసిన అగర్వాల్ 'ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్'లో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో ఎంఎస్‌సీ చేసింది.



స్ట్రక్చరల్ ఇంజనీర్‌గా పేరు తెచ్చుకున్న అగర్వాల్ మంచి రచయిత్రి కూడా. గతంలో బిల్ట్: ది హిడెన్ స్టోరీస్ బిహైండ్ అవర్ స్ట్రక్చర్స్, హౌ వాజ్ దట్ బిల్ట్? అనే పుస్తకాలు రాసింది. తాజాగా 'నట్స్ అండ్ బోల్ట్స్' పేరుతో పుస్తకం రాసింది. చక్రం నుంచి లెన్స్ వరకు ప్రపంచాన్ని మార్చేసిన

ప్రపంచాన్ని మార్చిన ఏడు ఆవిష్కరణలు

ఏడు శాస్త్రీయ ఆవిష్కరణలను ఈ పుస్తకంలో ప్రస్తావించింది. అసాధ్యం కాదు అనుకున్న దాన్ని సాధ్యం చేసి చూపించిన అసాధారణ శాస్త్రవేత్తలు, ఇంజనీర్‌ల గురించి రాసిన ఈ పుస్తకం యువతరానికి శాస్త్రీయ విషయాలపై ఆసక్తి కలిగించేలా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

యూనివర్శిటీలలో పాఠాల కంటే ప్రాక్టికల్ వర్క్ ఎక్కువగా ఉండేది. దీనికితోడు అద్భుతమైన ప్రతిభ ఉన్న విద్యార్థులతో స్నేహం తనకు ఎంతగానో ఉపకరించింది.

చదువు పూర్తయిన తరువాత ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ 'డబ్ల్యూ ఎస్పీ'లో చేరింది. ఒక ఫుట్‌బ్రిడ్జి కోసం పని చేయడం తన ఫస్ట్ ప్రాజెక్ట్. లండన్‌లోని ది షార్డ్ (షార్డ్ లండన్ బ్రిడ్జి) ప్రాజెక్ట్ కోసం ఆరు సంవత్సరాలు పని చేసింది. ఈ ప్రాజెక్ట్‌ను తన కెరీర్ హైలైట్‌గా చెబుతుంటుంది అగర్వాల్.

'ఇలాంటి ప్రాజెక్ట్‌లు కెరీర్‌లో అరుదుగా మాత్రమే వస్తాయి' అంటుంది. 'ఒక ప్రాజెక్ట్ కోసం పనిచేయడం ఆషామాషీ విషయం కాదు. ఎంతో మంది ఇంజనీర్‌లు, ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెంట్‌లు, సర్వేయర్‌లు, క్రియేటివ్ విజన్ ఉన్నవారితో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరికీ తమవైన నైపుణ్యాలు, ఆలోచనా విధానం ఉంటుంది. అందరినీ సమన్వయం చేసుకుంటూ ప్లానింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. పేపర్ మీద నిర్మాణ నమూనాను గీసుకోవడం నుంచి అది నిర్మాణ రూపంలో కనువిందు చేసే వరకు ప్రతి దశలో ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది' అంటుంది అగర్వాల్.

తాను 'డబ్ల్యూ ఎస్పీ'లో పనిచేస్తున్నప్పుడు ఆ సంస్థలో స్త్రీలు తక్కువగా ఉండేవారు. 'ది షార్డ్' కోసం పనిచేస్తున్న రోజుల్లో 'ఈ రకంగా పనిచేస్తున్నాం' అని వివరించడానికి స్కూల్స్‌కు వెళ్లి క్లాసులు నిర్వహించేది అగర్వాల్. తాను చెబుతున్నప్పుడు అమ్మాయిలలో ఎలాంటి ఆసక్తి లేకపోవడాన్ని గమనించి బాధగా అనిపించేది.

'అద్భుతమైన కెరీర్‌ను అమ్మాయిలు మిస్ అవుతున్నారు' అనుకునేది అగర్వాల్.

'అయ్యో!' అనుకోవడానికే పరిమితం కాకుండా 'యువర్ లైఫ్ క్యాంపెయిన్' ఫౌండింగ్ మెంబర్‌గా ఎన్నో పాఠశాలల్లో సైన్స్, ఇంజనీరింగ్‌లపై ఆసక్తి కలిగేలా, పెరిగేలా అవగాహన సదస్సులు నిర్వహించింది. ఈ సదస్సులు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. సైన్స్, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి టీవీలలో ఎన్నో ప్రోగ్రామ్స్ చేసింది.

'ఒకప్పుడు ఇంజనీరింగ్ చేసిన మహిళలు అంటూ ఉండేవారు కాదు. ఆ తరువాత వేళ్ల మీద లెక్కబెట్టగలిగే స్థాయిలో ఉండేవారు. ఆ తరువాత వారి సంఖ్య పెరుగుతూ పోయింది. రాత్రికి రాత్రే మార్పు రాదు అనేదానికి ఇదే నిదర్శనం' అంటుంది అగర్వాల్.

ప్రపంచంలోని పేరున్న స్ట్రక్చరల్ ఇంజనీర్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకున్న రోమా అగర్వాల్ తాను చేసిన ప్రయాణం గురించి ఇలా అంటోంది...

'సైన్స్, మ్యాథ్స్‌పై ఆసక్తి వల్ల ఏదో సాధించాలనే తపన మొదలైంది. ఏం సాధించాలి? ఎలా సాధించాలి? అనేది మాత్రం తెలియదు. అయితే ప్రయాణం మొదలు పెట్టినప్పుడు మన కోసం ఎన్నో ద్వారాలు తెరుచుకుంటాయి. మనం ఏం సాధించాలి, ఎలా సాధించాలి అనేది ఆ ప్రయాణ అనుభవాలే పాఠాలై బోధిస్తాయి'

కిచెన్ టిప్స్



- పండిన అరటిపండు గుజ్జు, కొద్దిగా పెరుగు వేసి చపాతీపిండిని ముద్దగా కలిపితే చపాతీలు మరింత మృదువుగా మెత్తగా, రుచికరంగా ఉంటాయి.



- సమోసా పిండిలో కొద్దిగా నిమ్మరసం వేసి కలిపితే సమోసాలు మరింత క్రిస్పీగా కరకరలాడతాయి.

మిత్ర విజయం

పర్యావరణ హిత

వ్యాపారం చేయాలంటే అదే పనిగా
కంప్యూటర్ ముందు కూర్చుంటే సరిపోదు.
నాలుగు గోడలు దాటి బయటి ప్రపంచం
లోకి రావాలి. జనవాణి వినాలి. సృజనాత్మక
వ్యూహాలు రూపొందించుకోవాలి.
ఈ మిత్రులు అదే చేశారు. 'ఎకోసోల్
హోమ్'తో ఘన విజయం సాధించారు...


రాహుల్, ప్రియాంక, అరవింద్

సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనే కలతో మూడు సంవత్సరాల క్రితం రాహుల్ సింగ్, ప్రియాంకలు బోస్టన్ నుంచి నోయిడాకు వచ్చారు. 'ఇదేమిటీ వింత' అన్నట్లుగా చూశారు చుట్టాలు పక్కాలు. 'ఇటు నుంచి అటు వెళతారు గానీ, అటు నుంచి ఇటు రావడం ఏమిటి?' అనేది వారి ఆశ్చర్యంలోని సారాంశం.

'రిస్క్ చేస్తున్నారు. అమెరికాలో సంపాదించిన డబ్బులను వృథా చేయడం తప్ప సాధించేది ఏమీ ఉండదు' అన్నారు కొందరు.

అయితే ఆ ప్రతికూల మాటలేవీ ఈ దంపతులపై ప్రభావం చూపలేకపోయాయి. ఇండియాకు రావడానికి ముందు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి వారికి బోలెడు సమయం దొరికింది. 'మనం తీసుకున్న నిర్ణయం సరియైనదేనా?' నుంచి 'ఎలాంటి వ్యాపారం చేయాలి...' వరకు ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు.

వ్యాపారమైనా సరే... అది కొత్తగా, సృజనాత్మకంగా, సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడేలా ఉండాలనుకున్నారు. అలా వారి ఆలోచనలో నుంచి పుట్టిందే... ఎకోసోల్ హోమ్. అరవింద్ గణేషన్‌తో కలిసి రాహుల్ సింగ్ మొదలు పెట్టిన ఈ ఎకో-ఫ్రెండ్లీ హోమ్ ఎసెన్షియల్స్ కంపెనీ సూపర్ సక్సెస్ అయింది.

రాహుల్, అరవింద్‌లు అమెరికాలోని ఇ-కామర్స్ కంపెనీ 'వేఫేర్'లో పని చేశారు.

'వేఫేర్‌లో పనిచేసిన అనుభవం మాకు ఎంతగానో ఉపయోగపడింది. వినియోగదారుల ఆలోచన ధోరణి ఎలా ఉంటుంది? ఏది చేయాలి? ఏది చేయకూడదు? అనే విషయంలో స్పష్టత రావడానికి ఆ అనుభవం ఉపయోగపడింది. పర్యావరణ హితానికి సంబంధించిన వస్తువులకు డిమాండ్ పెరుగుతున్నట్లు విషయాన్ని గ్రహించాం. ఆ సమయంలోనే ఎకోసోల్ కంపెనీ ఆలోచన వచ్చింది' అంటున్నాడు ఎకోసోల్ హోమ్ కో-ఫౌండర్ అరవింద్ గణేశన్.

'అవగాహన కలిగించేలా, అందుబాటులో ఉండేలా, అందంగా ఉండేలా మా ఉత్పత్తులు ఉండాలనే లక్ష్యంతో బయలుదేరాం. ప్లాస్టిక్ వల్ల జరిగే హాని గురించి చాలామందికి అవగాహన ఉంది. అయితే దీనికి ప్రత్యామ్నాయం కావాలనుకున్నప్పుడు ధరలు ఆకాశంలో ఉండకూడదు. అందుకే మా వస్తువులకు అందుబాటులో ఉండే ధరలు నిర్ణయించాం' అంటాడు రాహుల్ సింగ్.

ఒకవైపు కోవిడ్ కల్లోలం భయపెడుతున్నా మరో వైపు ఇండియా, చైనా, థాయిలాండ్, మెక్సికోలలో తమ ఉత్పత్తులకు సంబంధించి సప్లై చైన్‌ను నిర్మించుకోవడానికి రంగంలోకి దిగారు. అయితే అది అంత తేలికైన విషయం కాదని అర్థమైంది. రా మెటీరియల్ నుంచి ట్రాన్స్‌పోర్టేషన్ వరకు అడుగడుగునా సవాళ్లు ఎదురయ్యాయి.

ఒక్కొక్క సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లారు.

2021లో తాటి ఆకులతో తయారుచేసిన ప్లేట్లతో సహా 20 ఉత్పత్తులను విక్రయించడం మొదలు పెట్టారు. మనం రోజూ వినియోగించే ప్లాస్టిక్ ఫోర్కులు, కప్‌లు, స్ట్రాలు, ప్లేట్స్... మొదలైన వాటికి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలు ఇందులో ఉన్నాయి.

కంపెనీ నిర్మాణ సమయంలో వివిధ జిల్లాలకు చెందిన రైతులతో కలిసి పనిచేశారు రాహుల్, అరవింద్‌లు. వారు ఎన్నో అద్భుతమైన సలహాలు ఇచ్చారు. 'తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటే అడుగు తీసి అడుగు వేస్తే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు' అంటారు రాహుల్, అరవింద్.

కిచెన్,డైనింగ్, టేబుల్‌టాప్, బాత్, పర్సనల్ కేర్....మొదలైన విభాగాల్లో 42 రకాలైన ఉత్పత్తులను అందిస్తోంది ఎకోసోల్ హోమ్. ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో అయిదు వేల స్టోర్‌లు ఉన్నాయి. రాబోయే రోజుల్లో పదివేల స్టోర్స్ లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

'మా ప్రయాణం నల్లేరు మీద నడక కాదు. కంపెనీ ప్రారంభంలో వెంచర్ క్యాపిటల్స్‌ను సంప్రదించినప్పుడు ఎవరూ ఇన్వెస్ట్ చేయడానికి ఆసక్తి చూపలేదు. ఒక రిటైలర్ మాత్రం లక్ష రూపాయల చెక్ ఇచ్చాడు. అది మాకు ఎంతో విశ్వాసాన్ని ఇచ్చింది' అంటూ గతాన్ని గుర్తు చేసుకున్నారు రాహుల్, అరవింద్‌లు.

అమ్మో... అలర్జీ!

డోంట్ వర్రీ! నివారించండి ఇలా!



మనం తీసుకునే ఆహారం వల్ల... పీల్చే గాలి వల్ల లేదా వాడే మందుల వల్ల మన రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించి అలర్జీకి దారి తీస్తుంది. అలర్జీపై అలసత్వం కూడదని, కొన్ని అలర్జీలు ప్రాణాంతకం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మనం కామన్‌గా ఎదుర్కొనే రకరకాల అలర్జీలు, కారణాలు, నివారణలపై అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం.

ఆహారం.. అలర్జీ!

మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు ఫుడ్ అలర్జీలకు దారితీస్తాయి. సాధారణంగా అందరూ తీసుకునే గుడ్లు, పాలు, వేరుశెనగ, చేపలు, రొయ్యలు, పీతలు, సోయా, కొన్ని రకాల నట్స్ (అక్రోట్స్, బాదం, బ్రెజిల్ నట్స్), గోధుమ వంటి ఆహార పదార్థాలు కొందరి శరీర తత్వానికి సరిపడవు. వీరు వీటిని తీసుకోవడం వల్ల ఆహారానికి సంబంధించిన అలర్జీలు వస్తాయి. శరీరానికి ఈ పదార్థాలు సరిపడకపోతే దురద, చర్మంపై దద్దుర్లు, వాంతులు లేదా కడుపు తిమ్మిర్లు, శ్వాస తీసుకోలేకపోవటం, గురక, దగ్గు, గొంతునొప్పి, పల్స్ పడిపోవడం, చర్మం నీలం రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఫుడ్ అలర్జీల నిర్ధారణకు చర్మ పరీక్షతో పాటు రక్త పరీక్షలు (ఐజీఈ యాంటీబాడీస్) కూడా చేయాల్సి ఉంటుంది.



గుర్తించేదిలా...

ఎక్స్‌రే వంటి పరీక్షలు నిర్వహించి ఆ తరువాత మీ అలర్జీ కారకాలను గుర్తించడానికి చర్మ పరీక్షలు, ప్యాచ్ లేదా రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల నివేదికల ఆధారంగా మీరు ఏరకమైన అలర్జీలతో బాధపడుతున్నారో నిర్ధారించుకొని తగిన చికిత్సను సిఫార్సు చేస్తారు. అలర్జీలకు సరైన చికిత్సను నిర్ధారణ పరీక్షల ఆధారంగానే కాకుండా బాధితుడి మెడికల్ హిస్టరీ, లక్షణాల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని అందిస్తారు. ఈ రుగ్మతకు శాశ్వత పరిష్కారం లేదు. దీన్ని ఏదో ఒక చికిత్సా విధానం ద్వారా అదుపులో మాత్రమే ఉంచుకోవచ్చు.

ఏం చేయాలి?

శరీరంలో అలర్జీ లక్షణాలు కనిపించిన వెంటనే అలర్జీ స్పెషలిస్ట్‌ను సంప్రదించడం ఉత్తమం. డాక్టర్‌తో మీ ఫ్యామిలీ హిస్టరీ, జీవనశైలి, వాడుతున్న మందులు తదితర వివరాలను తెలియజేస్తే, దానికి తగిన నిర్ధారణ పరీక్షలను సూచిస్తారు. ముందుగా ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష,

కొంతమందిలో తేనెటీగలు, కందిరీగలు (ఇన్సెక్ట్ అలర్జీ), రబ్బరుతో తయారయ్యే వస్తువులు (బెలూన్, చేతి తొడుగులు, కాండమ్స్), కొన్ని రకాల మందులు(డ్రగ్ అలర్జీ), ఫంగస్ (మోల్డ్ అలర్జీ) లాంటివి కూడా కనిపిస్తుంటాయి.

డస్ట్ అలర్జీ

సాధారణంగా డస్ట్ అలర్జీ అనేది దుమ్ము, ధూళి వల్ల, వాటిలోని సూక్ష్మజీవుల వల్ల సంభవిస్తుంది. వీటిని డస్ట్ మైట్స్ అంటారు. ఈ డస్ట్ మైట్స్ మనుషుల నుంచి రాలిన చర్మ మృతకణాలను తింటూ ఇంట్లో దుమ్ము, ధూళికి కారణమవుతాయి. ఇవి శ్వాస తీసుకునే క్రమంలో శరీరంలోకి ప్రవేశించి శ్వాసనాళాల వాపునకు కారణమవుతాయి. దీనివల్ల తుమ్ములు, ముక్కు కారడం, కంటిలో దురద, కళ్ళలో నుంచి జిగటతో కూడిన నీరు, ఒళ్లంతా దురద, ముక్కు దిబ్బడ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మన ఇళ్లలో ఉండే తేమ పరిస్థితులు ఈ డస్ట్ మైట్స్‌కు ఆవాసాలు. కాబట్టి ఇళ్లలో ఉండే దుప్పట్లు, దిండు కవర్లు, టవల్‌లు, తివాచీలు, ఇతర సామాన్లను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి. డస్ట్ అలర్జీ కారకాలను గుర్తించడానికి స్కిన్ ప్రిక్ టెస్ట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. డస్ట్ అలర్జీతో బాధపడేవారు 80 శాతం మంది ఆస్తమా రోగులుగా మారుతున్నారు.



కంటి అలర్జీ



సాధారణంగా కంటి అలర్జీలు పుప్పొడి, డస్ట్‌మైట్స్, పెంపుడు జంతువుల చర్మ కణాలు వంటి వాటి వల్ల సంభవిస్తాయి. వీటి వల్ల కళ్లలో దురద, వాపు, మంట, జిగట నీరు కారడం, ఎరుపెక్కడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ రకమైన అలర్జీలు అంటువ్యాధులు కావు. కంటి అలర్జీలకు ప్రత్యేకమైన నిర్ధారణ పరీక్షలు ఏవీ ఉండవు. పైన పేర్కొన్న కారకాల్లో ఏవి అలర్జీకి కారణం అవుతున్నాయో పరిశీలించి వాటికి దూరంగా ఉండటమే నివారణ.

స్కిన్ అలర్జీ

స్కిన్ అలర్జీ అంటే కేవలం చర్మ సంబంధిత అలర్జీ అనే అపోహ చాలామందిలో ఉంటుంది. స్కిన్ అలర్జీతో బాధపడే వారిలో విపరీతమైన దురద, చర్మంపై దద్దుర్లు, పొడి చర్మం, మంట, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. రోగనిరోధక వ్యవస్థలో లోపాలు, మందులు, అంటువ్యాధులు వంటి పలు కారణాల చేత ఇవి సంభవిస్తాయి. పెంపుడు జంతువులు, రసాయనాలు, సబ్బులు, కొత్తబట్టలు, స్కిన్ లేదా ఫేస్ క్రీమ్‌లు వంటివి చర్మ అలర్జీలకు ప్రధాన కారకాలు. చాలా మందిలో ఈ అలర్జీల కారకాలను పరీక్షల ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. అయితే సాధారణ రక్త పరీక్ష (తెల్ల రక్త కణాల పరీక్ష) ద్వారా బాధితుడి లక్షణాలను కొద్దిమేరకు గుర్తించే ప్రయత్నం చేయవచ్చు. మన చర్మం దేనికి ప్రతిస్పందిస్తుందో జాగ్రత్తగా పరిశీలించి వాటికి దూరంగా ఉండటమే దీనికి నివారణ.



మీకు తెలుసా?

కంటికి మరీ దగ్గరగా పెట్టుకుంటే...



కంటి సామర్థ్యం, పనితీరు వంటి అంశాలు మహిళలకైనా, పురుషులకైనా సాధారణంగా ఒకేలా ఉంటాయి. ఒకవేళ కంటికి ఏవైనా సమస్యలు వస్తే అవి కూడా ఒకేలా రావాలి. కానీ... కంటికి దగ్గరగా పెట్టుకుని పుస్తకాల్ని చదివేవారిలో పురుషులతో పోలిస్తే మహిళల్లో సమస్యలు కాస్తంత ఎక్కువని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన అధ్యయనవేత్తలు గుర్తించారు. ఇందుకు కారణాన్ని సైతం అధ్యయనవేత్తలు శాస్త్రీయంగా విశ్లేషించారు.

అదేమిటంటే... పురుషుల చేతుల నిడివితో పోలిస్తే మహిళల చేతులు నిడివి కాస్తంత తక్కువ. ఫలితంగా చదివే సమయంలో పురుషులతో పోలిస్తే మహిళల కళ్లకు పుస్తకం ఒకింత దగ్గరగా ఉంటుంది. దాంతో ప్రెస్బయోపియా అనే కండిషన్ మహిళలకు వేగంగా వస్తుంది. అంటే దగ్గరి చూపు తగ్గడం అన్న సమస్య చాలా త్వరగా రావచ్చు. మహిళలు దీర్ఘకాలం పాటు ఇలా పుస్తకాలను చాలా దగ్గరగా చదువుతుండటం మూలాన బైఫోకల్ లెన్స్‌ను లేదా రీడింగ్ గ్లాసెస్‌ను చాలా త్వరితంగా ఉపయోగించాల్సి వస్తోందని పరిశోధనలు తెలుపుతున్నాయి. అయితే ప్రెస్బయోపియా అన్న సమస్యకు అనేక కారణాలు ఉంటాయని, ఒక్కొక్కరి వ్యక్తిగత అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆ సమస్యకు కరెక్షన్స్ సూచించాల్సి ఉంటుందని కూడా పరిశోధకులు పేర్కొన్నారు.

హెల్త్ టిప్స్

చలవ చేసే మిరియాలు



మిరియాలు మంచి ఘాటు వాసనను కలిగి ఉంటాయి. ఈ కారణంగానే వీటిని మసాజ్ ఆయిల్ తయారీలో ఒక వనరుగా ఉపయోగిస్తారు. ఈ ఆయిల్‌తో మర్దనా చేసుకోవడం లేదా కొన్ని చుక్కలు నీటిలో కలుపుకొని స్నానం చేస్తే కండరాల నొప్పులు, ఒళ్లు నొప్పులు, గాయాలు తగ్గుతాయి.

గ్లాసు మంచినీరు, ఐదు లేక ఆరు మిరియాలు, ఒక ముక్క తెల్ల ఉల్లిపాయ, చితక్కొట్టిన అల్లం ముక్క ఒకటి, చిన్న బెల్లం ముక్క ఇవన్నీ వేసి నీరు సగం అయ్యేంత వరకు కాచండి. వేడిగా ఉండగానే తాగండి. దీనిని సేవించడం వల్ల దగ్గు, జలుబు, గొంతు నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

భరించరానంత తలనొప్పి తగ్గాలంటే పది తులసి ఆకులు, పది నల్ల మిరియాలను నూరి అందులో టీ స్పూను తేనె కలిపి రోజుకు మూడు సార్లు తినాలి.

ఆరోగ్యానికి రక్ష డ్రాగన్ ఫ్రూట్

పండ్లలో డ్రాగన్ ఫ్రూట్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎందుకంటే ఇవి చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అందువల్ల వీటిని చిన్న పిల్లల నుంచి పెద్దవారి దాకా ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. వీటిని తినడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే మూలకాలు అన్ని రకాల అనారోగ్య సమస్యల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తాయి.



ప్రస్తుతం చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ జుట్టు సమస్యలతో బాధపడుతున్నారు. ఇందులో అధిక పరిమాణంలో అనేక విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. కాబట్టి జుట్టు సమస్యలతో బాధపడేవారు క్రమం తప్పకుండా డ్రాగన్ ఫ్రూట్‌ను తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది...

డ్రాగన్ ఫ్రూట్‌లో అధికమోతాదులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల వీటిని తీసుకునేవారికి రోగనిరోధక శక్తి పెరిగి జలుబు, ఫ్లూ, జలుబు వంటి సమస్యల నుంచి సులభంగా ఉపశమనం లభిస్తుంది. అంటు వ్యాధులు రాకుండా శరీరాన్ని కూడా కాపాడుతుంది.



జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది...

డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే ఫైబర్ పరిమాణాలు తీవ్ర జీర్ణక్రియ సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా మలబద్ధకం, పొట్ట నొప్పులతో బాధపడేవారు ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది.

గర్భధారణ సమయంలో...

గర్భధారణ సమయంలో మహిళలు తరచు ఏదో ఒక విధమైన అనారోగ్య సమస్యలకు గురవుతారు. అయితే ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి ప్రతి రోజు డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో విటమిన్ సి కూడా అధికంగా పరిమాణంలో లభిస్తుంది. దీంతో ఈ విటమిన్ సి లోపం నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తుంది.

వాపు నుంచి ఉపశమనం...

చాలా మందికి శరీరంలోని కొన్ని భాగాలలో వాపు, శరీరమంతటా మంటలు వస్తుంటాయి. ఇలాంటి సమస్యలతో బాధపడేవారు వైద్యుని సంప్రదించేముందు డ్రాగన్ ఫ్రూట్ తీసుకుని చూడాలి. అప్పటికీ తగ్గకపోతే అప్పుడు డాక్టర్‌ను కలవాలి. ఎందుకంటే ఇందులో ఉండే సమ్మేళనాలతో ఆయా సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.

కొలెస్ట్రాల్‌ను అదుపు చేస్తుంది...

తరచు కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడేవారు గుండె జబ్బుల బారిన పడే అవకాశాలున్నాయి. అయితే ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి డ్రాగన్ ఫ్రూట్‌ను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

సినిమా

వింటేజ్ కింగ్?


● ప్రభాస్

ఇంతకీ ఆ టైటిల్‌ని ఫిక్స్ చేశారా? ఈ టైటిల్ అనుకుంటున్నారా అంటూ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం గురించి చర్చ జరుగుతోంది. ఈ చిత్రం టైటిల్‌ని అధికారికంగా ప్రకటించలేదు. అయితే 'రాజా డీలక్స్' అని ఫిక్స్ చేశారనే ప్రచారం జరుగుతోంది. తాజాగా 'వింటేజ్ కింగ్' అనే టైటిల్‌ని అనుకుంటున్నారనే వార్త వెలుగులోకి వచ్చింది. మరి.. వార్తల్లో ఉన్నట్లు 'రాజా డీలక్స్'ని ఫిక్స్ చేశారా? లేక 'వింటేజ్ కింగ్' అనుకుంటున్నారా? అనేది తెలియాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

దబ్బింగ్ ఆరంభం

ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' సినిమాలోని తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' సెప్టెంబరు 28న విడుదల కానున్న సంగతి తెలిసిందే. విజయ్ కిరగందూర్ ఈ సినిమాను నిర్మించారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ వర్క్‌ను ఆరంభించారు. మరోవైపు నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'కల్కి 2898 ఏడీ' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే.

అందుకే స్పందించా!


● విశాల్


''సాధారణంగా నేను వదంతులకు, అబద్ధపు వార్తలకు స్పందించను. ఎందుకంటే అవి పూర్తిగా అనవసరమైన విషయాలు. కానీ ఇప్పుడు స్పందించడానికి కారణం ఈ వార్తతో ఒక అమ్మాయి జీవితం ముడి పడి ఉండడమే'' అని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు విశాల్. హీరోయిన్ లక్ష్మీ మీనన్, విశాల్ పెళ్లి చేసుకోనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ వార్తను ఉద్దేశించే విశాల్ పై విధంగా పేర్కొన్నారు. ''లక్ష్మీ మీనన్‌తో నా పెళ్లనేది నిజం కాదు. మా ఇద్దరి పెళ్లంటూ వస్తున్న వార్తను ఖండిస్తున్నాను. ఒక అమ్మాయి వ్యక్తిగత జీవితానికి నష్టం కలిగించడం సరి కాదు. భవిష్యత్తులో నేను ఎవర్ని, ఏ తేదీ, ఏ టైమ్‌లో పెళ్లి చేసుకుంటాననేది తెలుసుకోవడం అందరికీ పెద్ద కష్టమేం కాదు. అయినా సమయం వచ్చినప్పుడు నా పెళ్లి గురించి నేనే చెబుతాను'' అని కూడా విశాల్ అన్నారు.

చందమామ కథలోన..



● రక్షిత్, రాఘవేంద్ర రావు

రక్షిత్ అట్లూరి, సంకీర్తన విపిన్ జంటగా వెంకట సత్య దర్శకత్వంలో రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'చందమామ కథలోన..' పాట లిరికల్ వీడియోను దర్శకుడు కె. రాఘవేంద్ర రావు విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'చందమామ కథలోన.. అందమైన పిల్లేనా.. కళ్ల ముందు వాలిందా.. తుళ్లి తుళ్లి పడ్డాన..' అంటూ సాగే ఈ పాటను పూర్ణాచారి రాయగా హరి చరణ్, గీతా మాధురి పాడారు. శరవణ వాసుదేవన్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు. రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి.

శ్రీకాంత్ అడ్డాల డైరెక్షన్‌లో?


● అఖిల్

'ఏజెంట్' తర్వాత అఖిల్ కొత్త సినిమా గురించిన అధికారిక ప్రకటన ఇంకా వెల్లడి కాలేదు. అయితే అనిల్ అనే ఓ కొత్త దర్శకుడితో అఖిల్ సినిమా చేయనున్నారని, ఈ సినిమాకు 'ధీర' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని ప్రచారం జరిగింది. తాజాగా దర్శకుడు శ్రీకాంత్ అడ్డాలతో అఖిల్ ఓ సినిమా చేయనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. శ్రీకాంత్ ఓ కథను రెడీ చేసి, అఖిల్‌కు వినిపించారట. ఈ స్క్రిప్ట్ అఖిల్‌కి నచ్చిందని సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే అఖిల్ – శ్రీకాంత్ అడ్డాల కాంబినేషన్‌లోని సినిమా ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం శ్రీకాంత్ అడ్డాల తెరకెక్కించిన 'పెద కాపు 1' ఈ నెలలోనే విడుదల కానుంది. ఒకవేళ అఖిల్‌తో సినిమా కన్ఫార్మ్ అయితే.. 'పెద కాపు 1' విడుదల తర్వాత ప్రకటన వస్తుందేమో?


● కంగనా రనౌత్

నీకిదే స్వాగతాంజలి

'లాస్య విలసిత.. నవ నాట్యదేవత.. నటనాంకిత అభినయ వ్రత చారుధీర చరిత స్వాగతాంజలి.. స్వాగతాంజలి' అంటూ సాగే పాట 'చంద్రముఖి 2' చిత్రంలోనిది. రాఘవా లారెన్స్, లక్ష్మీ మీనన్, కంగనా రనౌత్, వడివేలు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చంద్రముఖి 2'. పి. వాసు దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబరు 15న విడుదల కానుంది. ఈ చిత్రంలో చంద్రముఖి పాత్రధారి కంగనా రనౌత్‌పై చిత్రీకరించిన 'ఓ చంద్రముఖి నీకిదే స్వాగతాంజలి' పాట తెలుగు, తమిళ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. యం.యం. కీరవాణి స్వరకల్పనలో చైతన్య ప్రసాద్ లిరిక్స్ అందించిన ఈ పాటను శ్రీనిధి తిరుమల పాడారు. ఇక రజనీకాంత్ హీరోగా జ్యోతిక, ప్రభు, నయనతార లీడ్ రోల్స్‌లో పి. వాసు దర్శకత్వంలో రూపొందిన 'చంద్రముఖి' చిత్రం 2005లో విడుదలై ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'చంద్రముఖి 2' తెరకెక్కింది.

పోలీస్ స్టేషన్‌లో...

హీరోయిన్ కేథరిన్ ట్రెసా పోలీస్ స్టేషన్‌లో ఉన్నారు. ఆమె పోలీసాఫీసర్ కాదు.. ఖైదీ కూడా కాదు. మరి.. పోలీస్ స్టేషన్‌కి ఎందుకు వెళ్లారంటే.. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా. కేథరిన్ హీరోయిన్‌గా 'జార్జిరెడ్డి, వంగవీటి' చిత్రాల ఫేమ్ సందీప్ మాధవ్ హీరోగా ఓ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో సందీప్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేస్తున్నారు. కేథరిన్ క్యారెక్టర్ ఏంటనేది తెలియాల్సి ఉంది. అయితే ఎవరూ ఊహించని రీతిలో ఆమె పాత్రను డిజైన్ చేశారట చిత్రదర్శకుడు అశోక్ తేజ. ఈ సినిమా కోసం వేసిన ప్రత్యేకమైన పోలీస్ స్టేషన్ సెట్‌లో సందీప్, కేథరిన్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని కేసీఆర్ ఫిలిమ్స్, శ్రీమహా విష్ణు మూవీస్ బ్యానర్లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మిస్తున్నారు. ''స్క్రీన్‌ప్లే బేస్డ్ చిత్రమిది. సరికొత్త యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం కొత్త అనుభూతినిచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు నిర్మాతలు. ''ఈ సినిమాలో ఎవరూ ఊహించని మలుపులు ఉంటాయి. ప్రతి సీన్ ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు దర్శకుడు.


● కేథరిన్

వినోదం..సందేశం


● ఇషా, మల్లిక్, సుమన్

మల్లిక్ బాబు, వినయ్, ఇషా, ప్రియాన్స్ హీరో హీరోయన్లుగా, సుమన్ కీలక పాత్రలో నటిస్తున్న సినిమా 'దుమారం'. జీఎల్బీ శ్రీనివాస్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. సుమన్ మాట్లాడుతూ– ''నాయీ బ్రాహ్మణుల వృత్తి, వారు జీవితంలో పడుతున్న ఇబ్బందులను కమర్షియల్ ఫార్మాట్‌లో ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఇందులో బార్బర్‌గా చేస్తున్నా. వినోదం, సందేశం అన్నీ ఉన్న చిత్రం అన్నారు. ''హీరో తండ్రి పాత్రను సుమన్ చేస్తున్నారు'' అన్నారు జీఎల్బీ శ్రీనివాస్. ''తొలి చిత్రంలోనే మాస్ క్యారెక్టర్ దొరకడం హ్యాపీ'' అన్నారు మల్లిక్. ''ఈ సినిమా కో ప్రొడ్యూసర్‌గా చేస్తూనే, విలన్ కొడుకు పాత్ర చేస్తున్నా'' అన్నారు పాండు గౌడ్.

రీల్స్

మూడు దశలు.. పెద్ద సవాల్


● శ్రీ సింహా కోడూరి

''**ఉ**స్తాద్ కథ మూడు దశల్లో ఉంటుంది. నా పాత్రలో మూడు వేరియేషన్స్ ఉంటాయి. ఇది పెద్ద సవాల్‌గా అనిపించింది. ముఖ్యంగా కాలేజీ ఎపిసోడ్స్ కోసం బరువు తగ్గాను'' అన్నారు శ్రీ సింహా కోడూరి. శ్రీ సింహా కోడూరి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా నటించిన చిత్రం 'ఉస్తాద్'. ఫణిదీప్ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి, రాకేష్ రెడ్డి గడ్డం, దువ్వూరు హిమాంక్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీ సింహా కోడూరి మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో సూర్య అనే యువకుడి పాత్ర చేశాను. సూర్య కాలేజీకి ముందు ఏం చేశాడు? కాలేజీ లైఫ్ ఎలా సాగింది? పైలట్ ఎలా అయ్యాడు? అనేది ఈ చిత్రకథ'' అన్నారు.

ఫన్... థ్రిల్


● శ్రీ కమల్, శివాని

'**న**ువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, మన్మథుడు' వంటి పలు విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన కె. విజయ భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జిలేబి'. అంజు అశ్రాని సమర్పణలో పారిశ్రామికవేత్త గుంటూరు రామకృష్ణ నిర్మించారు. విజయభాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో శివానీ రాజశేఖర్ కథానాయికగా, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర చేశారు. ఈ చిత్రం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ''ఫన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది. మణిశర్మ సంగీతం ఓ ప్రధాన ఆకర్షణ'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ నెల 18న ఈ చిత్రం విడుదల కానుంది.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


● సుమన్, గరీమా

సుమన్, గరీమా చౌహాన్ జంటగా సతీష్ పరమవేద దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సీతా కళ్యాణ వైభోగమే'. రాచాల యుగంధర్ నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ పోచంపల్లిలో మొదలైంది. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ సినిమా చివరి షెడ్యూల్‌లో భాగంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఫైట్ మాస్టర్ డ్రాగన్ ప్రకాష్ నేతృత్వంలో 100 మంది ఫైటర్లతో భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నాం. ఈ సినిమాను దసరాకి రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

దీపావళికి...


● శ్రీరామ్

శ్రీరామ్, అయ్యప్ప పి. శర్మ, అజయ్ కీలక పాత్రల్లో బేబీ డమరి సమర్పణలో రూపొందిన చిత్రం 'ఎర్ర చీర'. సుమన్ బాబు, ఎన్వీవీ సుబ్బారెడ్డి నిర్మించిన ఈ చిత్రం దీపావళికి నవంబర్ 9న రిలీజ్ కానుంది. సుమన్ బాబు దర్శకత్వం వహించారు. ''అమ్మ సెంటిమెంట్, హారర్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. 36 నిమిషాల గ్రాఫిక్స్, లక్షలాది మంది అఘోరాలతో తీసిన క్లైమాక్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి'' అన్నారు ఎన్వీవీ సుబ్బారెడ్డి, సుమన్ బాబు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	366	65,323
నిఫ్టీ ▽	115	19,428

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,664	▽	74
డోజోన్స్	35,249	△	73
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,524	▽	94
డాక్స్	15,832	▽	124
షాంఘై	3,189	▽	65
నికాయ్	32,474	▽	269

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,905	▽	4
బంగారం (99.5 స్వచ్ఛత)	58,669	▽	4
వెండి (కిలో)	70,098	▽	78

ఈ-గేమింగ్‌పై విదేశీ ప్లేయర్లకూ జీఎస్‌టీ వర్తింపు

న్యూఢిల్లీ: దేశీ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫాంలలో ఆడే విదేశీ ప్లేయర్లకు కూడా 28% జీఎస్‌టీ వర్తించనుంది. గేమింగ్ సంస్థలు ఆయా ప్లేయర్ల నుంచి ఈ మొత్తాన్ని మినహాయించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన సమీకృత జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) చట్ట సవరణకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. ఆన్‌లైన్ గేమింగ్, కేసినోలు, హార్స్ రేస్ క్లబ్‌లు మొదలైన వాటిల్లో బెట్టింగ్‌లపై 28% (జీఎస్‌టీ) విధించాలని జీఎస్‌టీ మండలి నిర్ణయించడం తెలిసిందే.

లాట్ మొబైల్స్ 11వ వార్షికోత్సవ ఆఫర్లు

హైదరాబాద్: మల్టీబ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్ లాట్ మొబైల్స్ 11వ వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లను ప్రకటించింది. రూ.3,999 విలువైన ఎయిర్ పాడ్స్, వైర్‌లెస్ బ్లూటూత్ హెడ్‌సెట్‌ను కేవలం రూ.11కే అందిస్తుంది. స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌టీవీ, ఏసీలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్స్ కొనుగోలుపై రూ.2,500 వరకు తక్షణ డిస్కౌంట్‌తో పాటు ఖచ్చితమైన బహుమతి ఇస్తుంది. పేటీఎం, మొబిక్విక్ వాలెట్ ద్వారా కొనుగోలుపై 5% వరకు తక్షణ క్యాష్ బ్యాక్ ఇస్తుంది. ఏటీఎం కార్డుపై ఒక్క రూపాయి డౌన్ పేమెంట్‌తో మొబైల్, ల్యాప్‌టాప్, స్మార్ట్ టీవీలు కొనుగోలు చేయవచ్చు. వార్షికోత్సవ ఆఫర్లు వినియోగించుకోవాలని సంస్థ డైరెక్టర్ ఎం.సుప్రజ కోరారు.



బీ న్యూ స్టోర్లలో శాంసంగ్ జెడ్ ఫోల్డ్/ఫ్లిప్ 5 స్మార్ట్‌ఫోన్లు

హైదరాబాద్: బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో శాంసంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 5, జెడ్ ఫ్లిప్ 5 స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ బీ న్యూ స్టోర్‌లో శుక్రవారం నటి హెబ్బా పటేల్ ఈ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేశారు. బజాజ్, టీవీఎస్ క్రెడిట్, హెచ్‌డీబీ, ఐడీఎఫ్‌సీ, బీనా, క్లైవర్‌పే ద్వారా ఈఎంఐ పద్ధతిలో ఫోన్లను కొనుగోలు చేయొచ్చు. జీరో ఫైనాన్స్ కూడా అందుబాటులో ఉంది. ఎంపిక చేసిన ప్రతి మొబైల్‌పై రూ. 23 వేల వరకు ప్రత్యేక డిస్కౌంట్ ఉంది. ఈ అవకాశాన్ని కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని బీ న్యూ స్టోర్ సీఎండీ బాలాజీ చౌదరి కోరారు. ఆవిష్కరణలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్‌తో పాటు శాంసంగ్ ఆర్ఎంఎస్ సుమిత్ కురేజ్‌లు పాల్గొన్నారు.



ఆర్‌బీఐ వదిలినా.. బ్యాంకులు తగ్గేదేలే!

0.10 శాతం వడ్డీరేట్లు పెంచిన బీఓబీ, కెనరా, బీఓఎం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) నిధుల సమీకరణ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్ల వరకూ (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచుతూ శుక్రవారం కీలక నిర్ణయం తీసుకున్నాయి. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు– రెపోను వరుసగా మూడవసారి 6.5 శాతం వద్ద కొనసాగిస్తూ ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకున్నప్పటికీ బ్యాంకులు మాత్రం వడ్డీరేట్ల పెంపువైపే మొగ్గుచూపుతుండడం గమనార్హం. వ్యవస్థలో తగిన రుణ డిమాండ్ ఉందన్న విషయాన్ని బ్యాంకుల తాజా వడ్డీరేట్ల పెంపు నిర్ణయాలు సూచిస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బ్యాంకింగ్ నిర్ణయాలతో ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానమైన రుణ రేట్లు పెరగనున్నాయి. సాధారణంగా వినియోగ రుణాలు ఏడాది కాల వ్యవధి ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానమై ఉంటాయి. తాజా మార్పుతో ఏడాది బ్యాంకింగ్ ఎంసీఎల్ఆర్ రేట్ల పెరుగుదల తీరిదీ...



- **బీఓబీ:** రుణ రేటు 8.65 శాతం నుంచి 8.70 శాతానికి పెరగనుంది. ఆగస్టు 12 నుంచి ఈ రేటు అమలవుతుంది.
- **కెనరా బ్యాంక్:** ఆగస్టు 12 నుంచి 8.65 శాతం నుంచి 8.7 శాతానికి పెరగనుంది.
- **బీఓఎం:** తక్షణం అమల్లోకి వచ్చే విధంగా రేటు 10 బేసిస్ పాయింట్లు ఎగసి 8.60కి ఎగసింది.

నెమ్మదించిన పారిశ్రామిక ఉత్పత్తి

- జూన్‌లో 3.7 శాతం వృద్ధి
- 3 నెలల కనిష్ట స్థాయి
- తయారీ రంగం పేలవ పనితీరు

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక ఉత్పత్తి జూన్‌లో పేలవ పనితనాన్ని ప్రదర్శించింది. ఇందుకు సంబంధించి పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ) సూచీ పెరుగుదల రేటు కేవలం 3.7 శాతంగా నమోదయ్యింది. అంతక్రితం గడచిన మూడు నెలల్లో ఈ స్థాయికి సూచీ పడిపోవడం ఇదే తొలిసారి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70 శాతం వెయిటేజ్ ఉన్న తయారీ రంగం పేలవ పనితీరును ప్రదర్శించింది. గత ఏడాది జూన్‌లో ఐఐపీ పెరుగుదల రేటు 12.6 శాతం. అయితే 2022 కరోనా కాలం నాటి లోబేస్ ఎఫెక్ట్ (అతితక్కువ స్థాయి) దీనికి ప్రధాన కారణం కావడం గమనార్హం. కాగా మార్చిలో ఐఐపీ పెరుగుదల 1.9 శాతంకాగా, ఏప్రిల్, మే నెలల్లో వరుసగా 4.5 శాతం, 5.3 శాతాలుగా నమోదయ్యాయి. ఇక ఏప్రిల్ నుంచి జూన్ మధ్య ఐఐపీ వృద్ధి రేటు 4.5 శాతంగా ఉంటే, 2022–23 ఇదే కాలంలో ఈ రేటు బేస్ ఎఫెక్ట్‌తో 12.9 శాతంగా నమోదయ్యింది.



- కాగా, ఎనిమిది పారిశ్రామిక రంగాలతో (స్టీల్, సహజ వాయువు, బొగ్గు, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువులు, సిమెంట్, విద్యుత్, క్రూడ్ ఆయిల్) కూడిన మౌలిక రంగం వృద్ధి జూన్‌లో ఐదు నెలల గరిష్ట స్థాయిని చూసింది. వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) ఈ ఎనిమిది పరిశ్రమల వెయిటేజ్ దాదాపు 44 శాతం. కాగా, ఆర్థిక సంవత్సరంలో గడచిన మూడు నెలల్లో (ఏప్రిల్–జూన్) గ్రూప్ 5.8 శాతం పురోగమించింది.

రంగాల వారీగా జూన్ పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు
(క్రితం గణాంకాలతో పోల్చి.. శాతాల్లో)

	2023 జూన్	2023 మే	2022 జూన్
తయారీ	3.1	5.7	12.9
మైనింగ్	7.6	6.4	7.8
విద్యుత్	4.2	0.9	16.4
క్యాపిటల్ గూడ్స్	2.2	8.2	28.6
కన్జూమర్ డ్యూరబుల్స్	-6.9	1.1	25.2
నాన్ డ్యూరబుల్స్	1.2	7.6	2.9
ఇన్‌ఫ్రా/నిర్మాణం	11.3	14	9.4
ప్రైమరీ గూడ్స్	–5.2	3.5	13.8
ఇంటర్మీడియట్ గూడ్స్	4.5	1.6	10.5

మార్కెట్లో రెండోరోజూ అదే తీరు

- కొనసాగిన ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాల ప్రభావం
- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూలతలు
- ప్రైవేట్ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాలు

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయాల ప్రభావం స్టాక్ మార్కెట్‌పై రెండోరోజూ కొనసాగింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ నుంచి బలహీన సంకేతాలు అందాయి. ఫలితంగా ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో శుక్రవారం నష్టాలను చవిచూశాయి. ఉదయం సెన్సెక్స్ 40 పాయింట్ల స్వల్ప లాభంతో 65,728 వద్ద, నిఫ్టీ 11 పాయింట్లు పెరిగి 19,554 వద్ద మొదలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రోజంతా సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, పారిశ్రామిక షేర్లు మినహా అన్ని రంగాలూ అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 414 పాయింట్లు నష్టపోయి 65,274 వద్ద, నిఫ్టీ 130 పాయింట్లు క్షీణించి 19,413 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరికి సెన్సెక్స్ 366 పాయింట్ల నష్టపోయి 65,323 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 115 పాయింట్లు క్షీణించి 19,428 వద్ద నిలిచింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.13 %, స్మాల్ క్యాప్ సూచీ 0.31 శాతం చొప్పున క్షీణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,073 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.500 కోట్ల షేర్లను కొన్నారు. రూపాయి విలువ 19 పైసలు క్షీణించి 82.85 స్థాయి వద్ద స్థిరపడింది. కాగా ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 399 పాయింట్లు, నిఫ్టీ 89 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.



''వ్యవస్థలోకి వచ్చిన అదనపు ద్రవ్య లభ్యతను తగ్గించేందుకు ఆర్‌బీఐ ఇంక్రిమెంటల్ సీఆర్ఆర్‌ను పదిశాతం పెంపు చర్యలతో స్టాక్ మార్కెట్ రెండోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ద్రవ్యోల్బణ అంచనా పెంపుతో ఆందోళనలు మరింత అధికమయ్యాయి. అమెరికా ద్రవ్యోల్బణం అంచనాలకు తగ్గట్లే నమోదైంది. బ్రిటన్ జీడీపీ డేటా అంచనాలకు మించి నమోదైంది. అయినప్పటికీ అంతర్జాతీయ సెంటిమెంట్ బలహీనంగా ఉంది'' అని జియోజిత్ ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జూన్ క్వార్టర్‌లో నికరలాభం 14 రెట్లు పెరగడంతో ఎల్ఐసీ షేరు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో 3% లాభపడి రూ.660 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 5% పెరిగి రూ.677 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.
- ఎంఎస్‌సీఐ ఇండియా సూచీలో చోటు దక్కించుకున్న సుప్రీం ఇండస్ట్రీస్(6%), ఆర్ఈసీ(4%), అశోక్ లేలాండ్(0.50%) షేర్లు ఇంట్రాడేలో 52 వారాల గరిష్టాన్ని తాకాయి. కాగా ఇదే ఇండెక్స్ నుంచి స్థానం కోల్పోయిన ఏసీసీ షేరు స్వల్పంగా 0.25% కోల్పోయి రూ.1955 వద్ద స్థిరపడింది. ఆస్ట్రాల్, కమ్మిన్స్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, పవర్ ఫైనాన్స్ కార్పొరేట్‌లు సైతం ఇండెక్సుల్లో చేరనున్నాయి.

ఈ–వేస్ట్‌కు డిస్కౌంట్ కూపన్

సెలెక్ట్ మొబైల్స్ 'మిషన్ ఈ–వేస్ట్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ సెలెక్ట్ మొబైల్స్ భారత్‌లో తొలిసారిగా 'మిషన్ ఈ–వేస్ట్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. పరిశుభ్ర వాతావరణాన్ని, జీవన ప్రమాణాలను పెంచే లక్ష్యంతో ఈ–వేస్ట్‌ను సేకరించి, రీసైక్లింగ్ చేపడతారు. ఇందుకోసం కంపెనీ స్టోర్లలో బిన్స్‌ను ఏర్పాటు చేస్తామని సెలెక్ట్ మొబైల్స్ సీఎండీ వై.గురు తెలిపారు. పాడైన, వినియోగించని మొబైల్ ఫోన్లు, చార్జర్లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్స్‌ను సెలెక్ట్ స్టోర్లకు తీసుకువస్తే చాలు. రూ.10,000 వరకు డిస్కౌంట్ కూపన్ అందుకోవచ్చు. దేశంలో ఏటా 20 లక్షల టన్నుల ఈ–వేస్ట్ పోగవుతోందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు తెలిపారు. వ్యర్థాల నిర్వహణ పెద్ద సవాల్‌గా మారిందన్నారు. శాస్త్రీయ పద్ధతిలో ఈ–వేస్ట్ నిర్వహణను తమ ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. మొత్తం పరిశ్రమకు మిషన్ ఈ–వేస్ట్ ప్రేరణగా నిలుస్తుందని సెలెక్ట్ ఈడీ మురళి రేతినేని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు.



మిషన్ ఈ–వేస్ట్ ప్రారంభిస్తున్న కేటీఆర్. చిత్రంలో గురు, మురళి, జయేశ్ రంజన్ (ఎడమ నుంచి)

ఎన్ఎండీసీ లాభం రూ.1,661 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్ఎండీసీ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 13 శాతం అధికమై రూ.1,661 కోట్లు సాధించింది. వ్యయాలు రూ.2,969 కోట్ల నుంచి రూ.3,476 కోట్లకు ఎగశాయి. టర్నోవర్ రూ.4,913 కోట్ల నుంచి రూ.5,689 కోట్లకు చేరింది. ఫలితాల నేపథ్యంలో ఎన్ఎండీసీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే శుక్రవారం బీఎస్ఈలో ఎటువంటి మార్పు లేకుండా రూ.113.70 వద్దే ఉంది.





బోపన్న జోడీ శుభారంభం

నేషనల్ బ్యాంక్ ఓపెన్ ఏటీపీ–1000 మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. టొరంటోలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–3, 6–3తో జేమీ ముర్రే (బ్రిటన్)–మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీపై విజయం సాధించింది. 58 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని ఈ ఇండో–ఆసీస్ ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన బోపన్న–ఎబ్డెన్ క్వార్టర్ ఫైనల్లో మార్సెల్ గ్రానోలెర్స్ (స్పెయిన్)–హొరాసియో జెబలాస్ (అర్జెంటీనా)లతో తలపడతారు. 43 ఏళ్ల బోపన్న ఈ ఏడాది ఎబ్డెన్‌తో కలిసి ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీలో, దోహా ఓపెన్‌లో టైటిల్స్ సాధించాడు.

అజేయంగా టైటిల్ పోరుకు భారత్

- సెమీఫైనల్లో 5–0తో జపాన్‌పై విజయం
- నేడు మలేసియాతో ఫైనల్
- రాత్రి గం. 8:30 నుంచి స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం


భారత జట్టు సంబరం

చెన్నై: స్వదేశంలో తొలిసారి జరుగుతున్న ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు తుది పోరుకు అర్హత సాధించింది. ఇప్పటికే మూడుసార్లు విజేతగా నిలిచిన భారత్ శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో 5–0 గోల్స్ తేడాతో జపాన్‌పై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో మలేసియాతో భారత్ ఆడుతుంది. తొలి సెమీఫైనల్లో మలేసియా 6–2తో డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియాను ఓడించి ఈ టోర్నీలో మొదటిసారి ఫైనల్ చేరింది. 2018 ఆసియా క్రీడల సెమీఫైనల్లో చివరిసారి మలేసియా చేతిలో ఓడిన భారత్ ఆ తర్వాత ఈ జట్టుతో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూడలేదు. 5–6 స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ 6–1తో చైనాపై గెలిచి ఐదో స్థానాన్ని దక్కించుకోగా... చైనా చివరిదైన ఆరో స్థానంతో సరిపెట్టుకుంది.

జపాన్‌పై గెలుపుతో హర్మన్‌ప్రీత్ సేన నాలుగో టైటిల్‌పై కన్నేసింది. ఈ టోర్నీలో లీగ్ దశలో 1–1తో తమని నిలువరించిన జపాన్‌పై టీమిండియా ఎదురు లేని విజయం సాధించింది. బంగ్లాదేశ్‌లో జరిగిన గత టోర్నీ (2021)లో సెమీస్‌లో ఎదురైన పరాజయానికి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకుంది. భారత శిబిరం అటాకింగ్‌కు జపాన్ వద్ద బదులే లేకపోయింది. తొలి క్వార్టర్ 0–0తో ముగిసింది. ఆ తర్వాత మూడు క్వార్టర్లు భారత ఆటగాళ్లదే జోరు. ఆకాశ్‌దీప్ సింగ్ (19వ ని.లో), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (23వ ని.లో), మన్‌దీప్ సింగ్ (30వ ని.లో), సుమిత్ (39వ ని.లో), కార్తీ సెల్వం (51వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. ఈ మ్యాచ్‌తో భారత జట్టు గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ 300 అంతర్జాతీయ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్నాడు.

మళ్లీ మొదటికి...

నేడు జరగాల్సిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలపై స్టే

చండీగఢ్: అడ్డంకులు తొలగి ఎన్నికలకు సిద్ధమైన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)కు పంజాబ్ –హరియాణా హైకోర్టు షాక్ ఇచ్చింది. తద్వారా వివాదాస్పద సమాఖ్య మళ్లీ వార్తల్లో నిలిచినట్లయింది. నేడు ఎన్నికలు జరిగి కొత్త కార్యవర్గం ఎన్నిక కావాల్సి ఉండగా... హైకోర్టు ఓ రోజు ముందే నామినేషన్లు వేసిన అభ్యర్థులకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో హరియాణా అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘానికి ఓటేసే హక్కు ఇవ్వడం పట్ల హరియాణా రెజ్లింగ్ సంఘం హైకోర్టులో పిటిషన్ వేయడంతో... శుక్రవారం విచారించిన కోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చేదాకా ఎన్నికలు నిర్వహించ రాదని స్టే విధించింది.

బ్రిజ్‌భూషణ్‌కు ఎదురుదెబ్బ!

భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను విచారించేందుకు ఢిల్లీ పోలీసులు సిద్ధమయ్యారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్‌భూషణ్‌పై కోర్టు ఆదేశాలతో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా కీలక సాక్ష్యాధారాలను ఢిల్లీ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హర్జీత్ సింగ్‌కు తెలపడంతో ఆయన విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

మరో విజయంపై గురి!


సూర్యకుమార్, హార్దిక్

- సిరీస్ సమం చేసే లక్ష్యంతో టీమిండియా
- నేడు భారత్, వెస్టిండీస్ నాలుగో టి20
- రాత్రి గం.8.00 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

లాడర్‌హిల్ (ఫ్లోరిడా): భారత్, వెస్టిండీస్ సమరం అమెరికా గడ్డకు చేరింది. సిరీస్‌ను సమం చేసే లక్ష్యంతో భారత్ బరిలోకి దిగుతుండగా... గత మ్యాచ్‌లో ఓటమి పాలైన తర్వాత ఇక్కడైనా సిరీస్ అందుకోవాలని వెస్టిండీస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే నాలుగో టి20 మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. ఈ టూర్‌లో ఇప్పటి వరకు జరిగిన అన్ని మ్యాచ్‌లతో పోలిస్తే అమెరికాలోని ఈ రీజినల్ పార్క్ స్టేడియం బ్యాటింగ్‌కు బాగా అనుకూలించే మైదానం. గతంలోనూ ఇక్కడ భారీ స్కోర్లే నమోదయ్యాయి కాబట్టి సిరీస్‌లోని చివరి రెండు టి20ల్లో బ్యాటర్ల నుంచి మెరుపు ప్రదర్శనలు ఆశించవచ్చు. అయితే శనివారం రోజున వర్ష సూచన ఉంది. మ్యాచ్‌కు వాన అంతరాయం కలిగించవచ్చు. ఇక్కడ జరిగిన 13 టి20ల్లో 11 సార్లు ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టే గెలిచింది.

అదే జట్టుతో...

గత మ్యాచ్‌లో ఏకపక్ష విజయం సాధించిన భారత జట్టు మార్పుల్లేకుండానే బరిలోకి దిగే అవకాశం ఉంది. తన సత్తా చాటేందుకు యశస్వి జైస్వాల్‌కు ఇది మరో అవకాశం. అయితే రెండో ఓపెనర్ శుబ్‌మన్ గిల్ మూడు మ్యాచుల్లోనూ 'సింగిల్ డిజిట్' స్కోరుకే పరిమితమయ్యాడు. ఇక్కడైనా అతను ఫామ్‌ను అందుకుంటాడా చూడాలి. ఈ ఫార్మాట్‌లో తాను ఎంత ప్రమాదకరమైన ఆటగాడో సూర్యకుమార్ నిరూపించాడు. అయితే ఇప్పుడు అందరి దృష్టి హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మపై నిలిచింది. సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లలో సత్తా చాటిన అతనిపై అన్ని వైపుల నుంచి ప్రశంసలతో పాటు వన్డేల్లోనూ తీసుకోవాలనే సూచనలు వస్తున్న నేపథ్యంలో తిలక్ తన జోరును కొనసాగించాల్సి ఉంది. సంజు సామ్సన్‌కు కూడా ఇది చావోరేవోలాంటి మ్యాచ్. ఇక్కడా అవకాశం వృథా చేస్తే ముమ్ముందు కష్టమే. బౌలింగ్‌లో పేసర్లు ముకేశ్, అర్ష్‌దీప్ అంతంత మాత్రమే ప్రభావం చూపిస్తుండగా... చహల్, కుల్దీప్ తమ స్పిన్‌తో ప్రత్యర్థిని కట్టిపడేస్తున్నారు. వీరు మరోసారి చెలరేగితే విండీస్‌కు కష్టాలు తప్పవు.

హెట్‌మైర్ రాణిస్తాడా...

విండీస్ జట్టులో పూరన్, హెట్‌మైర్‌లు టి20 ఫార్మాట్‌లో స్టార్‌లుగా గుర్తింపు తెచ్చుకున్నారు. పూరన్ తనపై ఉన్న అంచనాలను నిలబెట్టుకోగా, హెట్‌మైర్ ఇప్పటి వరకు ప్రభావం చూపలేకపోయాడు. ఈసారైనా అతను దూకుడుగా ఆడాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. కెప్టెన్ పావెల్ ఫామ్‌లోకి సానుకూలాంశం కాగా... మేయర్స్, చార్లెస్ కనీస ప్రదర్శన కూడా ఇవ్వడం లేదు. ఓపెనర్ కింగ్ కూడా శుభారంభం అందించాల్సి ఉంది. చార్లెస్ స్థానంలో వన్డే కెప్టెన్ షై హోప్‌ను ఆడించే అవకాశం ఉంది. ఫిట్‌గా ఉంటే చేజ్ స్థానంలో హోల్డర్ తిరిగొస్తాడు. నెమ్మదైన పిచ్‌లపై మెరుగైన రీతిలో రాణించిన విండీస్ పేసర్లు జోసెఫ్, మెకాయ్, షెఫర్డ్ ఈ పిచ్‌పై భారత బ్యాటర్లను ఎలా నిలువరిస్తారనేది చూడాలి. అన్ని విధాలుగా ఆకట్టుకున్న స్పిన్నర్ అకీల్ హొసీన్‌పై కూడా టీమ్ ఆధారపడుతోంది.

4 భారత్, విండీస్ మధ్య ఈ మైదానంలో 6 టి20లు జరగ్గా, భారత్ నాలుగింటిలో గెలిచి ఒక మ్యాచ్‌లో ఓడింది. మరో మ్యాచ్‌లో ఫలితం రాలేదు. గత రెండు మ్యాచ్‌లలో భారత్ 191, 188 స్కోర్లు చేసింది.

5 మరో 5 వికెట్లు తీస్తే చహల్ టి20ల్లో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా నిలుస్తాడు.

క్వార్టర్ ఫైనల్లో హారిక

ప్రపంచ రెండో ర్యాంకర్ నకమురపై ప్రజ్ఞానంద సంచలన విజయం

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక క్వార్టర్ ఫైనల్ చేరుకోగా... కోనేరు హంపి ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. ఎలైన్ రోబర్స్‌తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో హారిక 2.5–1.5తో గెలిచింది. నిర్ణీత రెండు క్లాసికల్ గేమ్‌ల తర్వాత ఇద్దరూ 1–1తో సమంగా ఉండటంతో శుక్రవారం ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్‌ను నిర్వహించారు. తొలి గేమ్‌ను హారిక 61 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... రెండో గేమ్‌లో హారిక 73 ఎత్తుల్లో నెగ్గి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బెలా ఖొటెనాష్‌విలి (జార్జియా)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో హంపి 1–3తో ఓడిపోయింది. ర్యాపిడ్ ఫార్మాట్ టైబ్రేక్ తొలి గేమ్‌లో హంపి 54 ఎత్తుల్లో... రెండో గేమ్‌లో 43 ఎత్తుల్లో పరాజయం పాలైంది.

గుకేశ్ ముందంజ...

ఓపెన్ విభాగంలో 18 ఏళ్ల భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద పెను సంచలనం సృష్టించాడు. టైటిల్ ఫేవరెట్, ప్రపంచ రెండో ర్యాంకర్ హికారు నకముర (అమెరికా)పై ప్రజ్ఞానంద గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. ర్యాపిడ్ ఫార్మాట్‌లోని రెండు గేముల్లో 2787 ఎలో రేటింగ్ ఉన్న నకమురను 2690 రేటింగ్ కలిగిన ప్రజ్ఞానంద ఓడించడం విశేషం. తమిళనాడుకు చెందిన ప్రజ్ఞానంద తొలి గేమ్‌లో 33 ఎత్తుల్లో, రెండో గేమ్‌లో 41 ఎత్తుల్లో విజయం సాధించాడు. తమిళనాడుకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 2.5–1.5తో ఆండ్రీ ఎసిపెంకో (రష్యా)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... నిహాల్ సరీన్ 1–3తో నెపోమ్‌నిశి (రష్యా) చేతిలో ఓడిపోయాడు.




ప్రజ్ఞానంద

కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో రాయుడు

పేట్రియాట్స్ టీమ్‌తో ఒప్పందం

ముంబై: భారత మాజీ క్రికెటర్, ఆరు ఐపీఎల్ టైటిల్స్‌లో భాగమైన అంబటి తిరుపతి (ఏటీ) రాయుడు ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 24 వరకు జరిగే కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లోకి అడుగు పెడుతున్నాడు. వచ్చే సీజన్ కోసం అతను సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. టోర్నీకి దూరమైన దక్షిణాఫ్రికా ఆటగాడు స్టబ్స్ స్థానంలో టీమ్ మేనేజ్‌మెంట్ రాయుడును ఎంచుకుంది. ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ గెలవగానే లీగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రాయుడు అమెరికాలోని మేజర్ క్రికెట్ లీగ్ (ఎంసీఎల్)లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. అయితే రిటైర్మెంట్ తర్వాత కూడా భారత ఆటగాళ్లు విదేశీ లీగ్‌లలో పాల్గొనేందుకు కనీసం ఏడాది విరామం ఉండాలనే నిబంధనను ఆ సమయంలో బీసీసీఐ తెచ్చేందుకు ప్రయత్నించింది. దాంతో ఎంసీఎల్ ప్రారంభానికి ఐదు రోజుల ముందు అతను లీగ్ నుంచి తప్పుకున్నాడు. ఇప్పుడు కూడా రాయుడు ఆడేందుకు బీసీసీఐ అనుమతి ఇస్తుందా లేదా వేచి చూడాలి.



బంగ్లాదేశ్ వన్డే కెప్టెన్‌గా షకీబ్

ఢాకా: సీనియర్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ ఆసియా కప్, వన్డే వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. తమీమ్ ఇక్బాల్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో అతని స్థానంలో షకీబ్‌ను వరల్డ్ కప్ వరకు ఎంపిక చేస్తున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఇప్పటికే షకీబ్ జాతీయ జట్టు టెస్టు, టి20 కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గతంలోనూ షకీబ్ బంగ్లా టీమ్‌కు 50 వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2017 మేలో చివరిసారిగా అతను కెప్టెన్‌గా వన్డే బరిలోకి దిగాడు. ఇప్పటి వరకు 235 వన్డేలు ఆడిన షకీబ్ 7211 పరుగులు చేసి, 305 వికెట్లు పడగొట్టాడు.



ఎర్రచందనం.. ఎనీటైమ్ ప్రొటెక్షన్

- బొటానికల్ గార్డెన్‌లో ప్రయోగాత్మకంగా 50 చెట్లకు చిప్‌ల అమరిక
- వివరాలు వెల్లడించిన టీఎస్‌ఎఫ్‌డీసీ వైస్‌చైర్మన్, ఎండీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి


బొటానికల్ గార్డెన్‌లో ఎర్రచందనం చెట్టుకు రియల్ టైం చిప్


గచ్చిబౌలి : ఖరీదైన ఎర్రచందనం చెట్లను పరిరక్షించేందుకు అధునాతన పరికరం (రియల్‌టైం ప్రొటెక్షన్ చిప్) అందుబాటులోకి వచ్చింది. నగరంలోని బొటానికల్ గార్డెన్‌లో ప్రయోగాత్మకంగా చిప్ సెట్లు అమర్చినట్టు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎఫ్‌డీసీ) వైస్‌చైర్మన్, ఎండీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో విలేకరుల సమావేశంలో అధునాతన టెక్నాలజీని ఆయన వివరించారు. బొటానికల్ గార్డెన్‌లో 10 వేల ఎర్రచందనం మొక్కలు ఉన్నాయని, మొదటి విడతలో 50 ఎర్రచందనం చెట్లకు రియల్ టైం ప్రొటెక్షన్ చిప్‌లు అమర్చామని పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన సీబీఐటీటీ టెక్నాలజీస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. చిప్‌ల అమరికతో దొంగల నుంచి ఎర్రచందనం చెట్లను రక్షించుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసే వీలుంటుందన్నారు. సీబీఐటీటీ సీఈఓ సత్యనారాయణ చొప్పదండి మాట్లాడుతూ ఎర్రచందనం చెట్ల రక్షణకు తమ సంస్థ ఇండియన్ ఉడ్ సైన్స్ టెక్నాలజీస్(ఐడబ్ల్యూఎస్‌టీ) సహకారంతో సరికొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఈ టెక్నాలజీని ఐడబ్ల్యూఎస్‌టీతో పాటు ఢిల్లీ ఐకార్, బెంగళూరు, ఝాన్సీ నగరాల్లో వాడుతున్నట్టు వివరించారు సెన్సార్ కేసింగ్ (యాంటినో)తో అనుసంధానం చేయడంతో మొబైల్ ఫోన్‌లోనే చెట్ల రక్షణ వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఎవరైనా చెట్టును కొట్టేందుకు ప్రయత్నించినా చిప్ సెట్ సాయంతో అలారం మోగుతుందన్నారు. ఒక్క సెన్సార్ కేసింగ్‌తో కిలోమీటరు దూరంలో ఉన్న 500 చెట్లకు చిప్‌లను అమర్చుకోవచ్చన్నారు.అధికగాలి, జంతువుల రాపిడిని గుర్తించే విధంగా చిప్ సెట్ ఉంటుందన్నారు. ప్రతిరోజూ రాత్రి చెట్టుకు సంబంధించిన సమాచారాన్ని సర్వర్‌కు చేరవేస్తుందన్నారు. చెట్టును కొట్టాలని చూస్తే అలారం మోగుతుందని, చెట్టు ఎక్కడ ఉందనే వివరాలు ఫోన్‌కు చేరవేసి మ్యాప్ ద్వారా డైరెక్షన్ చూపిస్తుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి బ్యాటరీ మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో టీఎస్‌ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్, డైరెక్టర్ అక్బర్, ఎకో టూరిజం ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిప్ పనితీరు ఇలా..

రియల్‌టైం ప్రొటెక్షన్ చిప్ సెన్సార్ పరికరం 3.6 వాల్ట్స్ లిథియమ్ ఇయాన్ బ్యాటరీతో పనిచేస్తుంది. ఎర్రచందనం చెట్లను ఎవరైనా నరికినా, దొంగిలించేందుకు ప్రయత్నించినా క్షణాల్లోనే మొబైల్ అప్లికేషన్స్, వాట్సాప్‌లకు అలర్ట్స్ పంపిస్తుంది. చెట్ల వద్ద ఉన్న హూటర్ ఎలక్ట్రానిక్ సైరన్ మోగిస్తుంది. వెంటనే అప్రమత్తమై చెట్లను రక్షించుకోవచ్చు.మొబైల్ అప్లికేషన్స్‌తో క్లౌడ్ సర్వర్‌ను అనుసంధానం చేయడంతో యూజర్స్‌కు వివిధ రకాల నివేదికలు చేరవేస్తుంది.

26, 27 తేదీల్లో దళిత ఎజెండాపై జాతీయ సదస్సు

సాక్షి, న్యూఢిల్లీ: దళిత ఎజెండాపై జాతీయ సదస్సును ఈ నెల 26, 27 తేదీల్లో హైదరాబాద్ టూరిస్ట్ ప్లాజాలో నిర్వహించనున్నట్లు దళిత, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు తెలిపారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం మల్లేపల్లి లక్ష్మయ్య (సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్), రామచంద్ర డోమ్ (దళిత్ శోషణ్ ముక్తి మంచ్), బి.వెంకట్ (అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం), జీఎల్ గోరియా (భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్), వీఎస్ నిర్మల్ (అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం) తదితరులు విలేకరులతో మాట్లాడారు. యూజీసీ మాజీ చైర్మన్ థరూర్, మాజీ ఐఏఎస్ అధికారి రాజశేఖర్‌ల నాయకత్వంలో దళిత ఎజెండా కీ నోట్ రూపొందించి సదస్సులో సమర్పిస్తారని బి.వెంకట్ తెలిపారు.



- కృత్రిమ మేధ తోడుగా ఆధునిక వ్యవసాయం
- చాట్ జీపీటీ ఆధారిత సాఫ్ట్‌వేర్లు, పరికరాలు అందుబాటులోకి..
- డ్రోన్లతో ఎరువులు, పురుగు మందులు చల్లడం నుంచి.. తెగుళ్లను గుర్తించడం దాకా..
- పంటలో తేమ శాతం నుంచి నాణ్యత, గ్రేడింగ్ దాకా..
- ఉత్తమ సాగు పద్ధతులు, మంచి మార్కెటింగ్ అవకాశాలు
- అత్యుత్తమ వంగడాలను సృష్టించేందుకూ తోడ్పాటు
- ఇప్పటికే రాష్ట్రంలో మిర్చి, పసుపు పంట నాణ్యత పరిశీలనకు ఏఐ యంత్రాల వినియోగం

‘ఏఐ’పంట!

కంచర్ల యాదగిరిరెడ్డి

నాగలి పోయి ట్రాక్టర్ వచ్చినప్పుడు.. యంత్రాలు సాగు చేస్తాయా? అన్నవాళ్లున్నారు. ట్రాక్టర్లకు హార్వెస్టర్లు, స్ప్రేయర్లు, ఇప్పుడు డ్రోన్లూ తోడవడంతో బాగున్నాయే అనుకున్నారు.

ఆధునిక యంత్ర పరికరాల రాకతో వ్యవసాయం కొంత పుంజుకున్నా.. తర్వాతి తరాలు మాత్రం వ్యవసాయం అంటే అమ్మో అంటున్నారు.

ఇలాంటి సమయంలోనే ‘చాట్ జీపీటీ’, దాని ఆధారితంగా మరిన్ని కృత్రిమ మేధ సాంకేతికతలు తెరపైకి వచ్చాయి. వ్యవసాయ రంగంపైనా ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే కొన్ని ఏఐ ఆధారిత పరికరాలు అందుబాటులోకి వచ్చాయి కూడా. మరి మొత్తంగా దీనివల్ల రైతులకు ఏం మేలు జరుగుతుంది? వ్యవసాయానికి ఏం ఒనగూరుతుంది? అంతిమంగా వచ్చేది లాభమా, నష్టమా? అన్న చర్చ సాగుతోంది.

దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఇప్పటికీ వ్యవసాయం వాటా దాదాపు 50 శాతంపైనే. కోట్లమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న రంగం ఇదే. అయితే రుతుపవనాలు, మార్కెట్ పరిస్థితులు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు లభించకపోవడం వంటి అనేక కారణాలతో వ్యవసాయం ఇప్పటికీ ఆశల జూదంగానే మిగిలిపోయింది. ప్రభుత్వం రకరకాల పథకాలు, లాభాలు చేకూరుస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు తక్కువే. ఈ కారణంగానే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు డ్రోన్లు, మెషీన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీల వాడకం మొదలైంది. అయితే గత ఏడాది విడుదలైన ‘చాట్ జీపీటీ’ఈ ప్రస్థానాన్ని ఒక అడుగు ముందుకు తీసుకెళ్లిందని చెప్పాలి. మైక్రోసాఫ్ట్‌కు చెందిన అజ్యూర్ ఓపెన్ ఏఐ సర్వీస్ ద్వారా చాట్ జీపీటీ ఆధారంగా తయారైన ‘జుగల్‌బందీ’చాట్ బోట్ వీటిలో ఒకటి. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వేర్వేరు సంక్షేమ, సహాయ పథకాల వివరాలను అందిస్తుందీ సాఫ్ట్‌వేర్. వాట్సాప్ ద్వారా కూడా అందుకోగల ఈ చాట్ బోట్ ఇంగ్లిషులో ఉన్న ప్రభుత్వ సమాచారాన్ని పది భాషల్లోకి అనువదించి మరీ అందిస్తూండటం విశేషం.


ఇంకేం చేయగలదు?

చాట్ జీపీటీ వంటి కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్లకు వ్యవసాయంతో ఏం పని? అని చాలామంది అనుకోవచ్చు. కానీ, దీని చేరికతో సాగు అన్ని రకాలుగా మెరుగవుతుందన్నది నిపుణుల అంచనా. సమాచారం ఎంత ఎక్కువగా ఉన్నా సెకన్లలో దానిని విశ్లేషించి రైతులకు ఉపయోగపడే కొత్త సమాచారాన్ని అందించగలగడం దీనితో సాధ్యం. నీరు, ఎరువులు, కీటకనాశనుల వంటి వనరులను అవసరమైనంత మాత్రమే వాడేలా చేయడం, పంట దిగుబడులు పెంచడంకోసం తోడ్పడగలదు. ఎప్పటికప్పుడు మారిపోయే వాతావరణాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన సలహా, సూచనలు ఇవ్వగలదు.

1 ప్రిడిక్టివ్ అనాలసిస్: వందేళ్ల వాతావరణ సమాచారం, మట్టి కూర్పు, పంటకు ఆశించే చీడపీడలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని.. వేసిన పంట ఎంత బాగా పండేది కచ్చితంగా చెప్పగలదు. దీన్నే ప్రిడిక్టివ్ అనాలసిస్ అంటారు. ఒకవేళ నష్టం జరిగే అవకాశముంటే దాన్ని వీలైనంత తగ్గించుకునే సూచనలూ అందుతాయి.

2 గరిష్ఠంగా దిగుబడులు: నేల, వాతావరణ పరిస్థితులకు తగ్గట్టు ఏ పంట వేస్తే గరిష్ఠ దిగుబడులు రాబట్టుకోవచ్చో గుర్తించగలదు. పంటల యాజమాన్య పద్ధతులను కూడా నిర్దిష్ట పరిస్థితులు, అవసరాలకు తగ్గట్టుగా సూచించగలదు. వేర్వేరు మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించి విశ్లేషించడం, సొంతంగా పంటల తాలూకు సిమ్యులేషన్లు తయారు చేసుకుని అత్యున్నత సాగు పద్ధతులు, పంటలను అంచనా వేయడం సాధ్యమవుతుంది. దీనిద్వారా పంట దిగుబడులు, వ్యవసాయ రంగ ఉత్పాదకత గణనీయంగా పెరిగే అవకాశం ఏర్పడుతుంది.

3 ప్రిసిషన్ అగ్రికల్చర్: జనరేటివ్ ఏఐ ద్వారా వ్యవసాయంలో వ్యర్థాలను గణనీయంగా తగ్గించగల ప్రిసిషన్ వ్యవసాయం సాధ్యమవుతుంది. ఉదాహరణకు పంట పొలం మొత్తం తిరిగే డ్రోన్లు కలుపును గుర్తిస్తే.. అతితక్కువ కలుపునాశనులతో వాటిని తొలగించే ప్లాన్‌ను ఏఐ అందివ్వగలదన్నమాట. అలాగే ఏయే మొక్కలకు నీరు అవసరం? వేటికి ఎండ కావాలన్న సూక్ష్మ వివరాలను కూడా ప్రిసిషన్ అగ్రికల్చర్ ద్వారా గుర్తించి అందించవచ్చు. ఉపగ్రహ ఛాయాచిత్రాలు, వాతావరణ సమాచారం, మట్టి కూర్పు వంటివన్నీ పరిగణించడం ద్వారా చేసే ప్రిసిషన్ అగ్రికల్చర్ ద్వారా ఖర్చులు తగ్గుతాయి. దిగుబడులు పెరుగుతాయి.



4 కొత్త వంగడాల సృష్టి: వాతావరణ మార్పుల నేపథ్యంలో కరువు కాటకాలు, వరదల వంటివి పెరిగాయి. ఈ ప్రతికూల పరిస్థితులను తట్టుకుని మనగలిగిన కొత్త వంగడాల అవసరం పెరిగింది. సంప్రదాయ పద్ధతుల్లో జరిగే పరిశోధనల ద్వారా ఈ వంగడాల సృష్టికి చాలా కాలం పడుతుంది. కానీ జనరేటివ్ ఏఐను ఉపయోగిస్తే.. అధిక దిగుబడులిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకోగల వంగడాలను వేగంగా సృష్టించడం సాధ్యమని నిపుణులు చెప్తున్నారు. జన్యు సమాచారాన్ని విశ్లేషించి ఏ రకమైన జన్యువులను తొలగిస్తే, చేరిస్తే లాభదాయకమో ఈ కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్లు వేగంగా గుర్తించగలవు.

చాట్‌బోట్‌లు.. కాల్‌సెంటర్‌లు

భారత ప్రభుత్వం కూడా వ్యవసాయంలో జనరేటివ్ ఏఐ సామర్థ్యాన్ని గుర్తించింది. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ వాట్సాప్ ఆధారిత చాట్‌బోట్ ఒకదాన్ని సృష్టించే ప్రయత్నాల్లో ఉంది. బెంగళూరుకు చెందిన ఒక కంపెనీ సిద్ధం చేసిన ‘కిసాన్ ఏఐ (కిసాన్ జీపీటీ)’ఇప్పటికే పది భారతీయ భాషల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు సంబంధిత కార్యక్రమాలు, పథకాల వివరాలను అందిస్తోంది. దీంతోపాటే దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకునేందుకు అవసరమైన సలహా, సూచనలు ఇస్తోంది. ప్రతినెలా కనీసం 40 వేల మంది రైతులు కిసాన్ ఏఐ ద్వారా లబ్ధి పొందుతున్నట్టు దాన్ని అభివృద్ధి చేసిన ప్రతీక్ దేశాయ్ తెలిపారు. వాధ్వానీ ఏఐ అనే స్వతంత్ర, లాభాపేక్ష లేని సంస్థ కూడా జనరేటివ్ ఏఐ సాయంతో రైతులకు వచ్చే సందేహాలను తీర్చేందుకు కిసాన్ కాల్‌సెంటర్ ఒకదాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉంది. వ్యవసాయ రంగ నిపుణుల అనుభవాన్ని జనరేటివ్ ఏఐతో అనుసంధానించేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు వాధ్వానీ ఏఐ తెలిపింది. డిజిటల్ గ్రీన్ పేరున్న అంతర్జాతీయ సంస్థ గూయీ ఏఐతో జట్టుకట్టి వాతావరణ మార్పులను తట్టుకునేలా రైతులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూండగా ఒడిశా వ్యవసాయ శాఖ ‘అమాకృష్ ఏఐ’ద్వారా పంటల నిర్వహణలో రైతులకు సమాచారం అందిస్తోంది. ప్రభుత్వ పథకాల వివరాలు, నలభైకు పైగా వాణిజ్య, సహకార బ్యాంకులు రైతులకు అందించే రుణ పథకాల వివరాలను ఈ చాట్‌బోట్ ద్వారా అందిస్తోంది.

తెలంగాణలో ‘మిర్చి, పసుపు’ పరికరాలు

మిర్చి, పసుపు పంటల్లో నాణ్యతను తేల్చేందుకు కృత్రిమ మేధ ఆధారిత పరికరాలను ఇప్పటికే వినియోగిస్తున్నారు. ఈ పంటలు ఏవైనా తెగుళ్లకు గురయ్యాయా? వాటిలోని రసాయనాల శాతం, రంగు, తేమ శాతం వంటి వాటిని నిమిషాల్లో తేల్చేస్తున్నారు. ఈ అంశాల ఆధారంగా మిర్చి, పసుపు పంటలకు గ్రేడింగ్ ఇస్తున్నారు. రైతులు తమ ఉత్పత్తులను త్వరగా మార్కెటింగ్ చేసుకోవడానికి, తగిన ధర పొందడానికి ఇది వీలు కల్పిస్తోంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.